శ్రీ

ప్రమద్వర

[పదంకముల కల్పిత నాటకము.]

కర్త

చిట్ట్రాప్రగ్గడ కామేశ్వర రావు

మొదటి కూర్పు

రాజమహేంద్రవరము

ఆంధ్ర సారస్వత నికేతనము వారిచే ప్రకటింపబడినది.

1917

రాయవరము.

శ్రీ మేరీ ముద్రాక్షరశాల

1917.

కృతి సమర్పణము

సాంఘహితోపదేశకుఁడును, దక్షిణహస్తమునై, మన్నించి
కాపాడు శాంతమూర్తి, పుణ్యపురుషాగ్రణి, దయా
నిధి, సత్యనారాయణాంకునకు, నా ద్వితీయ
సోదరునకు, కృతజ్ఞతాపూర్వకముగా,
మనోవాంఛిత క్ష్మాడేర, సీతరు
ణా కమలిమునునర్పించు
చున్నాను.

ఇందువచ్చుపాత్రలు.

పురుషులు

విజయసేనుఁడు.——కథానాయకుఁడు.

పురీంద్రసేనుఁడు.—ఒకసామంతరాజు కథానాయికతండ్రి

సుసేనుఁడు.——పురీంద్రసేనుని కుమారుఁడు..

హేమపాలుఁడు——ఒకక్షత్రియుఁడు.

పుళిందుఁడు.——కిరాతరాజు.

కళింగుఁడు.——పుళిందుని తమ్ముఁడు.

దుర్జయుఁడు.——పుళిందుని ముఖ్యసేవకుఁడు.

సుజయుఁడు.——కారాగృహాధికారి.

సుమిత్రుఁడు.——పురీంద్రసేనుని ముఖ్యసేవకుఁడు.

సుమంతుఁడు.——సంగీతగురువు.

వజ్రపాణి——హేమపాలుని యాంతరంగిక సేవకుఁడు.

న్యాయాధికారి——కాశ్మీరాధిపునిచేఁ బంపఁబడినవాఁడు.

స్త్రీలు:

ప్రమద్వర.——కథానాయిక.

రోహిణి.——చెలికత్తె.

సునంద.——ఒకముసలిది.

(సందర్భానుసారము మఱికొందఱువచ్చెదరు.)

ప్రమద్వర

ప్రథమాంకము

నాంది

వెలుఁగుచు సంతసంబు పృథివీవలయంబున నిర్మలాత్ములై
సలలిత మాధురీగరిమ సారెకు జిప్పిలి జీవకోటులన్
గలుపుచు, బంధనంబులను గల్పన సేయుచు మోదవర్తియై
జెలఁగెడు ప్రేమదేవి నివసించుత సభ్యులమానసంబులన్

(నాంద్యంతమున సూత్రధారుఁడు ప్రవేశించి)

సభామండప మలంకరించు సరసాగ్రేసరులారా! నా భాగ్యకారణమున మీ రెల్లరు నుత్సాహభరితాత్ములై నాటకవీక్షాకాంక్ష నేతెంచినారలు. హృదయరంజకమగు నాటకాభినయమునకుఁ గడంగవలయునని యత్నమొనర్చి విదుషీరత్నము నటీసహాయములేమి యాందోళనమొందవలసివచ్చె. ఆమెనుబిలిచి కర్తవ్యమూహింతును. —

(తెరవంక దిరిగి)

మనోహరీ! నటీ!

(నేపథ్యమున)

ఆర్యపుత్రా! వచ్చుచున్నాను.

సూ — (చూడ్పుసారించి) ఆహా!

తే॥ గీ॥ పంచబాణుని గొనయంబు వలె నిడుపగు
వేణిజీరాడ, పయ్యెద వివిధగతుల
గేలసవరించుకొనుచు శంపాలతగతి
వచ్చుచున్న దికన్నుల పండువడుగొ!

(నటి ప్రవేశించుచు)

పంచచామరవృత్తము.

మనోహరాంగ! శ్రీకుమార! మామకీనరత్నమా!
మనోగతంబుఁ దెల్పినాడు మానసంబుఁ దన్పవే!

(ప్రణమిల్లి) నాథా!

తే॥ గీ॥ పురుషునకు నర్ధదేహంబు గరిత గాన
నేఁడు మీమనోగతమున నిలచి, కలఁచు
సంశయము నెఱుంగఁ బలికితి సకియ ముద్దుఁ
దీర్పఁ బ్రార్థింతు ప్రణయంబు తేఁటపడఁగ

సూ—మనోజలక్ష్మి! సొంపుగుల్కు మందహాసబంధురం
బుగీముఖంబుఁ గన్గొనంగ మోదమబ్బు సుందరీ!

ప్రేయసీ! ఈసభ్యుల నలరింపఁజేయఁగలుగు నాటకాభినయము నకుఁ గడంగవలయునని నిశ్చయించి, యేకథ రసోదంచితమై యుండునా యని యోజించి, భావింపఁజాలనైతిని.

నటి—ప్రియా! మొన్న సాయంకాలము గాలిమేడమీఁద నాప్రియచెలి మధురిక గ్రంథంబొండు చదువుచుండెను. నేదానిం డగ్గఱి, "చెలీ! ఆపుస్తకమేమే!" యనియడిగితిని. సంతోషము సూచించుచు నామె, "చెలీ! ఎఱుఁగవా! ఇది, ఆంధ్రసారస్వతనికేతనము వారిచే నూతనముగాఁ బ్రకటింపఁబడిన ప్రమద్వరయను దృశ్యప్రబంధము. గంగవంశమను

పూర్వధరణీధర శృంగమున నుజ్జ్వలకాంతులు జిమ్ము విభాకరుఁడు, కృపామయ మహీవల్లభుని రాజధాని, బృహత్కిమిడి గ్రంథకర్త జన్మస్థానము. ఆతఁడు చిత్రావూరివంశ మహార్ణవసుధాధాముండగు సర్వేశ్వరభట్టునకు పౌత్రుఁడు. సత్యవాక్య భవాధ్యుఁడగు కామేశ్వరుని ప్రియకుమారుఁడు. కామేశ్వరాభిధేయుఁడు. ఆతఁడు కల్పనాచమత్కృతి విడంబింప నీనాటకమును రచించెను. చెలీ! నీవుకూడ దీనినొక్కసారి చదువుము." అని పలికెను. ఆర్యపుత్రా! ఆనాటకమును నేను కడముట్ట చదివితిని. దానిని ప్రదర్శించిన మీ యభిమతమీడేరునని తలంతును.

సూ—సఖీ! తన్నాటకాంతర్గత కథ పురాణప్రసిద్ధమా? లేక ఇతిహాస విలసితమా?

స—ప్రియా! ఈకథ పురాణములందుఁ గానఁబడదు. ఇతిహాసము లవమైనఁ బొడమదు. కేవల కల్పనాత్మకము.

సూ—అట్లయిన నీతిబోధకము కాదేమో?

స—ప్రియా! నాటకములు నీతులుగఱపఁ గంగణమును దాల్పవు. సదయులగు సభికులు కూడ నీతులు నేర్చుకొనుటకే నాటకమునకు రారు. నాటకముల ముఖ్యోద్దేశము ప్రమోద మొసంగుట. హరిశ్చంద్రనాటకముఁజూచి సత్యముపలుక నేర్చుకొననెంచువా రెవ్వరుందురు? విశ్వామిత్ర వసిష్ఠుల వాక్కలహమును విని నవ్వులుకూరువారు కొందఱు. చంద్రమతి హరిశ్చంద్రుల దుర్దశకుఁ గన్నీరుఁ గార్చువారు కొందఱు నక్షత్రకుని నిష్ఠుర మనోగతిమునకు గోపమును, జాలియును, బూను వారుగొందఱు. తుదకుమాత్రమందఱును నాటకశాలనుండి పైకేగుదెంచునపుడు ప్రమోదభరితులగుదురు. చూపరులు నీతి గ్రహించువారుకొందరుండవచ్చును; గాని నీతిగఱపుటే నాటకముల ముఖ్యోద్దేశము గాదు. ప్రమద్వరనువ్రాయునపుడు గ్రంథకర్త రసగ్రహణ ధురీణుల

గు సభికులమనోరంజక కారణమగు కథనుకల్పించెను. ప్రియా! సకల దేశీయుల నాటకవాఙ్మయము వాంఛింమనదింతియా. అదియా డేరు నేని తన లేఖిని యదృష్టవతియని కవిసంతసించును.

సూ— ప్రేయసీ! అట్లయిన, ఆనాటకమునే యాడుదము. ఇప్పుడు చాల వేళయైనది. పూర్వదిక్సతి వినోదార్థమెగరవేసిన పారావతమువలె చంద్రుఁడు మెఱుఁగెక్కి మిన్నునలంకరించుచున్నాఁడు. పాత్రలుసిద్ధముఁపవలయును. రమ్ము. పోవుదము. (నిష్క్రమింతురు.)

విష్కంభము.

ప్రథమరంగము

ప్రదేశము. ముల్తానునగరముననొక సౌధము.

(ప్రవేశము. పురీంద్రసేనుఁడు విచారగ్రస్తుఁడై.)

కటకటా! దినములొకతీరున జరుగనేరవు; కాలచక్రమొకతీరున్ దిరుఁగునని తలఁచుటవెఱ్ఱి.

ఆ॥ వె॥ నిలువనీడలేని నిరుపేదవారల
సింహపీఠమందుఁ జేర్చి, పిదప
నిబిడవన్యసీమ నిడుమలఁబెట్టెదు
కాలమా! మెఱుంగఁ గలమెనిన్ను!

ఔను! నాయెఱింగినంతదనుక నేనాతనియెడ దోషమెట్టిదియును జేసియుండలేదు. అట్లయినను, నాయందాతని కాగ్రహము గలిగినది.

సీ॥ హృదయంబుసాక్షిగా సంచివరించిన
సతిఁబాసియుతివ నెవ్వతె నెఱుంగ

ఘోరస్వార్థపరులు కాడినయర్థంబుఁ
దత్రితోఁ నన్నొనరింపఁ దప్పియెఱుఁగ
ప్రజలకేరికైనఁ బాములుగల్పించి
దుఃఖానలంబునఁ ద్రోసియెఱుఁగ
శరణన్న శాత్రవుఁ గరమనురక్తితోఁ
గనక కాఠిన్యతఁ గాంచియెఱుఁగ
తే॥ గీ॥ విమలదేశాభిమానంబు విడచుటెఱుఁగ
రాజభక్తిఁ బోనాడి, దురంతములకు
వసతిమానసగృహమువం దోస్థఁగియెఱుఁగ.
నకట! యీగతికిఁగతమే మగునో చెపుమ?

రెండుదినములలో జన్మభూమి విడువవలయును! తీవ్రమగు రాజాజ్ఞ మీరితినా, ప్రాణములు దక్కవు. హా! మల్లానురాజ్యలక్ష్మి! నిన్నుఁ బాసి నేనెట్లుసుఖింప నేర్తును?

చం॥ చినతనమాదిగా నేడము సేయక, లేశముజింత లేక, నె
మ్మనమున నీయనన్యకృప మాటికిమాటికి సంస్మరించి సం
జనితముదావహంబునఁ బ్రశాంతమతిన్ జరియించినానునే
డనయముదోఁచె, నేవిధమవ్యాకులపాటుహరించు నకటా!

హా! హతవిధీ! సముద్రుఁడు గర్భస్థిత రత్నసముదయంబుల కత్యంతానందమొందు యుష్పాంగురీతి నాసంతానమ్మునుగాంచి ముదియించుంటిని. సంపదలను గొంతయిలుంగ నైతిని; విశదంబగు యశంబు నార్జించితిని. ఎవ్విధిఁదలపోసిచూడ నేనదృష్టవంతుఁడనని దృఢముగా నమ్మికొంటిని. నన్నెఱింగినవారెల్ల రశ్లాఘించిరి. నేఁటికి నీయనుగ్రహమువలన

నిట్టిదుర్భరదుర్దశ సంప్రాప్తించెను. హా!—

తే॥ గీ॥ నిర్మలయశో సుధాంబుధి యూర్మిడోలి
కలనీరంతర మూగాఁడు ఘనతఁబాసి
దుర్యశోవీచి కలనెట్లు దుఃఖపడుచు
నుండువాఁడను; గతియేమి యోయెఱుంగ!

నాయెడలోప మెట్టిదియును గలిగియుండలేదని యధికార ముద్రవహించిన యుత్తమోత్తములెందఱో యాతనితోఁ జెప్పిరి; గానికార్యములెడాయె. ఔను, రాజులకు నిజానిజములతోఁ బనియేమి? ఆశ్రితులమాటలు వేదతుల్యములు.

ఆ॥ వె॥ తన్నునాశ్రయించి ధర్మమార్గముబాసి
పలుకువానినమ్మ నిలధవుండు;
ప్రక్కనున్నముండ్లమొక్కపైఁబ్రాకదే
లతసతంబువక్రగతులుబూని?

అయ్యో! వీఁడిపై రాజోత్తముఁడగు పురపాలుని దూషింప నేమిటికి? నాయదృష్టమిట్లుండ నెవ్వరేమిచేయుదురు? జన్మస్థానవియోగదుఃఖమనుభవింప వ్రాసియుండఁ దప్పునా? అనుభవించితీరవలయును.— నా గతియెట్లయినను విచారింపను.

చ॥ సిరిగలయింటఁబుట్టి గుణసింధుల చెల్మిగ్రహించిమించి సం
బరమునఁగాలయాపనము మానుగఁజేసితి, కీడుబొందినన్
బొరయదుదుఃఖమించుకయుఁబూతచరిత్రులుపుత్రులున్గుణో
త్తరసుతయున్విదేశములదానెటులుందురటంచుఁగుందెదన్

ఆ॥ వె॥ హిమమరీచితనదు కమనీయతనువల్లి

సోఁకనేని యోర్వ లేక, నన్ను
రనెడు బాల యిడుములను దెలియేరీతి
గట్టుఁజేరి బ్రతుకఁ గలుగునకట?

ఉత్తరక్షణమున నేమి వచ్చునో యెఱుంగఁ జాలము. హా! ధీవిశాలా! సురపాలా!

శా॥ క్రూరాత్ముండు కళింగరాజు మనపైఁ గోపించి సైన్యంబుతో
వీరాలాపములాడుచున్ నడచి దోర్వీర్యంబుఁ జూపంగ నాఁ
డేరీతిన్ వధియించి వానిని ముదం బీవొంద వర్తించితిన్;
గారాబంబునఁ జూడ వేయుపుడు;నా కర్మంబు దూషించెదన్

(సేవకుఁడు ప్రవేశించి)

దేవా! హేమపాలుఁడు తమదర్శనాపేక్ష వేచియున్నవాఁడు. మదలయాగు నేని తోడ్తెచ్చెదను.

శు. సే.—ఏమీ! కళ్యాణిపురాధీశ్వరుఁడు హేమపాలుఁడా? (ఆలించి) ఆహా! నా భాగ్యమేమందును? ఆతని సమక్షమునకు దారిసూపుము.

(సేవకుఁడు ముందు నడువ, హేమపాలుని సమీపించును.)

హేమపాలకుమారా! స్వాగతము.

తే॥ గీ॥ కుశలమా మీకు దిగ్దంత విశదకీర్తి?
క్షేమమా మీకు విద్వేష సింధురహరి?
ఆయురారోగ్యమా మీకు నవనినాథ?
కలిగె తులలేని మీరాక కలిమి మాకు!

హే. పా.—ఆర్యోత్తమా! నిర్భాగ్యుఁడనగు నాకు గుశలమగా కేమి? మీరు వినియేయుందురు.

చ॥ అతులితసత్ప్రతాపమహిమాఢ్యుఁడు, సద్గుణశేఖరుండు, సం

తతవిజయుండగు మన్మథుఁడు ధన్యుఁడు మాతౌలిజన్ముఁడక్కటా!
పతితులచేవధింపఁబడి భంగము నొందుట నెన్ను నప్పుడా
తతము విషాదమయ్యెడు, నుదారచరిత్ర! భరింపశక్యమే?

హా! ఆవరగుణాభరణమూర్తిని, యతిశుభతరకీర్తిని, దయాప్రపూర్తినిఁ దలంచినఁ, గొనియాడినఁ, దనివితీరునా?

పు. సే— రాణిమారా! గతము ద్రవ్వనేమి కారణము? విచారింపకుము. గతించినవారు మనవారు కారు. ఆతని యప్రతిమాన ప్రతాపంబు, నతులసుగుణసంపత్తి నెఱుంగనివా రెవ్వరుగలరు? అతఁడు మనలను బాసి మర్త్యులోకమంతయు బంధురవిచారవంతముగాఁ జేసినాఁడు. తనువులు శాశ్వతములు గావని దృఢమనస్కులమై శాంతి వహింపవలయును.

హే. పా— ఆర్యా! మీమాట సత్యము; కాని,

చ॥ చటులపరాక్రమంబున రసాతలమంటగ వైరివీరులన్
జటులనఁ జేయువాఁడమర సంస్తుతవర్తనుఁ డేగమొండినై
పటుతర దేహలోభమునఁ బ్రాణములన్ విడనాడకీగతిన్
గటకట! యున్నవాఁడ; తొలికర్మము లెట్టివి చేసినాఁడనో?

పు. సే— అవును. మీయన్న సత్యపాలుఁడు సార్థకాభిధేయుఁడు. ఆతనికోతఁడే సాటి. సత్యపాలుని సఖియు సుమిత్ర సుచరిత్రి. విశేషించి సువివేకనిలయ. పాపము, దురాత్ములెవ్వరో యాదంపతులను నిష్కారణముగ వధించిరి. ఇంతకు,

తే॥ గీ॥ వనిధివలయితధారుణీ వరులుగాని,
చేరుటకుఁ, దినుటకు, లేని వారుగాని
చమురు తేనట్టి దీపము సరణి నంత

రింతురు భయదమరణజిహ్వాంతరమున!
విచారించిన లాభము లేదు. ఎందఱెందఱు నృపోత్తము లుద్భవింపలేదు? ఎన్నెన్ని మహాత్కార్యము లాచరింపలేదు? వారెందు రిప్పు డేరీ? మృత్యుదేవత వారియెడ జాలిఁగొనియెనా? అందఱు నామెకు సమానులేసుమా? హేమపాలా! మేడమీఁదికరుగుదము రమ్ము.

(సౌధోపరి భాగమునకుఁ బోవుదురు)

హే. పా.—ఆర్యా! నేనిట కరుదెంచునపుడు మీచరితంబాలించి యుంటిని సత్యాసత్యము లెఱుంగునంతదనుక నాచిత్తం బుత్తలపాటందుచున్నయది.

పు. సే.—కుమారా! ఆయాసనమధిష్ఠింపుము. సర్వము నీకు నివేదించెదను. (హేమపాలుఁడు కుర్చీలోఁ గూర్చుండును.) ఎఱుఁగుదువుకదా, ముల్తానువిభుని సురపాలుని, అతఁడు సుగుణాలవాలుఁడయ్యు, నార్తజనావనుఁడయ్యుఁ, ప్రజానురంజకుఁడయ్యు, నాదురదృష్టకారణమున నిర్దోషినగు నాపై నాగ్రహముఁ గొని యీనగరమును వీడుకొలుపవలయునని యుత్తరువు జేసినాఁడు. ఆతని యాజ్ఞ యనుల్లంఘనీయము. ఎల్లి నేనీరాజ్యమును బాయకుందునేని, సురపాలక్ష్మాపాలుని యాగ్రహాగ్నికి నింధనము గావలసివచ్చును. కాశ్మీరంబు సుభిక్షంబని వినికి. అందువాసంబు నాకభిమతంబు. అచటి ప్రకృతి సౌందర్యావలోకనమున సంతాపనీరదములు హరించును. మామకీనమనోతలమును పట్టముగాఁ గప్పియున్న దుఃఖాంధకార మాకాశ్మీరరాజవద్దన బాపునని నమ్మకమున్నది.

హే. పా.—అయ్యో! మీ కెంత కష్టము వచ్చినది. సురపాలుఁడు సురపాలుఁడనియే వాడుక. మీరు సద్గుణమూర్తులరు. మీయందాతని కాగ్రహకారణమగోచరము. శాంతమూర్తులకుఁ గోపము రానేరాదు; వచ్చెనేని, యెదిరివారల నాశనము సేయకమానదు. ఆతఁడు విధించినటుల

మీరీనగరమును సకాలమునవిడచుట శ్రేయంబు. ముందుముందు నిజానిజములు బయలుపడును. ఈనగరమున మాగృహమున్నయది. అదియొకవిశాలమైన భవనము. అందుమీరు వాసంబు సేయవచ్చును. నేనిప్పుడు కార్యాంతరమున ముల్తానులో రెండునెలలుండవలసియున్నయది. సమయమగు వేని సురపాల ధరణీశుని దర్శించి, మీయందాతని కాగ్రహ కారణంబరయువాఁడ. నాసేవకుఁడను వజ్రపాణిస్వామిభక్తికిఁ బెట్టినదిపేరు. వానినిమీవెంట నంపెదను. మిమ్ములనువాఁడా గృహమునఁ బ్రవేశపెట్టును.

ప్ర. సే — ఆహా! మీ మానసఁగల కూర్మి నిరుపమానము.

ఖండ స్రగ్విణి.

హేమపాలా! దయా
సీమ!నీ సద్గుణ
స్తోమముల్ జేర్కొ-నన్
లేము సుం తేనియున్.

హే. పా — మీరు పోయెదరు; గాని, మాగృహమున దయ్యములు గలవని మిమ్ము పెక్కండ్రు జడిపింతురు. మీరుమాత్రమిట్టి పిచ్చి యనుమానములకు లోబడవలదు. మీపిల్లలకీవిషయమై చెప్పవలదు. చిన్నవారగుటవలనవారు భయపడియెదరు సుఁడీ!

ప్ర. సే — నాకుమారుఁడు సూసేనుఁడు సమరవైరి వీరభయంకరుఁడు. అతఁడిట్టి మాటలాలించిన హాస్యము సేయును. విజయసేనుఁడు బలప్రదీప్త గర్వితవైరాపహారి. ఉదయమార్తాండ ప్రచండుండు. అతఁడెన్నఁడిట్టి పిచ్చియనుమానములఁ బూనఁడు. నాకుమారిత ప్రమద్వర గుణరత్ననిధి. మీరామెనుగూర్చి వినియేయుందురు.

హే. పా — ఆర్యా! ప్రమద్వర జగతీజనంబుల జిహ్వారంగస్థలి నాట్యమా

డు మన్నియది. ఆమెను జూడవలయునని నే నెన్నిమారు లభిలషించితిని; గాని నాయభిలాష తీరలేదు. (మెల్లగా) నేఁడామెను జూడ నెంచి, యేనిటకరుదెంచితిని. మీరంగీకరింతురేని యామె నర్ధాంగిగా వడయుటకు సన్నద్ధుఁడను. మీ బాంధవ్యము నే వాంఛించుట నిష్ప్రయోజనముగా నుండునని తలంచెదను. తలంచుటే కాదు; దృఢముగా నమ్మెదను.

పు. సే— అహా! నేఁడెట్టి సుదినము! నా మనోధ్యానము కాంతిమంతమైనది; అయినను హేమపాలా! తొందరపడి వివాహకార్యములు సేయరాదు. నిలకడవహింపవలయును.— ఆమెను జూతువేని నీ మనం బెటులమారునో? (ఎలుగెత్తి) సేవకా!

(సేవకుఁడు ప్రవేశించి)

దేవా! అనుజ్ఞ వేఁడెద.

పు. సే— ఓరీ! నీవుపోయి సుసేనవిజయసేనులను, ప్రమద్వరను సత్వరమ రమ్మంటివనుము.

సేవకుడు— మహాప్రసాదము. (నిష్క్రమించును.)

హే. పా— ఆర్యా! ప్రమద్వర కిప్పుడు ప్రాయమెంత? విజయసేనుఁడు మీ తనయుండా?

పు. సే— ఆమెకిప్పుడు పదునారువత్సరములు పూర్తియైనవి. రాకుమారా! విజయసేనుని చరితంబు నాకేమియును దెలియదు. అతని తలిదండ్రు లెవ్వరో యెఱుంగుటకుఁ దగిన విషయములు మాకు లభింపవయ్యె. అతని గుణగణంబులు వర్ణనాతీతములు. నన్ను 'అప్పా!' యని పిలుచును. పాపము! వానికేమి తెలియును? నిజ మెఱింగినవాఁడనయ్యు నే నాతనిని 'కుమారా!' యని పిలుచుచుందును.

(సుసేనవిజయసేనులును ప్రమద్వరయును, ప్రవేశింతురు.)

పు. సే.— కుమారా! సుసేనా! రమ్ము. విజయసేనా! భద్రమా! కుమారీ!

ప్రమద్వరా! నీవు శుభంబే? అదిగో, హేమపాల ధరణీకాంతుఁడు. ఆతఁడు మిమ్ములఁజూడ వేడుకపడి యరుగెంచినాఁడు. ఆతని యాశీర్వచనమ్ములఁ బడయుఁడు.

(సు—వి. సే—ప్ర— హే. పాలునకుఁ బ్రణమిల్లుదురు.)

హే. పా—దీర్ఘాయుష్మంతులగుదురుగాక! (ప్రమద్వరనుజూచి, యాత్మగతమున) ఆహా! ఆకళ్యాణి రూపరేఖావిలాసము లేమనికొనియాడుదును! భూలోకమున కవతరించిన మోహినియా?

కం॥ హరిణీనయనకు నెనయే
హరిణీనయనలును లేరు; హరిహయుసతియో?
హరు నర్ధాంగియొ? హరికిన్
హరువగు సిరియో? యెఱుంగ నగు నేనాకున్

మానవకాంతకిట్టి సౌందర్యముండ నేర్చునా? ఆహా! త్రిలోకమోహన తనూవిలాసిని యీసుమాంగి!

కం॥ తోలుకారు మెఱుఁగుతోడను
దులతూఁగెడు మేనుగలిగి తోయజముఖి, పూ
విలుకాని శరాళికినన్
బలిఁజేసె నికేమిసేతు భరియింతు నెటుల్?

హాయందిమె కట్టి భావముదయించెడినో? ఔరా!

సీ॥ రోలంబజాలంబు రోఁత సేయఁగఁజాలు
నెఱికొప్పు గన్నులఁ గఱవుఁదీర్చు
నింపుసంపఁగ శంక మొందఁ జేయఁగఁజాలు
వదనంబు చింతలఁ బారఁదోలు

వికసితకుముదార విందంబులనుబోలు
కన్నులానందంబుఁ గలుగఁజేయు
నరుణదీప్తులఁజిమ్ము యధరబింబంబువా
గమృతంబుఁజిలికి వికాశమొసఁగు

తే॥ గీ॥ అహాహా! మానససీమ నత్యంతముదము
వాసమును జేయునిప్పుడు, వనరుహాక్షి
యేమనునో? పాలముంచునో? యిష్టపడదొ?
నీటముంచినఁ బ్రాణము లేటికిలను?

౨. సే— హేమపాలా! ఏమట్లున్నాడవు. నీముఖంబున మార్పుతోఁచిన దేమి?

హే.పా— ఆర్యా! క్షమింపుఁడు. ప్రమదాశిరోమణియగు ప్రమద్వరను గాంచినంత ప్రమదాంబుధి మునిఁగిపోతిని. ఆహా!

౮॥ పలువురు సుందరాంగియని వర్ణనసేయఁగ నాలకించి, సం
కలిత ప్రమోదమూర్తినయి కాలముఁబుచ్చితి గానిమన్మనో
నిలయనునీ ప్రమద్వరను నేఁడుగనుంగొని జన్మమంతయుఁ
ఫలితముజేసినాఁడ, నవ భానుఁడు పద్మినిఁ జూచునట్లె వడిఁ

ధర్మజ్ఞా! పురీంద్రసేనా! నా చెప్పినవిషయము మరల చెప్ప నేల? అందువిషయమై శ్రీనగరముస్సుమగిడి సేనరుచెంచునప్పుడు. నాకై శెఁగింపఁబ్రార్థితులు.

(సు—వి. సే—ప్ర—నిష్క్రమింతురు.)

. సే— అటులనే చేసెదను.

॥ ఆనవలాంలలామ తగు నంగననీకుఁ, దలంచిచూడనీ

నానళినాక్షికిం దగుదు వన్నివిధంబుల, మీవివాహముం
బూనియొనర్చుటే శుభము పొచ్చముగాని తలంపుతో ముదం
బూనినవారిజాక్షచంద్ర! యనుమానముమానుము, వేయు నేటికిన్

ఈవిషయమునుగూర్చి యాలోచింపఁదగిన దేమియును లేదు; గాని ప్రమద్వర మనోగతమెఱింగినఁగాని నేనేమియును జెప్పఁజాలను. మీరు శ్రీనగరమువదలుచుండునపుడు మత్పుత్రికాకరగ్రహణము మీకొర్పించుటనుగూర్చి నిశ్చయమెఱిఁగించెదను.—వజ్రపాణినిఁ బంపువార లుకవాకి

హే. హ.—తప్పక ప్రయత్నించెదను; గాని నామాటాలింపుడు. మాయన్న సత్యపాలుఁడు దారుణమృత్యుముఖంబునఁ బడినవాఁడగుట, నాతనికి కుమారులు లేమి, నేనిప్పుడు కళ్యాణపురాధీశ్వరుఁడనైతిని. నాగూర్చి చెప్పుకొనుట లక్షణముగాదు — నాకడమాట యేమందురా?

ఉ॥ రాకరతత్రిసాంద్ర! రిపు రాడిభమోదివనాథ! నామనో
బీజము దుఃఖకీటకమ పేశుయొనర్చి కృశింపఁజేసె; నం
భోజదళాయతాక్షినగు మోముకతంబున నంకురించు, మీ
రిజతనంబు మానిన నిఁ కేమిదచింపుదు; మీరెఱుంగరే!

ప్ర. సే.—మీరింత గాఁ జెప్పవలయునా? సర్వగతుల మీమనోభీష్ట మనుసరింపఁ బ్రయత్నించెదను.

హే. హ.—(తొందరపాటభినయించి) అబ్బా! ఎంతవేళ యైనదిక్కి

తే॥ గీ॥ భానుఁ డపరాబ్ధియందునఁ బడియె; తార
లొకటితరువాత నొకటిగాఁ బ్రకటితంబు
లాయె; తిమిరేభసింహాస్యుఁ డాకసమున
లలితమూర్తి పొలిచె మృగలాంఛనుండు!

ఆర్యా! నాకు సెలవొసంగుడు. మీతో సంభాషణము కాలపరిమాణ మెఱుంగనీయదు. నేపోయి వచ్చెదను.

(హే. పా. మెడదిగి నిష్క్రమించును. పు. సే. లోనికరుగును.)

ద్వితీయరంగము

(ప్రదేశము. శ్రీనగరమున నొక సౌధరాజము. ప్రవేశము. వజ్రపాణి.)

హేమపాలభూనాథుని యనుమతివడపున పురీంద్రసేనుని గుట్టుంగా గాతంబుగా నీ సౌధంబునఁ బ్రవేశపెట్టితిని. వారికెట్టిలోపములును గఁ బండ మెలఁగుచుంటినని నానమ్మిక; వారును దమకెట్టిలోపములును గనటులనూచింపలేదు. పురీంద్రసేనుని పరిచారకుఁడు, సుమిత్రుఁడు సహాయ్యుఁడు; స్వామికార్యనిర్వాహణదక్షుఁడు. నిన్నరాత్రి నన్నాడు జేరంజీరి, "వజ్రపాణీ! నీతోఁ గొన్ని విషయములు మాటాడవలసి యున్నది. ఇప్పుడు చాలరాత్రియైనది. రేపునిన్నుఁ గలిసికొనియెదను." యని వాక్రుచ్చెను. ఆతఁడు నాతోఁ జెప్పనెంచిన విషయమేమై యుండునో కో? హేమపాలునిఁగూర్చి యాతఁడేమైన వినియుండునా? ఆరహంబెఱుఁగుటకు హరిహరాదులకైన శక్యంబుగాదు! (చూడ్కి సారించి) చ్చువారెవరు? (పరికించిచూచి) ఓహో! సుమిత్రుఁడే! (ఎలుగెత్తి) త్రమా! నీకై వేచియున్నాఁడను.

(సుమిత్రుఁడు ప్రవేశించును.)

—వజ్రపాణీ! నీకై వెదరయుచుంటిని; అందున నాలస్యమైనది. పాపము! నాకై వేచి నీవెంత విసిగితివో! నీవు శ్రమగలిగించి నందులకు నన్ను మన్నింపుము.

పా—సుమిత్రా! ఇందు మన్నించుటకేమున్నది? నాతో మాటాడవలసి

యున్నదని నిన్నరాత్రి పలికితివి. సదుత్తరమొసంగఁ గలుగువాఁడ నేని ధన్యాత్ముఁడను.

సు—మిత్రమా! ఈసౌధమునఁ బ్రవేశించి వారముదినములైనది. ఇట కరుదెంచునపుడెందఱో మస్మోహార్మ్యమునఁ జేరవలదని వారింపఁ జూచిరి. కారణమరయనిందు దయ్యములున్నవని జవాబుచెప్పిరి. వారిమాటయందు నేనించుకేనియు విలువయుంచను. చిన్ననాఁటఁగోతె నీవు హేమపాలునిఁ గొల్చుచున్నవాఁడవు. ఈగృహమునుగూర్చి నీకంతయుఁ దెలిసియుండవలయును. నీవువచించునది సత్యమని నమ్మెదను. నాహృదయతలమున గాఢముగ నాటుకొనియున్న యీ సంశయమును దీర్పఁగలవాఁడవని నమ్మికొంటిని.

వ.పా—చెలికాఁడా! నీవువినినది కేవల మనృతముగా నేరదు. దయ్యములున్నవని చెప్పుటను నేనెన్నఁడు నిక్కడే కాదుకదా, మఱియెందు ననుగూడ జూచియుండలేదు. ఒక్కనాఁటిరాత్రి సత్యపాలుని సకియ శయనాగారమున నొకనీలాకృతిఁ జూచెనట! అది మెల మెల్లన మనుష్యాకారమును బూనెనట. సుమిత్రి భయవివశయై కేకలిడెనట! సత్యపాలుఁడామెను సమీపింపఁని, యనునయించెనట. ఇంతియ నాకుఁదెలిసిన విషయము. శయనాగారమున శ్యామలాకృతి గానవచ్చుటేమి? క్రమక్రమముగా మానవాకృతి వహించుటేమి? దీని యర్థము నాకింత దనుక తెలియకున్నయది. సుమిత్రా! నీవిట్టి యనుమానములను మనంబునఁ జొటొసంగకుము.

సు—వజ్రపాణీ! సరియె.—హేమపాలుఁడు ముల్తాను నగరమున రెండు నెలలుండునట, కారణము? మా ప్రభువగు పురీంద్రసేనుఁడు నాకుఁజెప్పకఁదా నేమియుఁ జేయఁడు. హేమపాలుఁడు గూడ నీయందట్టి నమ్మకము గలవాఁ డనియనుకొందును.

వ.పా—మిత్రమా! నాకు తెలియని విషయము మాతనికిఁ దెలియదు. స్నేహి

తుఁడవగుట వలనఁ జెప్పుచున్నాను. నిజముగా హేమపాలున కా నగరమునఁ బనియేమియును లేదు. ప్రమద్వరను జూడ వలయునని యాతఁడందుఁ బోయి యుండెను. మరియును ప్రమద్వరను నర్ధాంగిగాఁ గైకొన నెంచిన వాఁడగుట, తద్విషయమై ప్రయత్నములను జేయుచున్నవాఁడు.

ం—అటులనా? ఆతని యభీష్టమున కంతరాయము గలుగకుండుఁగాత!

.పా—ఒక సంగతి యడిగెదను. కోపమూనవు కదా? పురీంద్రసేనునితో నిటకరుదెంచిన విజయసేనుఁ డాతని బంధుజనుఁడా? లేక యాతని కుమారుఁడా?

ం—విజయసేనుఁ డాతని కుమారుఁడు గాడు. ఆతని చరితం బతివిచిత్రంబు. పురీంద్రసేనుని వివాహమహోత్సవమ్ము జరిగి నేఁటి కిర్వదివత్సరంబులైనది. వివాహానంతర మొకనాఁ డాతఁడు చావడియందుఁ గూర్చుండి, కొంతవడి స్నేహితులతో వినోదగోష్ఠిఁ బుచ్చెను. పిమ్మట వారల వీడ్కొలిపి లోనికరిగెను. మధ్యరాత్రమున నాతనికొక యార్తనాదము వినవచ్చెను. ఆతఁ డులికిపడి శయనాగారమును వీడుకొలిపి చావడిలోనికరుదెంచెను. ఆతనికన్నుదోయి కొకబాలుఁ డగ్గమయ్యెను. ఆశ్చర్యనిమగ్నుఁడై యా చిఱుతప్రాయంపు బాలుని నెత్తుకొని యాతఁడు మేడమీదికరిగి, నన్నుఁ జేరంబిలచి, “సుమిత్రా! ఈబాలుఁడు రూపజితమన్మథుఁడు. వీనియందు నాకనురాగము జనించినది. వీనిని బెనిచి, పెద్దవానిని జేయ నాకభిమతముగలదు. నీయభిప్రాయమేమి?” యనియడిగెను. నేనందులకొడంబడితిని. ఆనాఁటఁగోలె నాబాలుని విలువిద్యయందసమానునొనరింప నాతఁడు ప్రయత్నించెను. ఏవిద్యల నేర్పఁగడంగినను, సునాయాసముగ గ్రహించువాఁడగుట, ‘విజయసేనా!’ యని యాతఁడాతనిం బిలుచుచుండును. పురీంద్రసేనుని కుమారుఁడు, సుసేనుఁడు; తనూజాత ప్రమద్వర.

వ. పా—మిత్రమా! నీమాటలువినుకొలంది నాకుత్సాహమధికమగుచున్నది. మఱియొకమాట. దిక్కులేని విజయసేనుని బెంచి, పెద్దవానిగా నొనరించిన పురీంద్రసేనుఁడాతనికిఁ దండ్రి సమానుఁడు. ప్రమద్వరయాతనికి సోదరితుల్య. అట్లయ్యు, విజయసేనుఁడా మెనువరింప,—

సు—(అర్ధోక్తిలో) వజ్రపాణీ! నిజానిజములెఱుంగక నీవిట్టిమాటలాడరాదు. విజయసేనుని నీవెఱుంగవు. అతఁడు సుగుణరత్నాకరుఁడు. కుముదాప్తునకైనఁ గళంకమున్నది. గాని యాతనియెడ నెట్టిలోటుపాటును లేవు. ఇవి నేఁ జెప్పుమాటలుగావు; లోకమంతయు నెఱిఁగినవిషయము. ఇంతకు హేమపాలునచే నిశ్చయింపఁబడిన కన్య నొండొకఁడు జూడఁగలఁడా?

వ. పా—క్షమింపుము. తెలియక నిన్నడిగితిని. నాసందేహము న్యాయమగునదికాదు. మిత్రమా! మఱలనిన్నుఁ గలిసికొనియెదను. మీయజమానునకేమికావలయునో యెఱుంగవలయును. ఇప్పటికి నాకు సెలవొసంగుము.

సు—నేనుగూడఁబోవలయును. సంసేనకుమారుఁడు మృగయా విహారార్థము సమీపారణ్యభూములకరుగును. అందుకువలయువిధము నాయత్తపరుపవలయును. మఱలకలిసికొందము.

(చెరియొకవైపు నిష్క్రమింతురు.)

తృతీయరంగము

(ప్రదేశము. ఒకయాగారము. ప్రవేశము. విజయసేనుఁడాసనాసీనుఁడై.)

అవును. ఆమెయే నామనోహరి. ఆరమణీమణీ దరహాసకౌముది మన్మనోతలమును విశుభ్రకాంతి మంతము నొనరించెడిని. ఆసుగుణాలవాల నా మక్షమున నుండునేని భూలోకము స్వర్గధామమగును. అప్పటి యానం

దోత్సాహ సంభ్రమంబులు వర్ణింప నేఁజాలను! ఆహా!

సీ॥ తలిరాకుఁ బోణినిఁ గలనైనఁ బాయను
మఱుగయ్యె నేమి సమక్షమందు?
కలకంఠవాణి బల్కాడు నెప్పుడు నాతో
మాటాడ దేమి సమక్షమందు?
గానముల ప్రోక సద్గోష్ఠిఁ బాయుచు నన్ను
మఱచెనా? యేది సమక్షమందు?
నవలావతంసము, నామనోనిలయ, ప్ర
మద్వర లేదు సమక్షమందు!-

తే॥ గీ॥ అతివఁ బాసిన క్షణము శతాబ్దమగును!
సతినిఁ జూడనియప్పుడు విశాలగగన
తలమున హిమమయూఖ మండలము లేని
చందమునఁ దోఁచు, నెటు సైచి యుండునకట!

(చెక్కున కరంబాని.)

హా! ప్రేమమా! నీవెంత యపరాధ మొనరించితివి?

చ॥ కనులను మూసి సౌఖ్యత్తర గాఢసుషుప్తినిఁ దేలియాడునే
ళనో, కమనీయలక్షణ విలాసిఁ బ్రమద్వరఁ గాంచునప్పుడో?
మనమున నామె సద్గుణ సమాజము వర్ణనసేయు కాలమం
దునో? యెపుడో యెఱుంగను వినోదము గానను గాసిపెట్టితే?

తే॥ గీ॥ కరుణఁ దలపోసి మ్రొక్కెంతు గద్దెపైనిఁ
గరుణతొలఁగిన దుర్గతు కాననముల

గ్రమ్మరంగను జేతువు; గూడినిన్ను
మోదమొందిన వారలీ భూమిలేరు

ప్రేమమా! నీచెలికార మంగీకరించితిని. నీవలన సుఖింతు నను నాశ లేశము లేదు. అట్లయ్యు నిన్ను విడువఁ జాల కున్నాడను.

తే॥ గీ॥ కన్నులకు నించుకైనను గానరావు;
అఖిలలోకంబులందుఁ బ్రత్యక్షమీవు!
నీయునికియట్లు చిత్రంబు నీదుబలము!
నిన్నునమ్మిన నగునేమొ యెన్నఁగలమె?

(ఇంచుక యోజించి) ప్రమద్వరయే నాప్రపంచము; నాకామె తోడిద లోకము!

సీ॥ నాపూర్వ పుణ్యంబు నామోము లిఖితంబు
లలితశిరీష కోమలశరీర!
నామోహవారాసి నావలపులపంట
సంపూర్ణ పూర్ణిమా చంద్రవదన!
నామనోహారిణి నాజన్మకారణం
బతుల గుణగణ రత్నాకరంబు
నాపెన్నిథానంబు నాయర్థ దేహంబు
ప్రవిమల వికసిత పద్మనేత్ర
తే॥ గీ॥ నాప్రమద్వర గలదేని యీప్రపంచ
మెల్లసంతోషధామమై యెసగుచుండు
నామెలేకుండునేని, గాఢాంధకార
మెల్లయెడల గ్రమ్ముకొనెడి నిష్టలీల

హా! పరిమద్వరా! ప్రమదాశిరోమణీ! నేఁడు నిన్నుఁ జూడమి నా గత మిట్లు వ్యాకుల పాటంగుచున్న యది. నిను బాసి నిలమట దుః గాకుండు నే?

తరుణీరత్నము మైలతంబెనఁగి చేతఃప్రీతినాచూప్రతీఁ
గరయంబారగ నుల్లసిల్లిసుమ సంగాతంబునై యొప్పి, మో
దరసంబాత్మజనింపఁ జేసెడిని, సాదంబొందునో, లేక సం
బరమేయిచ్చి తరింపఁజేయునో మనోవాంఛల్ తీరన్ ముట్టగన్

(మోమెత్తి యోజించి, సవిచారముగా) ఔరా! నేపత్తింపఁ
...నది దుర్మార్గము గదా?

జననంబొందితి నేకులంబుననో లేశంబైనఁబోల్పంగరా
దు; నిరూపింపఁగఁ దల్లిదండ్రులెవరో దోషంబు గాకుండ వ్రే
లునోకింత్తైనఁ గదల్పలేను; విదితా శ్లోకంబునేనామెపై
మనముఁ నిల్పుటపాపహేతువిది దుర్మార్గంబుమమ్మాటికిన్

జన్మస్థాన మెద్దియో, మాతాపిత లెవ్వరో, నిజాభిజాత్య సం
...త యెట్టిదో, యెఱుంగక, పరుల పంచలఁ బెరుగు నే నేడ, సద్గుణ
రంభ, పాలితాఖిల లోక సౌందర్య విరాజమాన, మానవతీ లలామ,
మే యేడ? తలపోయ నాకే సిగ్గగుచున్నయది.

గీ॥ పలుచకులమువాఁడ, యొరుల యెలమికలిమి
వలన భూతలమునఁ బ్రాణములనునిలిపి
చలనమూనెద; ఎలనాగ వలని ప్రేమ
దలఁపనాయెడ మలినంబు తులవదనము

ఆమెను దలంచుటకైన నేనర్హుండఁ గాను. కటకటా! పరిమద్వగా!

ఆ॥ వె॥ అమృతకణము; ప్రవిమ లాహ్లాదజనకంబు;
నిర్మలాత్మకంబు నీదుపేరు
నారసనము జేరి నీరసమొందెను
గనులలో సువర్ణకలికరీతి

నిశ్చయముగా నేనామెయెడ ద్రోహచింత జేసితిని. కృపావత్సలుఁడగు పురీంద్రసేనుఁడీసంగతి యెఱుంగు నేని యెంతవిచారించును; కోపగించును; మఱియు నెంతనొచ్చుకొనును. అభిమానధనుఁడు సునేనుఁడీవృత్తాంతమింపుక యెఱింగిన నెంతచింతించును; నన్నెంతదూలనాడును. ఛీ! నేనుకృతఘ్నుఁడను. ఇస్సీ! సుదతీలలామ ప్రమద్వరయే యెఱుంగు నేని, నన్నెంతగా దూషించునో; తానెంతసిగ్గుపడునో?

తే॥ గీ॥ గోముఖవ్యాఘ్రమనాఁగ! పయోముఖవిష
కుంభమహాహా! వీనియెడల్ల కూర్మిఁదలఁప
బాధయేకాదు, మఱియును పాపమగున
టంచుఁ దలపోయదొక్కొ శీతాంశువదన!

(ఒకింత యోజించి) ఏమి! నాభ్రిమ? ఏవస్తువు సర్వ విధముల లోకజాలములలో నెల్లఁ బరిత్యాగంబో, దానియందుఁ బ్రేమ జనించుట సహజము;

క॥ ధనమాలక్షులొసంగినఁ గొనదు;సత్పాత్రంబుబాటింపఁ బోదు;నిమిత్తంబుఁ బరిత్యజించు; మదిలోదూరంబునఁ నిల్పు కారణసంబంధలతావితానములఁ, జే రంజీరు నేవేళలఁ
ఘనులఁ నిర్మల ప్రేమనైజమది, శక్యంబానెయొండొటకుఁ

ప్రమద్వరలోకోత్తర. తత్కారణమున నామనోరాగమునకుఁ బాత్రభూతమైనది. ఆమెమన్మనోంబుజాతనివాసిని యను మధుపము. నా

సౌందప్రతిభ. (యోజించి) నాయెడ నామె కెట్టియభిప్రాయముగ నో? నన్నామె నిర్మలానురాగమునఁ జూచునా? ఉత్తమకన్యకుఁ త్తమునియందు సహజముగ జనించుప్రేమ నాయం దామె కుత్పన్న గాకో! ఏలకో నా కామెయం దట్టి నమ్మకము కున్నయది.

ననుజూచువేళల నగుమోముతోడుత
  నెదురేగి దెంచి సమ్మదమొసంగు
జిలిబిలిపలుకుల నలరినామాటల
  దినమొకక్షణమని తెలియఁబలుకు
అనుజన్మనెడబాసి యారామసీమల
  కోకిలధ్వనివినఁ గోరునన్ను
హంసతూలికతల్ప మందున శయనించి
  కలలోన ననుగాంచి పలువరించు
నాఁడు పంజరంబునుబాసి కీడుపడిన
శారికా రత్నమును దేరఁ జన్నువుమీరఁ
బంపునప్పుడు నాపైని బరపుచూపు
లవియివితలపోయ హృదయ మరయలేనె?

యందామె కెడలేని మైత్రి. త్రికరణశుద్ధిగా నానమ్మకమిట్టిది.—

(ప్రమద్వరనుద్దేశించి)—

అలదినంబున ముల్తాను నందుఁ గ్రూర
సింహదంష్ట్రల బలము నశించువేళ
యొకక్షణంబైన ననుబాసి యుండలేదు
నీవసేవల నొనరించి నావుగడఁగి·

అప్పటి నీవిమలానురక్తి, నిజమైనభక్తి, మాధురప్రసక్తి, సమయముచితోక్తి! నాహృదయఫలకమున సువర్ణాక్షరముల లిఖింపఁబడినవి.

(నేపథ్యమున 'విజయసేనా! విజయసేనా!' యనుపిలుపు)

వి. సే—(ఆలించి) తమ్ముఁడు సుసేనుఁడిట వచ్చుచున్నాఁడు.

తే॥ గీ॥ జలదములను తెరనుదాటి వెలికివచ్చు
తరణిబింబంబు వెలుఁగు భూతలమునెల్ల
నెల్లజేసెడు చందాన నుల్లముల్ల
సిల్లుసంఫుల్లముగ వీనిఁజేరునపుడు

(సుసేనుఁడు ప్రవేశించును.)

సు—అన్నా! విజయసేనా! ఒకండవై యాలోచనాధీనుఁడవై యున్నాఁడవేమి? నీగంభీరవదనము విలాసము జూపట్టకున్నదేమి?

చ॥ కలిమితొలంగెనో? రిపుల గర్వముసర్వమురూపుమాయదో
చెలిమిదలంపఁడాపిత? కృశించెనొనీదుయశంబు? బాల్యచా
పలమున నాసహోదరి నెపంబులువెట్టెనొ? హేతువేమి? నీ
వలసినదేమి? నాకెఱుఁగఁ బల్కి కృతార్థునిఁ జేయవేసఖా!

వి. సే—సుసేనా! నాకువిచార మెట్టిదియును లేదు.

తే॥ గీ॥ సదమలాంగి ప్రమద్వర సంతసాత్మ
యేని, నీయనురాగము హానిఁజెంద
దేనిఁ, యప్పగారువిడవ రేనినన్ను
గలుగ దణువంతయైనను గలఁతమదికి.

సు—అన్నయ్యా! నీవుసంతోషవంతుఁడవేని నాకభిమతసిద్ధియదియ. వినోదార్థమొకనాఁడు ప్రమద్వరతో వేటవిషయ చర్చఁ జేయుచుఁ, దద్వ్యాపారములయందు. మనసుఁగల నేర్పు విశదంబుగ వర్ణించితిని.)

సీ॥ గండభేరుండముల్ గహనభూముల లేవు
సింహశార్దూలముల్ క్షీణమొందె
చమరీమృగంబులు సన్నగిల్లెరయంబ
భల్లూకసంతతి పలుచనయ్యె
వేదండతండముల్ విడివడిపారెను
వాజులు కరవాయె భయముజెంది
మృగములు తెగలుగా మేయుచుఁ దిరుగాఁడు
పక్షిసంతానముల్ వలసవచ్చె
తే॥ గీ॥ విజయసేన సుసేనులన్ వీరవర్యుల
కౌశలంబున వనరమ కనులవింపుఁ
గొల్పి వరలుచున్నది సుమీ కువలయాక్షి
యనుచు సోదరితోడ బల్కాఁడినాను!

వి. సే — (నవ్వుచు) ఆమెయేమన్నది? నిజమనినమ్మకొన్నదా?

సు — నమ్మకొన్నది. ఇంతకు నిందతిశయోక్తి దోషముదవంతైనఁగలదే? ముల్తానునగరలక్ష్మి పైటచెఱఁగువలె విరాజిల్లు నాయరణ్యప్రదేశము పూర్వము భయదావహమై యుండెనుగదా? జవాశ్వముల నధిరోహించి సునిశితబాణజాలములు గేలఁ గీలుకొల్పి మనమిరువుర మానిబిడాటవినిఁ బ్రవేశించినది మొదలు క్రూరమృగంబొకటియైన నందుఁగానవచ్చినదా?

వి. సే — తమ్ముఁడా! నీపలుకనూనృతమని యెవ్వరెఱుంగరు?

సు — ప్రమద్వర నాపలుకులకలరి, తులలేని సంతోషకలితయై,

“ ఆ॥ వె॥ సవ్యసాచితోడ సమకొను విలుకాఁడు

విజయసేనుఁడెట్లు వేటలాడు
గనుఁగొనంగ నిచ్చ గలిగెడు నను వెంటఁ
దీసికొని జనంగదే సుసేన! ”

అనిప్రార్థన మొనరించినది. విజయసేనా! నీయందామెకు మోహ మోటమిలేదు. ఆమెయేవచ్చినిన్నుఁ బ్రార్థించును.—

వి. సే—సోదరా! క్రొత్తవానివిధంబున నాతోడమాటాడెదవేమి? మృగయావిహారార్థ మెప్పుడుపోవుదము? నేఁటిసాయంకాలము—

సు—సుమిత్రుఁడు సర్వము నాయత్తపఱచును. వానికనుజ్ఞయిచ్చితిని. సముల్లసితుఁడవగు విజయసేనా! రేపుపోవుదము. సోదరియిటకువచ్చును. నేఁబోయివత్తునా?

వి. సే—(సు. కౌఁగలించుకొని) అనుంగుసోదరా! అప్పగారియనుమతి వడసితివా?

సు—వారికింకను దెలుపలేదు. అభ్యంతరము జెప్పరని దృఢనమ్మకమున్నది.

వి. సే—సరియె.

(సు. నిష్క్రమించును.—వి. సే. లోనికరుగును.)

శ్రీ

ప్రమద్వర

ద్వితీయాంకము

ప్రథమరంగము

(ప్రదేశము. శ్రీనగసమీపారణ్యము. ప్రవేశము వనపాలకులు.)

గరుడధ్వని రాగము.— ఏక తాళము.

(అందఱు) దండిమగలు రండు కోదండపాణులై
చండశరభ సింహ వేదండతండముల్
నిండుభీతినుండవే కొండగుహాలలోఁ
రండురండు సేయఁగా గుండపిండిగాఁ

కవిరాజ విరాజితము.

ప్ర-సునిశిత బాణముశోణితముజవిచూడగనెంచెడుచూడుమురా
ద్వి-గుణధ్వనివీనులకుంగడువేడుకగొల్పిమృగంబులఁగోరెడురా!
తృ-వనమునభీకర ధ్వానములెల్లెడ బారమెఱుంగక వర్తిలెడున్
తురీ-మనమునధైర్యము మానకు, స్థైర్యము మందమొనర్పకు
మా! హితుఁడా!

ఉత్సాహ.

తృతీ—జాలిదూలికూలఁజేతుఁ జలము బలముఁ జూపు సిం

ప్రమద్వర

హాలపులుల కులమునెల్ల యమునిప్రోలికంపెదగా

ద్వితీ—మేలుమేలు జాలమేల? మేటిబలిమిఁ గూల్చి, ము
త్యాలురాల్తు కరులకిరుల తలలు జెండి దండిగాఁ

తృ—సీ॥ హరిణశ్రేణులఁ జంప నరుదెంచుపులులను
చిటికలోఁ జంపెదఁ జటులగతిని

ప్రథ—వ్యాఘ్రాళి జడిపించు వన్యేభ సంతతి
ఖండింతు భుజబలోగ్రత వెలుంగ

ద్వితీ—కరికరేణుల కుంభ పరికరంబునకాశ
యొనరించు హరుల మర్దనమొనర్తు

తురీ—సింహసందోహంబుఁ జీరాడఁజేసెదు
శరభాళి తీవ్రశస్త్రమున వేతు

తృతీ—తే॥ గీ॥ శరభములఁ దన్నుకొనిపోవ చదలఁ దిరుగు
గండభేరుండముల బాణ ఘాతమునను
గాసి పెట్టెద నిష్పాద కరువలివడి
గడచియేగెడు మార్గణ గణముగనుడ!

(బాణము పైకివిడచును.)

ప్రథ—ఆ॥ వె॥ ఏదిజాంబవంత మేల్మి జంబుకములు
రాదు పక్షికులము రావు లేళ్లు
సాంద్రవన్యభూమి సత్త్వసంభూతంబు
గాదు నాదుబలము కలిమివలన

కవిరాజ విరాజితము.

ప్ర-అదిగదిగో పులి యాశరజాంపమునందునడాగె భయంకరమై
ద్వి-పదిలముసూ! గుఱి బాయకురా! యొక బాణము వేయుము
వైళముగా
తృతీ-హృదయమునన్ భయ మించుకలేక నహీనపరాక్రమ
వృత్తిని దే
యెదురుగబోయి వధింతు గనుంగొను మీమది కబ్బుర
మిచ్చెదురా!

(అనిపరుగెత్తును.)

తురీ—గొప్పసెప్పి సుప్పనఁగప్పగరితు వేసితివి! జాగ్రత్తసుమా!
(భయముతోఁజూచుచు) అరర్రే! దుష్టవ్యాఘ్రము వానిపైఁబడిన
దే! మిత్రమా! ఆగుమాగుము! భయములేదు! (అనిపరుగెత్తును)
ప్రథ—(చూచి) కటకటా! పరాక్రమోపేతులు, భయంకరాకారులు,
వన్యభంబుల ధిక్కరించుబలయుతులు, నాకూర్మి చెలికాండ్రు, విలు
కాండ్రు నేఁడొక పిఱికిచారలమెకంబున కాహారమైరి. వారిమరణ
మునకు వారిదురదృష్టమే కారణము! మిత్రులారా! మనము సత్వరముపో
యి యీవార్త సుసేనవిజయసేనుల కెఱింగింతము. వారిప్పుడుత్తరదిగ్భా
గమున వేటాడుచున్నారు.

(నిష్క్రమింతురు.)

ద్వితీయరంగము

ప్రదేశము—ఆదేయడవి.

(ప్రవేశము—విజయసేనుఁడాయాస మభినయించుచు.)

అబ్బా! పొడువ్వుగమెంత యాయాసపెట్టెను! అంపవానఁగురిపిం

చినను, కరఘాతంబున నొంచినను, జంకదయ్యె. ఆయిద్దరివనసాలురఁజం పి సౌదామినివలె రెప్పపాటులో నుత్తరదిశకేతెంచినది. నాఁడు ముల్లాను నగరమున్న నన్నెదిరించిన సింహము నేవిధముల నిదితీసిపోదు. నూనే నకమా రుఁడు గొంతదనుక దాని నెదిరించి, భయంకర శార్దూలము నొంగుగాంచి, తద్దేశను వడివడిహుఱుంబుసు బరుగెత్తించెను. ముప్పాత్రిప్పాలఁబెట్టి యెట్ట కేలకు దానినిసంహారించితిని. (నలువైపులఁజూచి) అబ్బా! వనరమ చీకాకుపడియున్నది!

ఆ॥ వె॥ కిరులశిరములు వన తురగచరణములఁ
గలిసె; కుంభికుంభములు, విఖండ
చండతుండవితతి, శశక మొండెములును,
పారెఁ దేలి నెత్తురేరు లందు

(ధనుస్సును ద్దేశించి)

ఉ॥ కండలు మొండెముల్ నిశిత కాండ విఖండిత జంతుతండముల్
గుండెలుదూలి ప్రాణములు గోల్పడియుండిన వేటకాండ్రను
ద్దండత నీవొనర్చిన ప్రహారిదంబునఁ దేలుచు నున్నవారు; కో
దండమ! శాంతిఁబొందిభుజదండము నెక్కి విశాశ మొందవే

(ముందునకుజూచి) ఆహా!

తే॥ గీ॥ అమలజలజాత రమ్య హర్మ్యాంతరమున
లీల నుండు కలిమిజవరాలనంగ
వరుణకాంత మణితలమం దధివసించి
వరలుచున్నది యదె ప్రమద్వరసుమాంగి!

ఆమెనుసమీపించెదను. ఏమి!

తే॥ గీ॥ వెలఁది ధమ్మిల్లసారభావములను గలిసి

మేనిపూఁతల వాసనఁ బూనిమంద
మందయానము గ్రాల నానందమొంది
యనిలుఁడు మదీయ యాయాసమును హరించె!

ఆహా! ఆసోయగ మేమనందగును!

తే॥ గీ॥ అరయ సీరేడు లోకము లందుఁగలుగు
లలితలావణ్య సంగ్రహ లక్ష్మియనఁగ
కుందనపుచాయ వెలుగొందు కుందరదన
గనిన దీనినిగన్నులు గనిన ఫలము!

(ప్రమద్వరను సమీపించును. ఆమె యాసనము డిగ్గి ససంభ్రమయై)

మణిగణనికరము.

జయము! జయము! శుభచరిత! గుణగణా!
ప్రియజన సమహిత! విమతజనహరా!
నియమిత సవినయ! నిరుమ బలయుతా!
జయము! జయము! సుమశరసమప్రతిభా!

విజయసేనా! వేఁటతమకంబునఁ గరంబు నాయాసమొందితివి. ఈయాసనమధిష్ఠింపుము. (వి. సే. ఆమెసమీపమునఁ గూర్చుండును.)

ప్ర—తే॥ గీ॥ కరమున శరనికరములు గరము మెరయ
నిరుపమగుణార్ణవము మది వెలుఁగు వెలుపు
సరభసముఁగొలుప, తురఁగ, వరము బరుగు
పరుగునఁ జనఁ గనవలెను దరమె పలుక?

వీరావతారా! నీనైపుణ్యము వర్ణనాతీతము! నిన్నెట్లుగొనియాడుదును?

వి. సే — కాంతారత్నమా!

ఆ॥ వె॥ నాపరాక్రమంబు నీవొగ డ్తువు దగ
దైన మిక్కిలి కొనియాడినావు!
నీకు నాదెసఁగల నిరుపమానాభిమా
నంబుగారణంబు కంబుకంఠి!

మరియును,

తే॥ గీ॥ ప్రేమయను సులోచనములు బెట్టుకొనిన
వారలక్కు స్వభావోక్తియె వరలు నతిశ
యోక్తిసతము; తత్కారణ మోలతాంగి!
నీబలంబౌట నీమాట, నిజము సుమ్మి!

ప్ర — (దరహాసవదనయై) విజయసేనా! నీవచనములు సుధారససేచన
ములు. సుసేనుఁడింకను రాడయ్యె నేమి?

వి. సే — ఆముష్యన్నమెకంబు ప్రదర్శించిన పరాక్రమంబున కోర్వఁజాలక
యాతఁడొక శార్దూలమును దూరమునఁ జూచి దానిపైఁగవిసెను. దానిని
సంహరించి యాతఁ డిప్పుడే రాఁగలఁడు. ప్రమద్వరా! వనలక్ష్మి నీ
సౌందర్యమును గాంచి, నిజౌన్నత్యమున నిరసనభావమెఱింగి సిగ్గును,
విచారమును బెనంగొన సోయగము దొఱంగి యెట్లున్నదో చూడుము!

ప్ర — విజయసేనా! సౌందర్యాసౌందర్యములు మనోగతము ననుసరించి
యుండును; ప్రపంచమునది సుందరమగు వస్తువు, అదియనాకారమగు
వస్తువు, అనియెడు భేదము వస్తుప్రకృతియందుఁ గానరాదు; మనోభి
రామమెట్లో యట్లయుండును.

తే॥ గీ॥ గగనమున మేఘమాలికా గతులగాంచి
మితియెఱుంగని సంతోష యుతుఁడొకండు

తద్విలసనం బెఱుఁగనైనఁ దలఁపఁ డితరుఁ
డొకఁడు; ధవళ సరోరుహ మొకని కింపు
మఱియు నొకనికి పిందగు నరుణ కమల
మింకొకనికిఁ బ్రియముగాన మెట్టిదైన;
వినఁడు మధుర రుతంబులు వేఱొకండు
ఇంకొకఁడు ' తోడి ' రాగమేఁ యిష్టపడును;
ఒండొకండు ' మోహన ' విన నుత్సహించు!
విమలభావంబు వాంఛించు వేఱొకండు
మలినభావ మభిలషించు మఱియొకండు
సత్యవాక్య కలాప వాసన యొకండు
గోరు, నితరుఁడొకఁడు భూత కోటియందు
దయఁదలంపవలయునని నియతిఁబూను;
వీనికారణంబరయ నుర్వినిపదార్థ
నిచయములయందుఁ గలుగదు; నిజమనోము
కురము నందలి ప్రతిబింబ మురువిచార!

వి. సే— నారీశిరోమణీ! నిజముపల్కితివి; గాని,

తే॥ గీ॥ తరుణి! నీపైని హృదయసద్మమున నెప్పు
డోయెఱుంగఁ బ్రేమాంకుర ముద్భవిల్లె
నాకు; దీనికారణము గానఁబడదించు
కేని యెచ్చోటఁ గలదొ నీవెఱుఁగఁ జెపుమ?

ప్ర— విజయసమానా! విజయసేనా!

ఆ॥ వె॥ తారనుండి యొండు తారకు వెలుఁగెట్లు
బోవునో, యటుల ప్రఫుల్లహృదయ
మట్టి మనముతోడ నానంద మొందును
ప్రకృతినైజ మిద్ది పరవిదారి!

వి. సే—కన్యారత్నమా! నాయదృష్ట కేదారము పండినది. నాజన్మము కృతార్థతఁ జెందినది. నాహృదయ ప్రదేశమున నిర్మల సంతోషవాహిని ప్రవహించుచున్నది. నాశరీరము వివశత్వమొందుచున్నది. అహా! నేను ధన్యతముఁడను! నన్నుఁబోలు కృతార్థీభూతుఁ డీలేఁడు భూములనెంతైననుండునా? వేయినాలుకలు దాల్చి, 'యుండఁడని' చాటఁగలను. శరచ్చంద్రవదనా! సద్గుణసదనా! మనంబున నిన్ను వరించి, భావించి, ప్రేమాతిశయమున నీసుగుణరత్న సంచయమును గణుతింపఁ బ్రయత్నించి, వాక్కులు చాలమి, విషణ్ణహృదయుఁడనై, కర్మల నిన్నలరింప యత్నించి సమయానుకూలము గామి, యెంతయాందోళనమొందితినో, యెంత సంతాపించితినో, మఱియు నెంత నాదురదృష్టమునకు నన్ను నేఁ దూలనాడితినో, మాటలఁ దేటతెల్లము సేయఁజాలను! నాపుట్టినకుల మెట్టిదియో యెఱుంగనివాఁడనగుట, నామాతాపిత లెవ్వరో తెలియనివాఁడనగుట, నీయాభిజాత్యగౌరవంబు, నీయసమాన సౌందర్య సద్గుణవిశేషంబుఁ జూచువాఁడనగుట, నీయందు హృదయముఁ బదిలము సేయుట పాపహేతువని, విచారకారణమని హృదయము మరలింప నెంత ప్రయత్నించితినో, నీరము ధారణీధరశిరోభాగమున కెట్లు క్రిందనుండి ప్రవహించును; ఎట్లు ప్రజ్వలిత జ్వాలాజాలమునఁబడి పరిమళనిలయమగు చందనమొలక జీవించును; అని నిస్పృహ జెంది క్షణక్షణమును బుద్ధిఁ దలపోసినను, కార్యము లేదయ్యె.

—రూపజితానంగా! కులాభిమానమీవిషయమునఁ దలపెట్టరాదు. నీవు వెలితికులమున నుద్భవించినట్లే భావింపుము; నేను సత్కులప్ర

నూతననియే యెంచుము. అట్లయినను బాధయేమైన నున్నదే?

ఆ॥ వె॥ బంగరు నగయందు వరలి మాణిక్యంబు
నందమొంది నగకు నందమిచ్చు;
గుణముతోడ గుణము గూడి ప్రకాశించుఁ
గానఁ జింత దీనఁ బూన వలదు

వి. సే—అతివా! నిక్కముగ చింతువినుము.

చ॥ కనులను మూయునప్పుడు, ప్రకాశముగాఁ దిరుగాడు వేళభో
జనసమయంబునందు, నొక చక్కని వస్తువుగాంచునాఁడు, లే
క, నవనవోద్భవంబగు నొకానొకయూహకు నెమ్మనోతలం
బున ముదమొందు కాలమున మోహనబాణము! నిన్దలంచెదన్

ప్రియసఖీ!—

(కోపోద్దీపితుఁడై సుసేనుఁడు ప్రవేశించును.)

స్రగ్విణి

సు.—చాలురా! చాలు! వాచాట! దుష్టాత్మకా!
శీలమే నీకు దుశ్శీల! యీరీతిగాఁ
కోలచేఁ గొట్టి నీగుండెఁ జెండాడెదన్
మేలురా! మేలు పాపిష్ఠ! మదాంధా! శఠా!

(తన్నఁ బోవును.)

ఛీ! నోటికిఁ గలుపును ద్వారబంధమును లేదనుమాట నేటికినూటి యయ్యె!

శా॥ ఓరీ! బాలిశ! పీరసత్త్వములు లేవో? దుష్టసత్త్వంబులన్
క్రూరాసిన్ దెగనేయరాక్షో? రుధిరాకూపారముల్ సేయరో

యీరీతిఁ బిడియంబుఁ బోనడచి, యేమీ? ప్రేమ వాక్యంబులన్
యీరామామణితోడఁ బల్కితివి;నో రెట్లాడెరా? దుర్మతీ!!!

ఛీ! కులపాంసనా! వృథాడంబరా! ఛీ! విషోరగమా! నీముఖము జూడరాదు!

తే॥ గీ॥ వేఁటలాడంగఁ జనుదెంచి, బోఁటితోడ
మాటలాడెదు, హృదయంబు తేఁటపడఁగ,
సాటియెఱుఁగవు; పలుమాట లేటికింక
నేఁటికిఁగలిగె, కటకటా! చేఁటుమూకు

నాముంగలినుండి యావలికిఁబొమ్ము. నీవ్యక్తి నాకుఁజూడరానిది. నీవుమానవాకృతినున్న హాలాహలమవు! యుక్తాయుక్తములు నీకెట్లు తెలియఁ బడును?

(సోదరితో) ప్రమద్వరా!

ఉ. అన్న నెఱుంగ వైతివి; కులాభ్యుదయంబుఁ దలంపవైతి వీ
వెన్నవొకింతయేని పిత యెంతపరాక్రమవంతుఁడో?
విన్నఁదనంబుఁగూర్చితివి వేవురిల్లోఁ దలెత్తలేకనీ
చోన్నతినుండఁ గావలసె నూపిరి మేనులనుండు నంతకున్

అమాయకురాలా! కలహంసమెన్నఁడేని మాలకాకిలోఁ గలియునా? ఇఁక ముందు నీవెన్నఁడును వీనితో మాటాడకుము.

ప—సుసేనా! నీమాటలయర్థము నీవెఱుఁగుదువా? ఈవృథాకోపమునీ కేటికి? మాలకాకి సాదృశ్యముఁ దే నేల?

౨. అనఘాత్మన్ మనతండ్రి నేమరుచ లేదావంతయేనిన్, కులం
బున కెగ్గేమియు నెంచలేదయిన నేమ్మా! మోముసెత్తంగలే

మనిపల్కాడితివక్కటా! యెట్లుఁగ వే యాహ్లాదమో? దుఃఖమో
యనుజన్ముండిటు లాడఁబోదఁ? నిదూష్యంబై నరోషంబుతోఁ

మఱియును, విజయసేనుఁడెట్లుఁగ నివాఁడనుకొంటివా?

చ. స్థిరమతినుండవే విజయసేనుని యందుఁ నిమేషమయ్యె ని
ష్ఠురతరకోపమూనుటకు స్రుక్కఁగ నీయనురాగవల్లి, యీ
పరుషవచో విధంబునకు భావనసేయఁగఁ గారణంబు లే
దుర, తగురా! దురంతమురఁ; తొందరపాటువహింపఁగాదురా

సు—బాలా! వేలవు. ఈదుశ్శీలుని మాయాజాలములఁ జిక్కితివి.

వి. సే—(శాంతముగా)

ఉ. సంబర సంభృతం బగు వచస్స్ఫురణంబు సదామనోంబుజా
తంబున నింపునింప, వినుతంబగునట్టి విధంబులెల్లఁ గ
ర్ణంబులఁ దన్పఁజెప్పెదవు నాయమె? కోపవిషంబుఁ గ్రక్క, నే
రంబును ద్రోసినాఁడవు, కరంబుభగంబుభరింపఁ దమ్ముఁడా!

సు—నీవుమాటాడకుము. నీవచోమారుతము మదీయకోపాగ్ని రవుల్కొల్పెడిని.—ఇప్పుడు చాలాయాలస్యమైనది.

(తెరవైపుజూచి, యెలుఁగెత్తి.)

చ. జలరుహబాంధవుం డపరశైలశిరోగత మయ్యెఁ గావునన్
వలలను మూసి, బోనులను భద్రముజేసి, శరాసనంబులన్
గలియఁగఁగట్టి, జాగిల నికాయములన్ వడిగూడఁజేసి, వి
రలసినవార లాటను, వినాటకులార! గృహంబుఁ జేరుఁడీ!

బోయిలారా! పల్లకి సిద్దముజేయుఁడు.

(వింతముసలిది ప్రవేశించి)

సుసేనా! తొందరపడరాదు. ప్రమద్వర విజయసేనుని జన్మకారణము! (నిష్క్రమించును.)

సు—(ఆశ్చర్యముతో) సోదరీ! రమ్ము పోవుదము.

(నిష్క్రమింతురు.)

వి. సే—గతజలసేతుబంధన మవివేకలక్షణము! నేనునిజముగా తొందరపడితిని. హా! మోహమా! నీవెంతసుందగవు! నిరవధికకృపాపరతంత్రవైనట్లుండి గండశిలకంటె యత్యంతంబగు కాఠిన్యమూనితివి! దావానలకీలావళిఁ బడఁద్రోసితివి!—ఏమిది! నేనధైర్యమూనుచుంటినా? ఛీ! నాకిదితగదు.

తే. గీ॥ నిశ్చలంబపారర్థంబు, వినిర్మలంబు
నిరుపమానంబు, నిత్యంబు నిశ్చయంబు
దివ్యమైనట్టి ప్రేమ సాధించు జయము
నరుగు నిద్ది యాచంద్రతారార్క మగుచు

కావున నిందుయోచనీయాంశము బొడసూపదు. ముందుముందెట్టివి రానున్నవోయెఱింగి యెదుర్కొనవలయును. భానుమంతుఁడస్తగిరి మాటునకేగెను. (ఉపక్రమించి) అకటా! సుసేనుని పరుషాలాపములు దలఁపునఁ బారునపుడు గృహమునకుఁబోవుటకు మనంబంగీకరింపకున్నయది. సుసేనుఁడు జనకునకీవార్తఁ దప్పకయెఱింగించును. అతఁడేమనునో తెలిసినఁగాని కర్తవ్యమూహింపఁజాల!

(నిష్క్రమించును.)

తృతీయ రంగము

ప్రదేశము. పురీంద్రసేనుని గది.

(ప్రవేశము పురీంద్రసేనుఁడాలోచనాధీనుఁడై)

ప్రమద్వరకుఁ బదునాఱేండ్లు నిండినవి. సంప్రాప్తయౌవనయగుటవలనఁ బరిణయమామె కొనరింపవలయును. ధనవంతుఁడును, గుణవంతుఁడునునగు నల్లునికై యరయు నవసరము లేకయే, యాఁడఁబోయిన తీర్థమెదురైనటుల హేమపాలనృపాలుఁ డభిలషించి, ప్రమద్వర కరగ్రహణమును గోరును. ఆతనికిప్పుడు నలుబదియేండ్లుండును! అయిన నేమాయెను శ్రీ సుభిక్ష రాజధాని కళ్యాణిపురమున కధీశ్వరుఁడే. రూపమున జయంతుఁడు. విశేషించి నిర్వక్రపరాక్రమధురీణుఁడు. వానిఁజెట్టవట్టి ప్రమద్వర నిరతిశయానందమున నోలలాడకుండునే? చినతనమాది మరాళతూలికాశయ్య మేనువాల్చును. శాల్యన్నములు భుజియించును; విలువయెఱుంగని రత్నాభరణంబులు దాల్చును. హేమపాలునియింట నామెకష్టమెఱుఁగక మెలఁగఁగలుగునని నిండారుయభిమానముగలదు. కుమారుఁడు సుసేనుఁ డిందులకేమనునో? ఆతఁ డడ్డు సెప్పఁడనియే నమ్మకము.

(నేపథ్యమున)

తిప్పగారూ! రావచ్చునా?

పు. సే—(చూచి) సుసేనకుమారా!

తే. గీ॥ భీషణనినాద ప్రతినాద విపినభూమి
వేఁటలాడంగఁ బోతివి విజయసేను
తోడ క్రమ్మరినావె సంతోషమొంది
రమ్ము! చల్లనికౌఁగిలి నిమ్ము! తండ్రి!

(సుసేనుఁడు తండ్రికిఁ బ్రణమిల్లును. పు. సే. కుమారునిఁ గౌఁగలించుకొని)

నాయనా! వేటతమకంబునఁ గరంబాయాసంబునొందితివి. కః పారభుజియించి, సుఖశయ్యఁ జేరుము. ఆలస్యమొనరింపకుము. ప్రాతఃకాలమున సంభాషణము—

సు—(ఆకోర్క్తిలో) జనకా!

తే. గీ॥ అడవి మృగముల జంపు నాయాస మొక్క
క్షణములోఁ బాసిపోవును గాని హృదయ
మునకుఁ గలిగిన శ్రమయెట్లు పోవఁగలదు
పాపవిధినిఁ దప్పింప నెవ్వని తరంబు?

పు. సే—(సంభ్రమవిచారములు మల్లడిగొన) హా! కుమారా! ఏమాయెను?

మ॥ అనఁగున్ జెల్లెలుషానిఁ జెందెనో? ప్రియంబై యొప్పనీ పేరుదు
ర్వ్యయునల్ కేలియొనర్చిరో? తొలఁగెనో ద్వేషంబుఁ గీల్కొల్పిన
జ్జనుఁడౌ యావిజయుండు? సింహముపసల్ చాటించిమాటయ్యెనో
యనయం బేమిజనించె? చెప్పుమురకట్టా! ప్రాలుదూషింపకన్
తనయా! సుసేనా! నాయాందోళన మధికమగుచున్నయది. కన్న తండ్రీ! నీకుఁగల్గిన సంతాపమేమి? తత్కారణమేమి? చెప్పుము నాయనా!

సు—జనకా! ఏమనిపల్కుదును? హా!

తే. గీ॥ మనసు కృతరాసి, మననిధి, మన గృహారమ,
మన ప్రమోదంబు, మనగుణమణి, మన నయ
నోత్సవంబు, మీసుత, నాసహోదరి యగు
మన ప్రమద్వర యికమీద మనదికాదు!

పు. సే—హా! ఎంతదారుణ మెంతదార్యణ్యము! హా! ప్రమద్వరా! హా! ప్రమద్వరా!—కుమారా! నిజమువక్కాణింపుము. నారత్నాలపేటి, నా

యామృతవల్లి, నా సుగుణరత్నాభరణము,— నా ప్రమద్వర యేమైనది!

సు— తే. గీ॥ ఏలతాంగిని ధనబల శీలములను
పరువు మర్యాదయును గలవాని కొసఁగి
పెండ్లిసేయుదు ననెద వావెలఁదిమిన్న
విజయసేనుని సౌమ్యు; సద్వినుతచరిత!

హా! దురాత్ముఁడు విజయసేనుఁడు మృదువచోరచనా కలాపముల వలన గోలయగు మన నీలాలకమనోజలజాతమును హరించెను. దుర్భరం బగు నిందతలపైఁ బడియెను.

పు. సే— కుమారా! నిజముగా నియ్యది దారుణకృత్యము.— హా! విజయసేనా!

చ. చిరుత తనంబునందు నను జేరగ, నా ప్రియ సూనురీతి ని
న్నరయుచుఁ బెంచినాను, నిను నమ్మితి సద్గుణమూర్తివంచు, ని
త్తెరఁగున నా గృహంబు గణుతింపక దారుణవహ్నిఁ గాల్చితే?
కరుణఁ దలంపనియ్యదియగా ఫలమయ్యెయయొ! మోసపోయితిన్

(దుఃఖమణఁచుకొని) సుసేనా! ప్రమద్వరమాట యిచ్చెనా?

సు— జనకా! విశదముగ నామె నాకు మనోగతమెఱింగించియుండలేదు. వాలు మెకంబొండు నాపుఁగానరా సత్వరముగ హయమును బరుగెత్తించి సేనాజంతువుపైఁ గవిసితిని. బాణపరంపరల దానిం గూల్చి మగుడి వచ్చుచు దూరమున విజయసేనుఁడు సోదరిపజ్జఁ గూర్చుండియుండుటను గాంచితిని. వారేమి సంభాషించుచున్నవారలో వినఁ గౌతూహలాయత్తచిత్తుండనై హయంబుడిగ్గి మెలమెల్లన వారికిఁ దెలియకుండ పారి నిసమీపించితిని. అప్పుడు ప్రమద్వర సుస్వరముతో (ఆ. వె॥ బంగరు నగయందు అను పద్యము చదువును.) అనిపల్కెను. విజయసేనుఁడు మితిగొలుంగని సంతోషభరితాత్ముఁడై యిట్లనియెను. (చం॥ కనుఁగొను

ప్రమద్వర

మాయమైనప్పుడు అనుపద్యమును చదువును) నేనుకోపోద్దీపితుండనై విజయునిం బరుషోక్తులం దూలనాడితిని. వాయెడలగ్నిగుండమునం బడ నట్లయ్యెను వానినిం దన్నవలయునని పాదమెత్తితిని; వానియదృష్టము మంచిదగుట వెనుదీసితిని. సోదరితో గృహమున కరుదేరనుండుసమయమునవింత ముసలిదొకర్తు తత్ప్రదేశమున నవతరించి, "సుసేనా! తొందర పడరాదు. ప్రమద్వర విజయసేనుని జన్మకారణము!" అని పల్కి వనమధ్యమునకుం బోయెను. ఆమె వెర్రిది. దాని మాటలు సరకు సేయ నేల? — అధూర్తునిం దొలంగించిన నన్నియు సరళముగా జరుగును.

పు. సే — కుమారా! విజయసేనుని యందు ప్రమద్వరకనురాగ ముద్భవించినదని తోంచెడిని. ఆకారణమున, వాని నిటనుండి పంపించి వేయవలయును; గాని యింతలో నట్లొనరింపరాదు. ప్రమద్వరకు వానియం దభావము గలిగించిన వెనుక వానిని తొలంగింతము. మోహాంధులకు యుక్తాయుక్తము లగోచరములు. విజయసేనుని జన్మవృత్తాంతము మున్నే కదా, వాని సమక్షమున నీతోడను, సోదరితోడను జెప్పితిని. వాని కులమెట్టిదో, వాని జననీ జనకు లెట్టివారో, వాని జన్మస్థాన మెందున్నదో, యెఱుంగుటకు వలయు తెరంగు లభింపదయ్యె అట్టిదిక్కుమాలినవాండు విలాసినీ శిరోమణి యగు ప్రమద్వరనా కన్నెత్తి చూచుట! కుమారా! ఈయవమానము సైరపడు నేని మనము జీవములతో నుండి యేమి ప్రయోజనము! ఇందును గురించి శాంతముగా యోజింపవలయును

(నేపథ్యమున)

దేవా! హేమపాల జనపాలుండు తన రాక మీ కెఱింగించు చున్నాడు.

సే — (ఆలించి) సుసేనా! ముల్లాను నగరమున నాండు మనగృహమునకేతెంచిన కళ్యాణిపురవరు మఱువవు కదా? ఆభూమండలాఖండలుండు మనయందుం జూపిన నిరతిశయానురాగము మఱువం దగినదా? నాయనా! అతనిని సందర్శింతము. రమ్ము.

(ఇరువురు నిష్క్రమింతురు)

తృతీయరంగము

ప్రవేశము. వజ్రపాణి.

హేమపాలుఁడు ముల్తానునగరమునుండి నేఁడేయరుదెంచెను. నాయందాతఁడు నిండారు అభిమానమును వర్తించుచుండును. నేనాతని కార్యతత్పరుఁడనై మెలఁగనిచో స్వామిద్రోహినగుదునుగదా? నేఁటిదనుక నేనొకమాఱైన నాతనియాజ్ఞోల్లంఘన మొనరించియుండలేదు. ఆతనిప్రీతి వర్ధిష్ణుత కెంతయుఁ బాటుపడుచున్నవాఁడను. ఇప్పుడాతని మనోభీష్టమున కంతరాయముగలిగినది. పురీంద్రుఁడీసౌధరాజంబునఁ బ్రవేశించిననాఁడే విజయునివిధంబంతయును గ్రహించితిని. వెఱ్ఱివాఁడు, సుమిత్రుఁడు విజయునిమందహాస విలసితవదనము ప్రమద్వర మనోగతమున నెలకొనియున్నదనుమాట నేటికిని గ్రహింపఁడు! విజయుని చిఱునగవులు, క్రేగంటిచూపులు, దైన్యముతోడి తలపోతలు, భయరభసములు, ఏకాంతవిహారములు, నాతనిమనోగతమును గంభీరవాక్ప్రభావకంబై నెన్నియోరెట్లధికముగాఁ దెలియఁజేసెడిని గదా? ఈపట్మలమును త్రెంపివేయవలయును. (చూడ్కి సారించి) హేమపాలుఁడు భోజనాగారమునుండి వచ్చినాఁడు. శయనాగారముఁ బ్రవేశించెను. ఆతనిని సమీపించెదను.

(నిష్క్రమించును)

ప్రమద్వార

పంచమరంగము

(ప్రవేశము. హేమపాలునిపడకగది. ప్రవేశము. హే.పా.వ.పా)

హే.పా—అవును. నీతలంపుసరియైనది. వజ్రా!

ఉ. ఏరమణీలలామ, శరదిందునిభానన, సింహమధ్య, సం
చారము సేయు నాహృదయ పద్మమునందున, నామె నెమ్మదిన్
జేకొనె దుష్టుఁడై విజయ సేనుఁడు? పాతకమంచెఱుంగఁడో?
సారసవైరి దోఁచె దివసంబున! నేగతి శాంతిఁ బొందెదన్?
మిత్రమా! నావిచారము దుర్భరము!

సీ. పడఁతి సోయగమును బలువురు వర్ణింపఁ
గోరి యాకర్ణించి కొన్నినాళ్లు
సొగసుల దొంతినిఁ జూతునా? యని శంకఁ
గొని, తహతహపడి కొన్నినాళ్లు
పద్మాక్షి నన్ను సంభావించునా యని
విన్నఁదనంబునఁ గొన్నినాళ్లు
భామావతంసము బరిణయమాడునా?
నన్ను బాయునె? యని కొన్నినాళ్లు

తే. గీ॥ సంశయాగాఢ డోలాయ స్వాంతుఁడ నయి
ఎంత దురపిల్లినానొ, యా కంతుడెఱుఁగు
నా ప్రయాసము దక్కెనుగనాకు, తరుణి
విజయునకుఁ దక్కె, విధివ్రాలు వేఱబమొకొ?

అకటకటా! యశోవిశాలుఁడును, ప్రతాపాలవాలుఁడునగు హేమపాలుఁడు నేఁటికి దైన్యమొందవలసివచ్చె! హా! కాలానుకూలము!

వ.పా—దేవా! పాపకర్ముఁడు విజయసేనుఁడు ప్రమద్వరస్మృతాంగిని తన వచోవిలాసముచే వశీకృతనొనరించుకొనియెను.

హే.పా—వజ్రా! నీవచించువది నిజమా!—హా! ప్రమద్వరా!

తే. గీ. మోహ దుగ్ధాబ్ధి యందున మునిగి తేలి
నీసమక్షమున నిలచి నెనరు జూపు
ప్రేయసీ! యని నోరార వేడుకొనఁగ
ముద్దు మోమును ప్రక్కకుఁ బోవ ద్రిప్పి
మధుర దరహాస మొనరించి యధరబింబ
ము నొకియింత రదన కుంద ములను బట్టి
భ్రూలతలు మీఁదకు జరిగి ముడివడంగ
వదనమును ద్రిప్పి, ప్రణయ కోపమును జూపఁ
బైకొనెడు మోహమణపంగ బలములేక
సఖియ! నీబిగి కౌఁగిలి సమయరక్ష
ణంబటంచు నమ్మితి, నాదు నమ్మకములు
కలలు గాని, సుంతైన నిక్కంబుగావు
కటకటా! నేపడిన కడ గండ్లఫలము
పరిణమించెనె యీరీతి? (వ.పా.తో) వజ్రపాణి!
ఈహృదయ వేదనంబు నే నెట్టులోర్తు?
దుర్భరంబు! దుర్భరము! హా! దుర్భరంబు?

వ.పా—పురుషాగ్రణీ! మీరీతిరున విచారమూనుటతగదు. సౌందర్యమున

మిమ్ముఁబోలువాని నొండొకనిఁగానము! గంభీరభావమున మీకెవ
వచ్చువారేరి! పరాక్రమక్రమమున మీకుమీరే సాటియన హాస్యార్థ
మగునే? నిరవధిక కృపాపరతంత్రా! ప్రమద్వరయగు ప్రమద్వర
మిమ్ముఁ బ్రేమింప నేరమికిఁ గారణము మీయందు నెరసులేమైనఁ గల
వనియా? కాదు! కాదు! విజయసేనుని మాయావాగురులఁ జిక్కి, పతి
తత్త్వమెఱుంగని యా కుటిలాలక మీగౌరవము, అభిమానము, నిరుప
మానయశము, గ్రహింపఁజాలదయ్యె!

హే.పా.—వజ్రపాణీ! నిజము పల్కితివి. లేనిచో,

చ. బలము, ధనంబు, నేడ్తెర, యపారయశోమహిమంబు నీకు లే
నిలలితరూపవిభ్రమము, నిల్కడఁ బూనినరాజ్యలక్ష్మి, నా
కులమునసాంప్రదాయమును గోరివరింపఁ దలంపులేని, యా
యలికులవేణి యేవిధమ యాతని నెమ్మదిఁ బ్రేముడించెడిన్

కం॥ మందులు బెట్టెనో? సుందర
మందాలాపంబు లాడి మనమును గొనెనో
యిందునిభానన పొందును
బొందఁగ నేవిధమనేర్చు బొందుగఁ, జెపుమా

ప్రమద్వర నిజానిజము లెఱుంగనిది. ఒంటరిగా నడచుటకైన సిగ్గు
బూనుచుండు. మఱియును, ఆగర్భశ్రీమంతురాలు. విజయసేనుని
వృత్తాంతమాద్యంతమెఱుంగును. మనోవాక్కాయకర్మల వానిని
బ్రేముడించుననుట దురవగాహము. వాఁడు నింద్యతముఁడని జంకక,
యామెకు మందులు బెట్టియుండును. కటకటా! ఈదారుణవార్త పురీంద్ర
సేనుఁడెఱుఁగఁడు. తెలిసియు మిన్నకుండునే?

పా—దేవా! విజయుఁడామెకు దూరముననుండునేని యింత పుట్టునా?

హే.పా.—నిజము! నిజము! ఓరీ! విజయా! దురాత్మా!

కం॥ ఎఱుగవొ? సరసిజముఖి నా
కరమునఁ గరమిడి కరము వికాశముఁబొరఁన్
పరిణయ మగునని, మఱియును
పరిరంభణ సేయుననుచుఁ బాపవిచారా

తే. గీ॥ అరులసాహావరంగంబు నందుఁ జీల్చి
పీల్చి పిప్పిఁ జేసి వెలయు భీకరకర
వాలమున్నది కేల! నీ వర్తనంబుఁ
గన్నులను విప్పిచూడరా! కాచికొర!

(ఆసనము నుండి లేచును)

వ.పా—(వారించి) దేవా! తొందరపాటు కూడదు. పురీంద్రునకీయుదంత మెఱింగింతము. ఆతనిమనోగత మెఱింగినఁగాని, కార్యాలోచనమునకుఁ బూనరాదు.

హే.పా—ఔను. పురీంద్రునకీవార్తఁ దెలియసేయుదము. పిమ్మట కర్తవ్యమూహింపనగును. వజ్రా!

ఉ. వారిధులింకు గాక, కుల పర్వత సంతతి క్రుంకు గాక, దు
ర్వార యరాతివీరజన వంశ భయంకరమూర్తియై, దురా
చారపరుండు, నావిజయజాల్ముఁడు దానకృపాణపాణియై
పోరఁ దలంచుగాక! పువుఁబోఁడికిఁ బ్రాణములివ్వకుందునే?

వ.పా—దేవా! మీయప్రతిమాన పరాక్రమాభిమానము నేనెఱుంగనా? రేపు పురీంద్రసేనునితో ముచ్చటింతము. ఇప్పుడు చాలాయాలస్యమైనది. మీరు నిదురింపుడు. నేఁబోయివచ్చెదను.

హే.పా—సరియె. ప్రాతఃకాలమున మరల కలిసికొందము.

(వ.పా నిష్క్రమించెను. యవనిక పడును)

శ్రీ

ప్రమద్వర

తృతీయాంకము

ప్రథమరంగము

ప్రదేశము. శ్రీనగరసమీపారణ్యమున నొకదుర్గము.

(ప్రవేశము పుళింద కళింగులు)

పు— తమ్ముండా! నీయభిప్రాయము సమంజసముగా నున్నది. నాకిప్పుడు నలుబదియేండ్లు.—

క— అన్నయ్యా! ఏమట్లనుచున్నాడవు. దేవనారీమణులు నీదోర్దండమున విశ్రమింప నెంతయో తపింతురు; ఇంక భూలోకనారీరత్నముల మాట వేఱుగం జెప్పవలయునా? అప్రతిహతంబగు నీపరాక్రమం బెఱింగి, యెందఱెందఱు రాజన్యులు తమగాదిలికూతులను నీచరణసరోజముల కర్పింపనెంచి, నీవంగీకరింపమి చిన్నవోయిరి?

సీ॥ ముద్దులకుప్ప నా ముఱిపెంపు కూతును
గైకొను మంచు మాగదుడు బల్క—
రత్నాల పెట్టె సువ్రతయగు నాకూతుం
జేపట్టుమని వేడ చేదివిభుండు
గొనములప్రోక నాకొమరారు కొమరిత
నుద్వాహమగునన నుత్కలుండు

భారతీదేవి నావరముల తనయను
గ్రహియింపుమని పంపఁ గాశిరాజు

తే. గీ. కానుకలతోడ వారల కబుతు లెల్లఁ
దిరుఁగఁ ద్రోలిన సంగతి మఱచినావె?
నీకుఁ బరిణయేచ్ఛ కలుగ నిఖిల రాజ
చంద్రు లొసఁగరే కూతుల సంతసమున!

అన్నయ్యా! నీవుపరిణయము జేసికొనవలయును. ఏలనందువా?

సీ॥ గగనతలము నంటి నగము మీదికిఁ బోవు
వృక్షంబులను ద్రెళ్ల నేయలేదె?
వణఁకి భూమియు నభోంగణము బీటలు వార
గడగడమని బొబ్బ లిడగలేదె?
గండభేరుండ వేదండతండంబులఁ
జిటికిన వ్రేల శిక్షింపలేదె?
బలదర్పయుతులైన వైరులు వెనుజూచు
కొనుచు భీతిలి నాఁడు చనఁగలేదె?

తే. గీ॥ మిగిలినార మిద్దరమె కా మేటివంశ
మున; నిరంకుశబలము స్థాపన మొనర్చి
పోవునాఁడదియు నశించి పోవవలెనె?
బుద్ధిగలవాఁడ వెదఁ దలపోయు మన్న!

పు—తమ్ముఁడా! స్త్రీయనుమాట వినినప్పుడు కర్కశంబై తోఁచుచుండె
డిని. కొన్నాళ్ళనుండిమాత్రము నాయందా భావము మార్పుఁజెందినది.

తే. గీ॥ ఎద్ది హాలాహలం బని యెంచినానో
యదియ యమృతలహరి యని యెద నెఱింగి
నాను; కుసుమకోమల గాత్ర మైనఁ గాని
జ్వలిత కీలయటంచు నే జంకినాను!

దుర్జయుం బగు మనవిక్రమంబును భూచక్రమున నిర్వక్రముగ నా చంద్రతారార్కము నిలుపవలయునని చెప్పుచున్నాడవు. నిజము. మరియొక విషయము గూడ కలదు. నీయందు దాపరిక మేటికి?

తే. గీ॥ పూల పానుపు నందునఁ బొరలుచున్న
మూయఁ బడదు నేత్రయుగము మునుపటివలె
నెంత మధుర వస్తువుల నించుకేని
రుచి యొసంగదు; తోఁచును రోఁతగాను!

మ॥ మృగయాసక్తి నశించె; పల్కుటకు నుంతేనిన్ మనం బొప్పకో
దు; గురుత్వంబు కృశించె నాబలము పై; దోఁచెన్ మనోవీధిఁ జె
ప్పగ లేనట్టిది భావ మొండు; భరియింపన్ గష్టసాధ్యంబు; నె
వ్వగ యేతీరునఁ దీరిపోవు ననుచున్ భావించి వేసారితిన్॥

నాకుపాయము దోఁచినదికాదు; ఒక నాఁడు మన సేవకుఁడు దుర్జయుఁడు నాతో ముచ్చటించుచు, దేవా!

కం॥ బలము, కులంబును, గలిమియు
విలసదనంబు మరియు సువివేకము నిండై
కలిగినఁ గలవాఁ డను-చోఁ
గలదో కో యర్ధంబు, వయసు గరితలు లేమిన్?

అనిపల్కెను. వానిసత్యోక్తి నాకిప్పు డనుభవమువలన స్పష్టమైనది.

తమ్ముఁడా! నీయుపదేశమనుసరించి, నేనొకకన్యామణిం బెండ్లియాడెదను.—

(నేపథ్యమున)

జయము! వనరాజా! పుళిందమహాశయా! జయము!

క—అన్నయ్యా! మనకు మూఁడవకన్నువలె వర్తించు దుర్జయుఁడు కోపకషాయిత నేత్రుఁడై వచ్చుచున్నాఁడు.

దు—(ప్రవేశించి, పుళిందకళింగులను నమస్కరించి, పుళిందునితో)

మహారాజా! దేవరవారి కర్ణేంద్రియములకు విందొనర్చు సుఖవార్తలఁ గ్రహించి విన్నవించు దుర్జయుఁడు నేఁడు దారుణవార్త యొండు చెప్పవలసివచ్చెను.

చ॥ కలఁడుకదా పురీంద్రుఁడను క్షత్రియవంశజుఁడామహాఘనసం
కలితుని గర్భశుక్తిమణి కాంతుహయంబన వెల్గు దాని పెం
డిలియొనరింపఁ గాఁ దలఁచి తీవిబయల్పడ నెల్లరాజులన్
బిలచియు దానితండ్రి మిముఁబిల్వఁగ నెంచఁడుదర్పమెట్టిదో!

వానిగీటడంచి మాకులగౌరవమును రక్షింపవలయును.

పు—(కళింగునితో) తమ్ముఁడా! వింటివా? పురీంద్రసేనుని గర్వనిర్వాపణంబు సేయనిచో మనమర్యాద నిలచునే?

తే. గీ॥ గడగడమని పుడమి భయపడివడంక
పిడుగువడపున బెడిదంపునుడులు వెడల
చెడుగు పొడసూపెనని జనులడర నెడద
నడిదమునఁ బురీంద్రునడఁతుఁ దడవులేదు!

క—అన్నయ్యా! పురీంద్రునిఁ జంప నెంచ నేల? దుర్జయుఁడు చేకొనిన
[illegible] నసామాన్యయని జగతీజనంబులు

నిరంతరమును బొగడుచుందురు. నీవామెను ధర్మయుక్తి రాక్షసవిధి వివాహముగమ్ము.

పు—శెబాస్! కళింగా! నీయభిప్రాయము శ్లాఘనీయము. అట్లొనరించిన మనముస్థిరపఱచుకొనిన యుద్దేశముకూడ ఫలించును.— (దుర్జయునితో) ఓయీ! వివాహ మెప్పుడో నీవెఱుఁగుదువా?

దు—దేవా! ఎల్లివివాహమునిశ్చయము. కళ్యాణిపురాధిపుఁడు హేమపాలున కామెనొసంగుదురు.

పు—సరియె. మనమప్రమత్తులమై యుండవలయును. దుర్జయా! నీవు గుఱ్ఱములు సిద్ధపఱచుము.

(దుర్జయుఁడు నిష్క్రమించును)

తమ్ముఁడా! భోజనానంతరము మనమేగి యబ్బాలికను దోకొని వత్తము.

(నిష్క్రమింతురు)

ద్వితీయరంగము

(ప్రదేశము. ఉద్యానవనము. ప్రవేశము. ప్రమద్వర, రోహిణి)

ద్విపద

ప్ర— అంబరతలమున నమృతమరీచి
యంబుదచయముల నగపడఁడకట!
సౌరభవిలసిత సదమలపుష్ప
మారనిచిచ్చున కాహుతియాయెనొ!

తిమిరముగవిసెను తెలియదు దారి
నిమిషము హృదయము నిలకడగొనదు
జననముకోలె విచారములేక
మనితిని; యిపు డవమానము దోఁచె!
ఎల్లివివాహ మన్నతమొ? నిజంబా?
తెల్లముగా సఖి! తెలియఁగఁబల్కు—
తాళఁగఁజాలను తాళఁగఁజాల
తాళఁగఁజాలను ధైర్యముఁజెప్వ!

కో—ప్రమద్వరా! భామామణుల తలమానికమవు! నీవిట్లధైర్యపడనగు నమ్మా!

సుగంధి

బేలవే లతాంగి! యిట్లు భీతిఁబొంద నేమ్మదిన్
చాలుఁజాలు! బాష్పధార జాలువార నేడ్వకే?
శ్రీలుబొంది మోదవార్ధిఁ జేరి చెన్నుమీరఁగాఁ
జాలెదీవు హేమపాలు సద్మమందునన్ సఖీ!

హేమపాలుఁడు తక్కువవాఁడనుకొంటివా?

పంచచామరము

సుమేరుధీరుఁ డుగ్రవైరి సూదనుండు, రూపునన్
సుమాస్త్రుఁడో, జయంతుఁడో, విశుభ్రమూర్తిచంద్రుఁడో
యమేయ సద్గుణాంచితుండు న్యాయశీలుఁ డాతఁడే
సుమా త్వదీయపాణిఁబట్టు శోకమేల? సుందరీ!

శుభము చేకూర విచారించెదవేమి? ప్రమద్వరా! నీవు నేఁజెప్పునంతటి దానవు కావు. విద్యలనభ్యసించినదానవు. యుక్తాయుక్తములెఱుంగుదువు. నీవేయిట్లయిన, నితరకాంతలఁగూర్చి యేమిచెప్పఁగలవారము?

ప్ర — సకియా! నీవు నా మేలుఁగోరుదువు. నేదుఃఖించిన నీవుకూడ కన్నుఁగవ కెంపువార దుఃఖింతువు. నాసంతోషము నీయది. నాకును నీయందట్టి భావముగలదు. నాహృదయము నీవు వెల్లడిచేసియుంటివిగదా? హేమపాలుఁడు పురుషోత్తముఁడగును గాక; నాకాతనితోడిదేమి కలదు?

తే.గీ॥ అనునిమిషము మనోంబుజ మందు మధుర
మధువు స్రవియింప వరియింతు మహితయశుని;
సుందరాకారు, సద్గుణ బృందనిలయు,
విజయసేనుని రోహిణీ! వేయునేల?

రో — సఖీ నీయుద్దేశము నేనెఱుంగక కాదు; విజయసేనుని చరిత్రఁ నీవెఱుంగవో కో? వానియర్ధాంగివై నీవేమియనుభవింతువు?

మ॥ ధనమో? గౌరవమో? ప్రమోదమొ? మహోదారంబౌ
గారాబమో?
వనమందావిజయాభిధేయువరియింపన్ నెంతువశ్రాంతమున్
అనుజన్ముండతికోపమూను, జనకుండా, పొందుసంతాపముం,
వనితా! నాపలుకాలకింపు మతనిన్ వర్జింపుమా? వేడెదన్

మ॥ కులవిస్తారుఁడు, హేమపాలుఁడు, మనోగోళంబునన్ నిన్ను ని
చ్చలువీక్షించిరమాకుమారుఁడయ్యు కాశల్బూను; పూసెజ్జఁగ

స్నులుమోహ్వంగనుజాలఁడించుకయు, నీనోముల్ఫలంబొందు,నో
వెలఁదీ! నాపలుకాలకింపుమతనికి బెండ్లాడి మోదింపుమా?

ప్ర— రోహిణీ! నన్ను బాధింపకుము. చినతనమాదిగా మనమెట్లు పెరిగితిమి? నాకుంగడుఁ గూర్చుదానవు.

కం॥ గరళముఁ ద్రాగినఁ బ్రాణము
హరియించు నటంచు నెఱిఁగి యరవిందముఖీ!
కరుణఁ దొరంగి యొసంగెదు
భరియింపఁ దరంబె? విరసభావము దగునే?

చెలీ! హేమపాలుఁడు సుసేనుసమానుఁడు. మనోసాక్షిగా విజయసేనునిభర్తగా నంగీకరించితిని. కటకటా! దైవము నాయెడ ననుకూలుఁడు గాడయ్యె!

రో— ప్రియసఖీ! నీమాటలతీరుబాగులేదు. ప్రాతఃకాలముననే మంగళధ్వనులువినవచ్చును. పెండ్లికుమారుఁడు హేమపాలుఁడు నీపాణిసరోరుహమునకై నిమిషమొక యుగముగాఁ బుచ్చుచున్నాఁడు. ఇత్తఱి నీయభ్యంతరము సమంజసమొకో?

సీ॥ భర్తృహర్మ్యాంతర భాగంబులందునఁ
దూఁగు టుయ్యేల లూఁగఁ దోఁచలేదె?
కమనీయ తరమైన కలహంస తూలికా
పాన్పుల శయనింప వాంఛలేదె?
వెలలేని జలతారు వలువలు; రతనాల
తొడవులు, దాల్పంగ నెడఁద లేదె?
మధుర వస్తువులు, సమ్మదరసాంబుధిఁ దేలి

చెలియలతోఁ దినఁ దలఁపు లేదె?

తే. గీ॥ దాస దాసీ జనంబులు తరుణ మెఱిఁగి
సేవ లొనరింపఁ గొన చిత్తవృత్తి లేదె?
చదువుకున్నావు గద పెక్కు శాస్త్రములను
సమదగజయాన! చనునె యీ సరణి నీకు?

పిచ్చిదియైన మానిసివలె మాటాడెదవు. అబలా! తలపోసి బడలాడుము.

ప్ర—చెలీ! తలపోయుట కిప్పుడాయారంభము? విజయసేనునకు నాహృదయము దత్తమైన కొన్నిదినంబుల కాయుదంత మెఱింగితిని. నా యుద్దేశమీవెఱింగియుండియు, నన్ని తీరున వేచుచున్నదానవు. నా మనోనిశ్చయము మఱొక్కసారి చెప్పెదను; పునరుక్తియనక వినుము.

చ॥ జనకుఁడు దూలనాఁడు; ననుజన్ముఁడు దగ్గర రాఁడు; నీవు వా
రినను కరింతు వింకనను బ్రేమగనుంగొను వారలందఱుం
కనులను నీరు బెట్టెదరు; గాని మనోగత మన్యమాటనే
మనినను లాభమున్నె? యతివా! పరతంత్రుల నీవెఱుంగవే?

శో—సరియె. విజయసేనుని వరించితినంటివి. అది యెట్లు పొసఁగును?

ప్ర—సకియా! ఈపటిమూహూర్తము దప్పిపోయినఁ జాలును. తరువాత నా మనోభీష్టము సిద్ధింపకుండినమానె?

తే. గీ॥ ఎంతయో దూరమునఁ గల యిందుబింబ
మును గనుంగొని వికసించి పొలుపు నూపు
కలువయును ధవళాక్షి నిర్మల జలములఁ
గాంచునే ప్రేమ దూరము కాల మబల?

కావున రోహిణీ! కార్యములేనిమాటలు మాని కర్తవ్యమూహింతము. శుభముహూర్తము నిశ్చయమంటివి. నాకేమి దారిచూపెదవు. గత్యంతరములేనిచో భయపడుదానను గానుసుమా?

ఉ. చాలదె త్రాఁడు జానెడు; విషంబు కణంబు లభింపకున్నె; యే
మూలనునైన లేదె జలపూరితమైన తటాకమొండు; పో
గాలము రాదుగా శిఖికి కాంతె! యివన్నియు దూరమేనిఁ, నా
వ్రేలున వజ్రమున్నది, హరింపదె ప్రాణము, మ్రింగునంతలోన్

రో—అమ్మా! ప్రమద్వరా! ప్రమాదముఁ దలపెట్టెదవేమే? శరీరమాద్యం ఖలు ధర్మసాధనమ్మను త్రొల్లిఁటివాక్యము మఱచితివో కో?

ప్ర—హా! సఖీ! (కన్నీరు గార్చును).

రో—చెలీ! నీమనోనిశ్చయ మెఱుంగఁ గోరి హేమపాలునిఁ గూర్చి యట్లు నొక్కి వక్కాణించితిని. మనమిప్పుడు కర్తవ్యమూహింతము. ప్రమద్వరా! నీజనకుఁడు మూర్ఖుఁడు గాడు. వానిహృదయమునఁ గరుణయను భావమించుకంతైనఁ బొడమియుండకున్నె? మనమిరువురము నాతనితో మనయుద్దేశ మెఱింగింతము. మనవేడికోలు బలహీనమైనను, బాష్పవృష్టి యాతనిమనంబుఁ గఱిగింపకుండునా?

ప్ర—రోహిణీ! హేమపాలునియందు నాకుఁగల భావమును దండ్రిగారికి సూచించితిని. 'బాలా! మెఱయువస్తువు లన్నియుఁ బంగారమని తలంతువు!' అని మెల్లన మందలించిరి. ఈప్రమదావనమున కరుదెంచి, నీతోసంభాషించిన, దుఃఖమించుకేని యుపశమిల్లునని తలంచితిని; గాని నీయిష్టానుగతి మఱియొకసారి, నాకన్నతండ్రిని, నామేలుఁ గోరువానిని బ్రార్థింతును. శరణాగతరక్షణ సల్పఁడే!

రో—అమ్మా! ఇప్పుడుచాలా యాలస్యమైనది.— (అడుగుల చప్పుడాలించి) ఎవరోవచ్చుచున్నట్లున్నది.

(పుళిందకళింగులు ప్రవేశింతురు)

ప్ర—(ధైర్యమూని) అయ్యలారా! మీ రెవ్వరు? మీ యాకారములు చూడ కిరాతులవలెఁ దోఁచెడిని. మాయారామ సీమ యథేచ్ఛఁ జొరుటకు సాహసింపఁ గారణ మేమి?

క—విలాసినీ! ఈతఁడు పుళిందాభిధేయుఁడు; కిరాతరాజు. కళింగాంకుఁడనగు నేనాతని యనుంగు సోదరుఁడను. మా రాకకుం గారణమే మందువా?

ఉత్సాహ

పొలఁతి! నీవు మరుని సతినిఁ బోలుదానవనుచు, భూ
వలయ మెల్లనుగ్గడింప భావమందు మెచ్చి నిన్
వలచి యీపుళిందుఁ డిటకు వచ్చినాఁడు; ప్రేమయు
గ్గలిక మొందఁ బెండ్లియాడి కావు మోతలోదరీ!

కా—(కోపముతో) ఓరీ! దురాత్ములారా! పురీంద్రసేనుని గౌరవం బెఱుంగరా? సుసేనవిజయసేనులు మీదురంత మెఱుంగుదురేని మిమ్ముల నేమి సేయుదురు? మీ వాచాలతఁ గట్టిపెట్టుఁడు.

పు.—(ప్రమద్వరతో) కాంతా!

పంచచామరము

చలంబుఁ బూనరాదు; తండ్రి చాల కోపమూనునా?
బలంబుతో సహోదరుండు వచ్చునా? భయంబులే
దు, లోకజాల మెత్తి వచ్చి దోర్బలంబుఁ జూపినన్
విలాసినీమణీ! యడంతుఁ; బెండ్లియాడి ప్రోవుమా?

ప్ర—పుళిందా! నాయుదంతము నీకెఱింగించుట యనవసరమైనను చెప్పెద నొండు మాటాలింపుము.

తృతీయాంకము

కం॥ పర నారీ రత్నంబును
పరిరంభణ సేయఁ దలఁపఁ బాప మటంచున్
గఱపవె ప్రామిన్కులు? దు
శ్చరితంబును జేసి కొనకు జన్మము, బలుఁడా?

పు—ముద్దుగుమ్మా! బంగరుబొమ్మా!

తే. గీ॥ ఎల్లిపరిణయము గద నీ వింతలోనఁ
బరసతివి యెట్లైతివో యెఱుఁగఁజాల?
నేదియో వంకఁ జూపించి యెట్టులేని
యాసలు నిరాశ లొనరింప నగునె తలఁప?

రో—పులిందా! నీవే యభిమానవంతుఁడవేని, వచ్చినదారిఁ బట్టి పోయెదవు.

క—అన్నా! సాధువాక్యములఁ బ్రయోజనము హుళక్కి.

పు—(ప్రమద్వరతో) అంగీకారమూని నామూపెక్కి వచ్చెదవా? లేక బలాత్కారము సేయవలయునా? క్షత్రియులకు గాంధర్వ రాక్షసంబులుత్తమంబులు. నీయిష్టమొనర్తింతును.

రో—హా! ప్రమద్వరా! దురాత్ములు నిన్ను విడతురే?
(ఎలుగెత్తి) విజయసేనా! విజయసేనా!

(పులిందుఁడు ప్రమద్వర నెత్తుకొని పారిపోవును. కళింగుఁడాతని వెంట నంటిపోవును. రోహిణి మూర్ఛిల్లును. యవనిక వ్రాలును)

తృతీయ రంగము

(ప్రదేశము. ఒకచావడి. ప్రవేశము వజ్రపాణి. సుమిత్రుఁడు)

వ.పా—సుమిత్రా! పుళిందకళింగుల దౌర్జన్యమెఱుంగుదువా? ప్రమద్వరను బలిమి నపహరించి పాఱిపోవు నపుడు రోహిణి యాక్రందన మొనరించుచుఁ దద్వృత్తాంత మెఱింగించుటయు, హేమపాలుఁడు వీరాతివీరుఁ డగుటఁ, గరవాలమును ఝళిపించి, పురీంద్రునిఁ బురికొల్పి, సుసేనకుమారుఁడు వెంటరా, పరివారసమేతుఁడై హయంబుఁ బరుగెత్తించెను; అరణ్యప్రదేశమున వారలఁ గలిసికొనియెను. పుళిందకళింగులు మితపరివారులై యుండిరి. వారిమధ్య ప్రమద్వరఁ గానఁబడలేదు.

సు—తరువాత; తరువాత?

వ.పా—పిమ్మట హేమపాలుం డెలుగెత్తి, "ఓరీ! మదాంధులారా! సుకుమారి ప్రమద్వరను స్పృశించి ప్రాణములతోఁ బోవఁగలరా? ఆగుఁ డాగుఁడు!" అని దిక్కులు పిక్కటిల్లఁ బలికెను. కళింగుఁడు పుళిందుని హెచ్చరించి, హయంబుఁ ద్రిప్పి హేమపాలు నెదుర్కొనియె. తరువాత పోరు ఘోరం బాయెను. హేమపాలుఁడు పుళిందునితో రెండు గంటలు పరాక్రమంబు దీపింప ఖడ్గమునఁ బోరెను; దైవోపహతుఁ డగుట నాతని కరవాలము రెండుతునియలై పోయెను.

సు—(సంభ్రమమభినయించి) తరువాత నేమాయెను!

వ.పా—తరువాత హయంబుఁ డిగ్గి పుళిందునితో మల్లయుద్ధమునకు సిద్ధపడియెను.

సు—ముష్టిఘాతమునఁ బుళిందుని నష్టపఱచి యుండును గాఁబోలు?

వ.పా—అయ్యో! హేమపాలుని పరాక్రమాతిశయ మెఱింగిన వారెవ్వ

రట్లు దలంపకుందురు? దైవమాతనియెడ ననుకూలుఁడుగాఁడయ్యె, పుళిందుఁడు భయంకరారావములు భూతలమున గ్రవసేయ, మదకరీంద్రము చందాన హేమపాలుని పైఁబడి, పరశుపాతమ్ముఁబోలు ఘాతమున నాతని నుత్తమాంగము నొత్తివైచెను.

సు—కటకటా! కాలగతి! పిమ్మటజరిగ నేమి?

వ.పా—తరువాత, హేమపాలుఁడు మూర్ఛపడఁజెందెను. నేనాతనిని, సమీప శీతలసికతాతలంబునకుఁ గొనిపోయి యుపశాంతి యొనరించితిని.

సు—సుసేనుఁడు కళింగుని గెలువఁజేసెనా?

వ.పా—సుమిత్రా! ఏమిచెప్పుదును? పురీంద్రసేనుఁడు కుపితారక్తనేత్రుఁడై కళింగుని నెదుర్కొనియె. కళింగుఁడు బలమున నల్పుఁడు గాఁడు! పురీంద్రుని సైరించుచు, సుసేనునితోఁ బోరాడఁదొడంగె; కాని కొంతతడవునకుఁ జాలఁడయ్యె. సుసేనుఁడు వానినిహయంబునుండి క్రిందకుఁ ద్రోసెను. కొంతవడికాతని ఘోటకమాతనిఁ గాపాడెను. పురీంద్రుఁడు కృపాణప్రహారమున దానినొంచి, కళింగునిఁ దనతీవ్రాసికి బలిసేయనుంకించునపుడు, పుళిందుఁడు చండమారుతమువలె యాతనిపైఁబడి, యెడలేనిదెబ్బల వితబలునొనరించి, మూర్ఛఁబొందించెను.

సు—(తత్తరపాటుతో) పిమ్మట, పిమ్మట.

వ.పా—తరువాత సుసేనకుమారుఁడు భయంకరయుద్ధమొనరించి, పుళిందుని మూర్ఛనొందించెను.

సు—మేలు! సుసేనా! మేలు! తరువాత, తరువాత?

వ.పా—అత్తఱివడి వడియచ్చోటునకు ముసలిదొక్కతె సంతోషాతిశయమున మిన్నందుచు, నరుదెంచెను. 'యోధవరులారా! పోరాటముడుగుడు! ప్రమద్వరయునికి సురక్షితము!' అని గంభీరముగాఁ బల్కినది.

సు—(ఆశ్చర్యమభినయించి), వజ్రపాణీ! ఆముసలిదెవరు? నీకామెను

గూర్చి యేమైనం దెలియునా?

వ.పా——సుమిత్రా! కొన్నిదినములనుండి యావనమున నామె వాసమొనరించుచున్నయది. తఱచు వేఁటకాండ్రొసంగు మృగమాంసమును భోజనము సేయును; మితముగ భాషించును. విశేషాంశములామెను గుఱించి నాకేమియును దెలియవు.

సు——ఆమెనుజూచినప్పుడెల్ల యాశ్చర్య ముద్భవిల్లెడిని! ఆమెచరిత్రమునుంతేని గ్రహణాసాధ్యము.

వ.పా——నీవామె నెప్పుడుజూచితివి?

సు——ఆవృత్తాంతమాలింపుము. ప్రమద్వర కిరాతహతకుల బారిపడుటయు, రోహిణి, "విజయసేనా! విజయసేనా!" యని యార్తనాదమొనరించెను. పురేంద్రసేనుని శయనాగారమున నాతనికిమృదుశయ్యరచియించి, మెట్లుదిగ క్రిందికివచ్చుచున్నెడ, రోహిణియొనర్చిన దీననాదము నాకర్ణపుటముల భేదించెను. రోహిణి మూర్ఛావస్థఁ దెలివొందినదానివలె, నిడుదపెన్నెఱివేణి జీరాడుపడి వ్రేలాడ, భయవివశయై, పురేంద్రుని గదివైపు పోవుచుండెను. నేనామెను జేరంజీరి, "రోహిణీ! యిదంత మేమి?" యనియడిగితిని. ఉద్యద్బాష్పయై యక్కోమలాలలామ, రమణీయమగు పైటచెఱంగునఁ గన్నులుదుడిచుకొనుచు, గద్గదస్వరముతోఁ బుళిందకళింగుల దుర్వర్తనాంశము నామూలాగ్రముగ నాకుఁ దెలియఁజెప్పెను. తక్షణమ నేనామెను వీడ్కొలిపి, విజయసేన కుమారునకంతయు నెఱింగించితిని. విజయసేనుఁడు స్వార్థత్యాగి! ప్రమద్వర కీడువొందినవార్త నావలన నెఱింగి, హయారూఢుఁడై, యరణ్యమార్గముఁ బట్టెను. నేనును జవాశ్వమొండధిష్ఠించి యాతనివెంటఁ బోయితిని. దూరమున గజ్జపుర్ఘాతులు కొందఱు కృశాంగియగు ప్రమద్వరను పల్లకియందిడుకొని, బోయలఁ బ్రోత్సహించుచుఁ బోవుచుండిరి. అప్పుడు విజయుఁడాలుఁగత్తి,

మేఘగంభీరవాక్యముల వారి నెదుర్కొనియెను.

వ.పా.—(ఆశ్చర్యముతో) తరువాత? తరువాత?

సు—ఆగర్జితపురారాతులు విషలిప్త సాయక సహస్రంబులను విజయుని మాటలకత్యాగ్రహంబొంది, యుద్ధమునకు సిద్ధమైరి. ఆసంకుల సమరంబున దుర్జయుండను పుళిందుని సేవకుండౌ విజయసేనుని కరుణ నర్థింప, సహజదయామతియగు నాతండాతనిని క్షమించెను. వాని హయంబును గైకొని ప్రమద్వరను దానిపైఁ గూర్చుండఁజేసి గృహోన్ముఖుఁడుగా నుద్యమింపుడు, నీవు పేర్కొనిన వింతము సరిది యటకరుదెంచి, కన్నులార మమ్ముఁ గాంచి, సంతోషాతిశయమున నొండేమియుఁ బల్కనేరక, దీర్ఘశ్వాస మొనరించి, యచ్చోటువాసెను.—వజ్రపాణీ! దైవనిర్ణయమెఱుంగుట దుస్సాధ్యము. కాదేని, నేఁడు మహావైభవముతో వివాహము జరుగ వలసియుండునుగదా! మన ప్రయత్నములు దైవమున కసంగీకారములుగాఁ దోఁచినవి. కటకటా! హేమపాలుఁడు గాయమునిండ గాఁగని కాయములు బాధింపఁ బండుకొనఁజాలఁడు! కూర్చుండ నేరఁడు. ఆతని యవస్థకుఁ గన్నీరు వెట్టనివారెవరు? పురీంద్రసేనుఁడుగూడ కడుంగడు దురటిల్లుచున్నాఁడు. ఆనందబాష్పములు విడువవలసిన దినమున దుఃఖకణములు విడువ వలసివచ్చెను!

వ.పా.—రాజవైద్యుఁడూర లేడట; సమీపగ్రామమునకు నేఁగినటుల వార్త వినవచ్చె. నేను సత్వరము యాతనిఁ బిలువఁబోయెదను. హేమపాలుఁడు బ్రతికి బాగుండుటే కళ్యాణము!

సు—అవును, నీవు జాలము సేయకుము. మఱల కలిసికొందము.

(చెఱియొక వైపు నిష్క్రమింతురు)

శ్రీ

ప్రమద్వర

తురీయాంకము

ప్రథమరంగము

(ప్రదేశము. ఒకచావడి. ప్రవేశము, రోహిణి)

నెలదినములైనది ప్రమద్వర విజయసేనునిఁ జూడలేదు. ఆమె నానాఁటికిఁ గృశించుచున్నది.

చ॥ చనువున రామచిల్కయొక శ్రావ్యతరంబగు పాటఁబాడునో
మనమునబొందకోయిల క్రమంబునదప్పకకూయునో? గుణం
బునెఱుఁగఁగోరి శారిక ప్రమోదముజిప్పిలఁబిల్చునో? యటం
చునెదభయంబునన్ జనదుచూడఁగవేడుకతోఁటనెప్డున్

నేఁ డామె నన్నుఁ జేరంజీరి;

కం॥ జీవము దుఃఖముఁ బొందిన
నేవిధమున దేహముండు నెఱుఁగవె? జలమం
దావిరి జనియింపదె? పా
త్రావరణము శిఖినిఁగాలు నప్పుడు సఖియా!

అనికన్నీరు జాలువారఁబలికినది. కటకటా! విజయుని కరగ్రహణ వాంఛకొనసాగుట యెట్లని యామెయొకనాఁడైన దుఃఖింపదు; భయపడదు. ఆతఁడిప్పు డొంటరియై యెట్లున్నవాఁడో, యెట్టి

యిక్కట్టు లనుభవించు చున్నవాఁడో యని కరంబు దుఃఖించుచున్నది.
అవును.

తే. గీ॥ మణికి కాంతియట్లు సుధకు మాధురీ గ
రిమ విధంబ, గులాబికి విమలసౌర
భము కరణి; ముని కానంద భాగ్యముగతి
స్వార్థమెఱుఁగమి ప్రేమకుఁ సహజగుణము!

ఆమె నాతోడ మఱియును బల్కిన దేమనిన,

తే. గీ॥ కృష్ణపక్షమునఁ జకోర మేవిధంబ
మెలఁగు; విజయసేనునిఁ జూడ వలయునంచు
నాత్మగతమున వాంఛించి, యధికతర వి
షాదమొంది, నిస్పృహఁజెంది, సగమునైతి!

మనోనాథుని, విజయసేనుని సందర్శనభాగ్య మొక్కసారి కలిగింపవే? యని వేడినది; నమస్కరించినది. తరుణమునకు వలయువారు గదా, చెలిమివారు? (యోజించి) సుమిత్రుని సహాయమున,— (చూడ్కుసారించి) అదిగో! సుమిత్రుఁడిటకే వచ్చుచున్నాఁడు. సంతోషము!

(సుమిత్రుఁడు ప్రవేశించును)

రో—సుమిత్రా! కుశలంబా?

సు—రోహిణీ! విజయసేనుని సేవకులకాతని కుశలమే తమకుశలము.— ప్రమద్వర సంతోషవతియేనా?

రో—మిత్రమా! ఆమెకు సంతోషమేడది? ఆమె విజయసేనుని నెలదినములనుండి చూచియుండలేదు. తత్కారణమున నాతఁ డెట్లున్నవాఁడో యని భయముతోడి విచారమునఁ గరంబుకృశించినది. సేమ వచోవిలా

ఉ-ఉ

ప్రమద్వర

సము మెఱయ నామె నెన్నియోసారు లనునయింపఁ బ్రయత్నింతును; విజయసేనునిఁ జూచినఁగాని యామెకు మనోశాంతికలుగదు.

సు—రోహిణీ! విజయసేనుఁడు పూర్వమువలె గృహమునఁ గలవారందఱితోఁ గలిసిమెలిసి యుండఁగూడదు. ఇయ్యది పురీంద్రసేనుని యభిమతము. అయినను, విజయసేను నొకసారి యామెసమక్షమునకుఁ దోకొనివచ్చెదను. ఇందుకువలయు ప్రయత్నములను జేసెదను; భయపడవలదని మువ్మాటికి నామాటగా మీచెలియకుఁ జెప్పుము. మఱల సాయంకాలమున నిన్నుఁ గలిసికొనియెదను.

(నిష్క్రమింతురు)

ద్వితీయరంగము

(ప్రదేశము. అరణ్యము. ప్రవేశము. విజయసేనుఁడు, ప్రమద్వర)

సే—ప్రమద్వరా! నీమనోగతమునుండి నన్ను దూరము సేయుము. నీవిట్లు విచారించుట సరియగునది కాదు.

సీ॥ వేడికన్నీళ్లను విడచుకారణమునఁ
గనుదమ్ము లకట! కెంపునువహించె
దీర్ఘనిశ్వాసముల్ తెఱపి నెఱుంగమి
లలితేందువదనంబు తెలుపు వడసె
ప్రమదావనంబున భ్రమణంబు మానుట
పంచాస్య మధ్యంబు బలముఁదొలఁగె
కడుపార నాహార కాంక్ష దూరము సేయ

విలసితాంగము జీవ కళఁదోఁపఁగ

తే. గీ॥ నన్నుఁ బ్రేమించి నీవొందుచున్న సుఖము
గన్నులకు విశదంబు; నేనెన్న నేల?
మేలుకొనుమింక, జాలము మేలుకాదు
తరుణి! చంద్రుఁడు భూమినిఁ దాఁకునొక్కొ?

నాయందునీకు నిండారు మనోనురాగమున్నయది; గాని నేనందు లకుఁదగను. కాంతా! ఎట్టివారికిని ప్రమాదము గలుగకమానదు. విజయసేనుని తొందరపడి ప్రోత్సహించితివి. నీ శ్రేయమును మనోవాక్కాయకర్మలఁ గోరువాఁడనగుట, నన్నుమఱువుమని నిన్నుఁ బ్రార్థించుచున్నాను.

ప్ర—విజయసేనా! (సవిచారముగా)

ఆ॥ వె॥ వస్తు లోకమునకుఁ బడయు వారలకును
సడుమునిలచి వారి నెడము సేయుఁ
గాలమెంత కఠినురాలొ! దుష్టాత్మయో!
నేను నీదుదాన నైనఁగాను!

వి. సే—నాపలుకాలింపవుకదా? హేమపాలుఁడు ధనపతి; విశేషించి నిన్నుఁ బ్రేమించువాఁడు నావృత్తాంతమాద్యంతము నీవెఱుంగుదువు కదా? బుద్ధిఁదలపోయుము.

ప్ర—పురుషాగ్రణీ!

కం॥ మనమున జననంబొందును
మనమున వర్థిల్లు ప్రేమ మరియాద గనుక
మనము గనుంగొను దూరము;
మనుజుని తెలివెంతయేని మందముగాదే?

వి. సే—హృదయమునను దూఁగదృష్టికలదు; గాని సమయ సముచితవ
 లెఱుంగవలయునుగదా?
ప్ర—విజయసేనా! ప్రేమ భయ మెఱుంగదు.
వి. సే—అట్లయిన, విజయసేనుఁ డేనా నీమనోనాథుఁడు?
ప్ర—మనోసాక్షిగ!

(ఒడిలో పూవులు క్రిందఁబడుచుండ సంభ్రమకలితయై రోహిణి

ప్రవేశించును)

రో—సుసేనుఁడు! సుసేనుఁడు!—

(ప్రమద్వర మందహాసవిలసితయై చూచుచుండును. విజయసేనుఁడు శాంతమతియై నిలువఁబడును.—హయంబునుండి క్రిందఁదుముకి కోపఘూర్ణితుఁడై సుసేనుఁడు ప్రవేశించును)

సు— భుజంగప్రయాతము

దురాత్ముండవో, ధర్మ దూరుండవో, దు
ష్ట రక్షోకులంబందు జన్మించినావో
పరాకింత లేదా? యభావంబుగాదా?
సరోజాక్షితో నేమి సంభాషణంబో?

తే॥ గీ॥ కన్నుఁగవ నెత్తికెక్కెనా? తిన్నతిండి
యరుగదా? ఊసుపోవదా? తరుణి మాట
గాని యొండొకని పలుకు కర్ణములకుఁ
గష్టతరముగఁ దోఁచునా? కఠినహృదయ!

ఓరీ! సిగ్గుమాలినవాఁడా! పరువుగోల్పడినవాఁడా! ఎన్నిసారులు నీకుఁజెప్పితిని; చెప్పించితిని; వలదుసుమా? ప్రమద్వరతోడ సంభాషణము. ఛీ! అభిమానధనుఁడవేని, నీపెత్తరుణమున, నీరహాస్య యరణ్యా

ప్రదేశమున, సుకుమారియు, వివాహయోగ్యయు నగు కన్యామణితో మాటాడ సాహసింతువా? నీచకులోద్భవా! పరులయింటఁ దలదాచుకొని, పరులకూటికాశించు నీవా ప్రమద్వరను బరిణయమాడఁగలవాఁడవు? ఆగోలబేలయై నీతోఁ జనువిచ్చి మాటాడుకతమున నీవిట్టి దురుద్దేశములను మనంబునఁ గల్పించుకొంటివి. నీచా! నాయందు నీకుఁగల భావమెట్టిది? 'తమ్ముఁడా!' యని పిలుచువాఁడవు! తమ్ముఁడు బావయెట్లగును? తమ్ముని సోదరి నీకు సోదరి కాదటరా? మూఢాత్మా! లోకమువారీవార్త నెఱుంగుదురేని, నానబెట్టరే? ఛీ! యనరే? అప్పగారి గౌరవము కడముట్ట నశింపదే? సుసేనుని యభిమానము నీ వెఱుంగవా? నీమాటకేమి? అపకీర్తి కొడిగట్టితివి! మదాంధా! హేమపాలుఁ డిదివఱకే నీయందత్యంతాగ్రహమూనియున్నాఁడు; గృహమునుండి నిన్ను తొలఁగింపవలయునని సూచించెను. ఆతఁడిప్పటి నీవర్తన మెఱింగిన నిన్నుఁ బ్రాణముతో విడచునా? వాచాటా! నీవు నాకోపాగ్నిం బడితివి; దగ్ధము గాకుందువే? (కత్తి నెత్తును; విజయసేనుఁడు శాంతభావము సూచించును)—రోహిణీ! దురాత్మురాలా! మేకవన్నె పులివి! ఏమియు నెఱుఁగనిదానివలెఁ గానఁబడుదువు. అబ్బా! ముద్దురాలవు!—ప్రమద్వరా! ఏమి గ్రహచారమే? మాకుల గౌరవముఁ జెఱుపఁబుట్టితివి! మాననీయుఁడగు పురేంద్రసేనుని గర్భమునఁబుట్టక కసాయివానికడుపునఁ బుట్టిన నెంత బాగుండును? నిన్నుఁ గూర్చి దుఃఖింపనా? కోపగింపనా? ఈవాడివాలున నీశిరంబు దెగనేసిన నందఱును సుఖింతురుగదా?—రోహిణీ! మాటాడకుము. దీనిని తీసికొనిపోయి యంతఃపురమున నిర్బంధింపుము. అప్పగారి సుమతి యెట్లు మెలఁగవలయునో, గ్రహించెదను.

ప్ర—సుసేనా! కోపాంధుఁడవై విజయసేనునితో యుద్ధమునకు సిద్ధపడకుము. ప్రజ్వలితకీలలతో నాఁటలాడు వేమఱుఁడుందునా? (రోహి

జేనో కొంతదూరము నడచి, వెనుదిరిగి చూచును. సుసేనుఁడు కత్తి త్రిప్పుచుండును. విజయసేనుఁ డొరవిూద చేయివేయును)

జే—ప్రమద్వరా! రమ్ము! రమ్ము! కొదమసింగములు కదనమునకు మొఁగిడినవి. అప్పగారికిఁ జెప్పవలయును. (వడి వడి నిష్క్రమింతురు)

(తెర పడును)

తృతీయ రంగము

(ప్రదేశము. హేముని సౌధద్వారము. రక్తసిక్తములగు దుస్తులతో, వికలమనస్కుఁడై, విజయసేనుఁడు ప్రవేశించును)

ద్వా. పా—(భయంబుసూచించి) బాబూ! ఈరక్తమేమిటి?

(వి. సే. జవాబుచెప్పకయే లోనికరిగి, దుస్తులు మార్చి యాసనాసీనుఁడై)

హా! మోహమా! నీబలమత్యధికము! అనివారితము! నన్ను మోసపుచ్చితివి; ఇంకను తృప్తి లేదా? —ప్రమద్వర తనమనోగత మెఱింగించెనుగదా? త్రికరణశుద్ధిగ ప్రేమదృష్టి నన్నామె చూచుచున్నటుల నామనోగతమే నిదర్శనము. ఆవిమలచారిత్రను జూచునపుడేమి, యాలించునపుడేమి, హృదయమున ననిర్వాచ్యమగు మహానందమొకటి జనించెడిని. ఆహా!

సీ. సదమల గుణమణి వదనమూరక యోరఁ
జేయ ఝల్లని గుండె చెదరి పోవు
వనజాక్షి ప్రణయ కోపముఁ జూపు వేళ నా
కాశము పై బడ్డ కరణిఁ దోఁచు
సంపూర్ణ శశిముఖి చలమొకింత వహింపఁ

ప్రాణము పోయిన భాతి తోంచు
తను లతాంగని యొక్క క్షణము బాసితి నేని
విలయ కాలము వచ్చు విధము దోంచు

తే॥ గీ॥ తరుణి హాస్యార్థమై విన్నఁదనము జూపి
పలుకమానిన యపుడు దుర్వారమైన
తల్లడంబును మై సొమ్మసిల్లుటయును
గలుగు; నామె నెట్లు మఱువఁ గలుగువాఁడ

(యోజించి) నాకాలలనాశిరోమణిపైఁ బ్రేమయుండెడినందుఁ గాక నే నేల మూర్ఖచిత్తుఁడనై యానాఁడామెను నామనోగతమెఱింగించితిని! ఎఱింగింపక నేనుండఁ గలుగుదునా? నాహృదంతరాళమామె కెన్నఁడెఱుంగఁ జెప్పవాఁడనని నిమిషమొక యుగముగాబుచ్చి నిద్రాహారములకు దూరమై యెట్లు కృశించితిని? సమయములభింపఁ జెప్పితినిపో, యేమిసంతోషము? తొందరపాటు వహించితినని వగంగుందుచున్నవాఁడను. ఆహా! ఇదికదా మనోహరమగుబాధ! — నేఁడేల తిరుగయట్టి సంభాషణమున కాప్రదేశమున నే సమ్మతించితిని? ఆమె వాక్సరణి యామెహృదయము నెఱింగించెను గదా? ఆమెకరగ్రహణభాగ్యలాభము నమ్మట కలలోనివార్తను నమ్మట!—అయినను,

తే॥ గీ॥ ప్రేమ యను దీపకళికచే హృదయ సీమ
కాంతిమంత మొనర్చని కఠినుకంటె
ప్రేమఁ గొని, పొందనేరని విమలశీలుఁ
డధిక తరమన నిశ్చయం బగును గాదె?

(మోమెత్తి నిట్టూర్పు విడచి) సుసేనుఁడు మాయిరువురిసంభాషణ మెఱింగి యుండిపడియెను. సన్నరానిమాటలాడెను. అవును!—

తే॥ గీ॥ కులము భావింపలేను; సంకోచము గద
తల్లిదండ్రు లెవరో? ప్రమద్వర సహోద
రి సమకద? యామె యందునఁ బ్రేమఁ గొనిన
పరమ పాతకునకు గాదె పరిభవంబు?

నిశ్చయము, నాయది ఘోరబోటు; దీన నగుబా టగుట యాశ్చర్య మెట్లో? దుర్నిరీక్షంబగు సూర్యమండలమును తదేకధ్యానమునఁ జూచు వాని కన్ను లంధత్వమువహింపవే? సుసేనుఁడు నాకుహితబోధకుఁ డాయెను. ఆతని పథ్యవాక్యము లనుసరణీయములు.—అకటా! నేను నిజముగా దోసకారిని!

తే॥ గీ॥ తండ్రిఁ బోలు పురందరునిఁ దలఁపనైతి
హితుని సోదరుని సుసేను నెన్ననైతి;
పూవుఁ బోణిఁ బ్రమద్వరఁ బోల్చనైతి;
నిజము! నావంటి వాని కీనింద తగును!

సుసేనుఁ డీవార్త యప్పగారి కెఱింగించియుండును. ఆతఁ డెంత కటకటపడునో? నన్నెంతదూలనాడునో? కృతఘ్నుండనగు నన్నాతఁడు మన్నించునా? అయ్యో! నాయపరాధము మన్నింపదగినదా?—(యోజించి) ఏమిది?

తే॥ గీ॥ అతివ కరమును బొందంగ నాశ పడుట
కష్ట నిష్ఠురముల మార్గగమనమునకుఁ
బూనుట యటంచు నెఱుఁగక పోవలేదు
అయిన మానస మామెనే యభిలషించు?

(సుమిత్రుఁడు ప్రవేశించి, విజయసేనునిఁ జూచి, తనలో)

సీ. కరుణామృతముఁ జిమ్ము కన్నుదమ్ములతోడ
ముద్దు చంద్రునిఁ బోలు మోముతోడ
శరదిందు చంద్రికా దరహాసరుచితోడ
గంభీరమైన వక్షంబుతోడ
జానుపర్యంతంబుఁ జను బాహువులతోడ
మెఱుపుఁ దీఁగను నవ్వు మేనితోడ
వినుకెంపుఁ దలపించు మణిహారములతోడ
రమణీయమైన తురాయితోడ
ఆ॥ వె॥ చిలుక తేజి డిగ్గి తలిరాకుటమ్ములు
మఱచి యరుగుదెంచు మరునిఁ బోలి
చెక్కుఁ గరమాని చెదరకచూచుచు
విజయసేనుఁడు గను విందొనర్చు!

ఆహా! వీనిం జూచినఁగదా, దృష్టుల్గనినలాభముఁ గనినవారగుదురు! ఈతనివిధంబుఁ గనుఁగొన గాఢాలోచనాధీనుఁడైనటులఁ గానవచ్చెడిని. కటకటా! వీనికీదుర్వార్త నెట్లెఱింగింప నేర్తును?

తే॥ గీ॥ ఊర్మిడోలికలందున నూఁగులాఁడు
హంసరత్నంబు మేఘగర్జారవంబు
నాలకించి నెమ్మది దిగులందురీతి;
సలలితములగు సౌరభ్యములనుజిమ్ము
వికసితారవిందంబు తుశ్వేదనమునఁ
జటులఝంఝానిలంబున సమయుమాడ్కి

లలిత లావణ్యచంపక లతకరంబు
వాడి భానుని కరముల వాడుభంగి
పసికగుందు హృదయపుట భేదనంబు
తెలుపఁ గలనెట్లు కఠినంబు మొలికివార్ల ?

పురీంద్రసేనుని తీవ్రాజ్ఞ యిట్లున్నది! విధిగాఁ జెప్పవలయును.
(ముందునకుఁబోయి) — హా!

తే. గీ॥ గుండె తటతటయని వేగకొట్టుకొనెడు
దుర్భరంబగు కంపమావిర్భవించెఁ
బలుకు తడబడుచున్నది; భావమొకటి
యైనఁ బొడమదు; మాట్లాడఁ బూనుటెట్లు?

(వి. సేనుని సమీపించి) సజ్జనచూడారత్నమా! స్వాగతము!

సే — సుమిత్రా! వికాసముఁదొలఁగి నీమోమట్లున్నదేమి? నీవెన్నఁ డును విచారమనునది యెఱుంగవు. సదానందుఁడవని నేనమ్మితిని. నీ పవిత్రహృదయముకూడ విచారకీలావళి కాహుతియాయె నే?

— విజయసేనకుమారా! ముప్పదియేండ్లు దాటినవాఁడను. నేఁటి దనుక నేనెట్టివిచారమనునది మనోతలమునఁ జోటొసంగి యుండ లేదు. నేఁటినాయవస్థ —

సే — (అత్యాశ్చర్యముతో) ఏమీ! నీకుఁగలిగిన దురవస్థయెట్టిది? దాని కారణమేమి? సత్వరము నాకెఱింగింపుము. నాప్రాణములు గోల్పడి యైన నీభారముఁ దొలఁగించెదను.

— కుమారా! ప్రపంచమున మనుజుఁడు, తనకు దురవస్థ సంఘటిల్లినను తనతోడివారలు దుర్గతిఁ జెందినను వగఁగుందుట నిజము, ఇదినీ వెఱుంగ నిదికాదు.

వి. సే — అవును. అదిమానవప్రకృతి; కాని తనయవస్థనుఁ గంటె తన
వారిదురవస్థనుఁ గలుగువిచార మెన్నియో రెట్లధికము.

సు — నాయనా! నీయర్థము సూనృతముకాదని యనుభవశాలి యెవ్వఁ
డనఁగలఁడు? ఇప్పుడు నాహృదయము నాకొఱకై విచారింపలేదు.

వి. సే — సుమిత్రా! నీవుసుమిత్రుఁడవు. నీచెలికాఁడెవఁడు దుర్దశ
నొందెను? నీజననీజనకులు, కడుంగడు వృద్ధులు, సుఖమున్నవారే?
నీభార్య సుగుణరాసి, సతీరత్నము, కుశలమేకదా?

సు — (తనలో) అకటా! నాయందీతనికి నిరుపమానాభిమానము.
ఈతనికెట్లా దారుణవార్త నెఱింగింపనేర్తును? (ప్రకాశముగా)
కుమారా! నాప్రియమిత్రుఁడొకఁడు నిష్కారణముగా నిందపాల
య్యెను!

వి. సే — సుమిత్రా! ఆనిర్భాగ్యుఁడే, విజయసేనుఁడని తెలిసికొంటిని. నీవు
విచారింపకుము. దైవోపహతుఁడనగు నానిమిత్తము నీవుకంటఁదడి
పెట్టకుము. — అప్పగారు నిన్నిటకుఁ బంపిరా?

సు — అవును. ఆతనిసందేశమును గొనివచ్చితిని. భయంకర నిర్ఘాత
సదృశంబైనను దెల్పవలయును. నీవు తదనుగుణముగా వర్తింపవల
యును.

సీ. కాలయాపన సేయఁ గష్టతరంబైన
నోరులకంటఁ బడక యుండవలయు
బాణజాలముత్రుప్పు పట్టినప్పటికైన
నడవికి వేఁటాడ నరుగవలదు
జఠరాగ్ని బాధించి చంపుచుండిననైన
దినమున కొకసారి తినఁగవలయు
సుకుమారదేహంబు సొమ్మసిల్లిననైనఁ

ప్రమద్వర

గరిసతలమున నిద్రఁ గాంచవలయు:—

హా! విజయసేనా! పురీంద్రునకు నీయందిట్టి యాగ్రహము గలుగ నేల? మిత్రదర్శన మొనర్పక నిమిషమైన నిలువఁజాలవు; ఒంటరిగా నెట్లుండఁగలవు? వనమున భయంకరమృగ మొండు ప్రవేశించిన దని వినినయుత్తరక్షణమున నే బాణాసనమెక్కు వెట్టి, జ్యానాదము కర్ణపుటముల విందుసేయ, హయంబెక్కి చనువాఁడవు; మృగయావ్యాపారములు దలంపక యెట్లుండఁగలవు? పంచభక్ష్య పరమాన్నములు సంతుష్టి భుజించువాఁడవు; దినమునకొక్కమారు భుజించి యెట్లుండఁగలవు? హంసతూలికాతల్పమున మేను జేర్చి సుఖనిద్రఁ జెందువాఁడవు; కఠినప్రదేశముల నెట్లు శయనింపఁగలవు? కటకటా! విజయసేనా! ఇంతియకాదు. మఱియొండు విశేషముగలదు. ఆలింపుము.

తే॥ గీ॥ నయనయుగము లేతన్వి సందర్శనమున
సంతసాంబు వృష్టిఁగురియు సంతతంబు
నా ప్రమద్వరను గలలో నైనఁ దలప
వలదు; కటకటా! యెంతయాపదఘటిల్లె?

వి. సే—సుమిత్రా! నీవు కారణములేని విచారమునకు లోనైతివి. నీసందేశము నాకానందమే యొసంగినది! (ఆత్మగతమున)—

ఉ. హారముఁ గోరనేరను విహారము దూరము; హారముల్ మహా
భారములౌనుగాదె? సువిచారము నేరముగాను మారు; దు
ర్వార విచారకారణము ప్రాణము ధారణసేయుఁటారయన్
మారుని కేళమోయను ప్రమద్వరలేని సుధర్మయందునన్

పురీంద్రుని వాక్యపరిపాలనము సేయు నెడ విచారమున సంతోష

యుండవలయును. (ప్రకాశముగా) సుమిత్రా! పురేంద్రసేనుని సందేశాను గుణముగ వర్తించెదనని చెప్పుము. అతఁడు వాడివాలున నన్ను వాలుపనెంచినను, సంతోష సమాకలితుఁడనై సన్నద్ధుఁడనయ్యెదనని చెప్పుము.

సు—కుమారా! నీకు నేనెట్టి యుపకారమును సేయఁజాలనా? చీఁకటి రాత్రములువచ్చినవి; వెన్నెలలు రాకమానునే? — నేఁబోయివచ్చెదను.—

వి. సే—(అవనత వదనుఁడై) మంచిది. అప్పుడప్పుడు నీవిచ్చటకు వచ్చుటకు వీలుండదుకదా?

సు—కృపాపరతంత్రుఁడగు పరమేశ్వరుఁడు నిజానిజము లెఱుంగును. నేనుసుమిత్రుఁడ నేని నీదర్శన మెన్నఁడొ యొకదినమైన మఱిడఁగలనా?

తే. గీ॥ ఆయతమునఁ గ్రోసెడు; పొడుగందు బదియు
క్రోసులుగల భూధరమును గుట్టయనుచు
వారిరాసిని యొక సెలయేఱటంచుఁ
దలఁతు మిత్రునిఁ జేరంగఁ వలయునపుడు

వి. సే—నిన్ను నేనెఱుఁగనా? సుమిత్రా! నేనుండెదను.

సు—కుమారా! పోయివచ్చెదను—(కొంతదూరమునడచి, మగుడి వి. సేనుని సమీపించి) హా! విజయసేనా! నిందపాలైతివిసుమా! (కన్నీరుఁగార్చును. వి. సేనుఁడు. చేతిరుమాలున నాతనికన్నీరు దుడిచి)—

వి. సే—మిత్రమా! నాకై విచారింపకుము. నీవిట్లు దుఃఖింతువేని నేనెట్లు సంతోషము సూచింతును?

సు—కుమారా! సుసేనునివృత్తాంతము నీవెఱుంగుదువా?

వి. సే—(ఆశ్చర్యముతో) ఏమీ? ఆతఁడింకను గృహమునకే తేఁలే
సు—హా! పరలోకమున కరిగినవారు మగుడి యెట్లువత్తురు?
వి. సే—ఆఁ! ఆఁ! ఏమనుచున్నావు! సుమిత్రా! నిక్కము వచిం
సుసేనుఁడు సజీవుఁడేకదా?
సు—కుమారా! నిక్కము దాప నేల? సుసేనకుమారుఁడు మృగ మఱిగి యెంతకును రాడయ్యె. వనపాలకుఁడొకఁడరుదెంచి, కరవాలమొకటి యొసంగి పురీంద్రునితో, "దేవా! ఈలోహ మొక నెత్తుర మడుఁగునందు దొరకినది." అని చెప్పి యొసం ఆఖండితకృపాణమునీయది. వనపాలుఁడు నిష్క్రమించిన కొంత వేళకొక యాటవికుఁడరుదెంచి, సుసేనుని శిరోవేష్టనమును జూపి, "ఇది మన వనోత్తరదిశఁ బారునదిలోఁ గొట్టుకొనిపోవుచుండఁ తెచ్చితిని." అని పురీంద్రుని ముంగలఁ బెట్టెను. తరువాత ద్వాలకుఁడేగుదెంచి, "దేవా! విజయసేనుఁడు రక్తసిక్తంబులగు దుస్తు గృహప్రవేశమునరించెను. "సంగతియేమి? యనియడిగితిని; చెడయ్యె; మాటాడఁలేదు!" అనిపలికెను. రోహిణీ ప్రమద్వరల నటయు, శరణ్యమున నిన్ను సుసేనుఁడు పరుషోక్తుల నొప్పించుటాది గలవృత్తాంతమును జెప్పిరి. ఆతఁడు కత్తిఁ ద్రిప్పెనట! నివార జేయనిడితివట.—ఆదిగాఁగల విషయావలోకనమున నీవు—
వి. సే—హా! సుమిత్రా! దుర్భరము! దారుణము! సుసేనుఁడు మరణి లేఁడు! సజీవుఁడు! సజీవుఁడు!—నిర్దోషిని!—నాకు నిదుర వచ్చుచున్నది. శయ్యారచింపుము. (పడకగదివైపు పరుగెత్తును)

(తెర పడును)

తు రీ య ర ం గ ము

(ప్రదేశము ఒకగది. ప్రవేశము. ప్రమద్వర, రోహిణీ విచారమనస్కలై)

ప్ర — రోహిణీ! నిజమేనా! అయ్యో!

చ॥ కరము మనోభిరామమున 'గాదిలిసోదరీ!' యంచుబిల్చునే;
 సరనిమిషంబు భోజనము సర్వము జాలముసేయఁదాన స
 త్వరముగ నేగుదెంచు; వినుతంబగు బుద్ధి గరించునన్ను; నే
 త్రరఁగున నాసుసేనుని మఱిందలపోయక నుండునక్కటా!

చెలియా! నామంగళముఁ గోరువాఁడు, నాయనుంగు సోదరుఁడు భూమినింక లేడా? నికన్ంబగునే?— హా! అన్నయ్యా!

తే. గీ॥ ముద్దుచలిఁగొన్న రీతి యేప్రొద్దు నన్నుఁ
 బిలుచువాఁడవు మణిసౌధ వీథులందుఁ,
 బాసినాడవె భీకర వన్యసీమ
 పాతకీ! యనిపిల్చి కోపంబుకతన!

చెలీ! రోహిణీ! ఈమాట నేనమ్మఁజాలను. — ఏమో!

(అన్ననుద్దేశించి) —

ఆ. వె॥ విజయు శాంతగుణము వెలయంగతుదిదాఁక
 మానధనుఁడ వౌటఁ బ్రాణములను
 చేతిపోతి భయద పాతంబుచేతను
 గోలుపోయినావె? కూర్మియన్న!

హా! రోహిణీ! నా సహోదరుఁడు, నాయనుంగు సుసేనుఁడు, మర
ణంబు నొందియుండునని నాకుఁదోఁచకున్నయది.—ఏమి!

ఆ. వె॥ కడిఁదిశరభ మృగనికాయమైనను, లేక
హరులుగాని, మత్త కరులుగాని
భయము నెఱుఁగఁడెదను; బాధించి చంపెనో?
కాలవశత నొందు కఠిన మృగము?

నామనంబు పరిపరివిధములఁ బోవుచున్నది. సఖియా! నీయుద్దేశ
మేమి?

రో—చెలీ! నిక్కము దాపరాదు. ఎఱిఁగినయుదంత మాప్తులకుఁ జెప్ప
నిచోఁ బాపము దాపురించును.

ప్ర—నీమాటలు నాకించుక యాశకలిగించుచున్నను, నీముఖవైఖరి దానిని
పూర్వపక్షము సేయుచున్నది.

రో—అమ్మా! చెప్పితీరవలయును!

సీ. అసితోత్పలంబును నపహసింపఁగఁ జాలు
చక్కని నునుమేను చాయవాఁడు;
జయలక్ష్మికావాస స్థానమైయొప్పారు
రమణీయమైన యురంబువాఁడు;
ఎగు భుజంబులవాఁడు నగుమోము నందొకి
యింతకోపంబు భావించువాఁడు
భయ మెఱుంగనివాఁడు పటు పరాక్రమనిధి
నిశ్చితార్థంబును నిలుపువాఁడు

తే. గీ॥ కటకటా! సుసేనుఁడు ఘోర కాననమున

విలయ కాలమునాఁటి వేవెలుఁగు రీతి
బాధబెట్టి విజయుని దుర్భాషణముల,
నతని క్రూరాసి కెరయయ్యె నబ్జవదన!

ప్ర—హా! హా! హా! (మూర్ఛిల్లును. రోహిణి శైత్యోపచారవిధులు గావించును)

పు. సే(ప్రవేశించి)—కుమారీ! విచారింపకుము.—అమ్మా! లే! లే!

ప్ర—(లేచికూర్చుండి) అప్పగారూ! విజయసేనుఁడు హంతకుఁడు కాఁడు.

తే. గీ॥ పూఁచునే చంపకలతకు మోదుక సుమ
ము; గఱికను మేయునే సింహము; మధువువడ్డ
యునొకో చేఁదుగుణము; ధాత యోర్వలేక
చారుధవళతలమున లాంఛనము వెట్టె!

పు. సే—కుమారీ! నిజమెఱుంగుటకు వలయుసాధనములు లేకపోలేదు. విజయసేనుఁడు మానవుఁడు. మానవునకు సహజములగు కొన్నికొన్ని లోపములుండితీరును. దురాగ్రహంబున ముందు వెనుక లరయక, నా కుమారరత్నమును, నాకులార్ణవసుధాధాముని, నాసంతోషవర్ధనునిఁ జంపినాడు. అతనిని కఠిననిర్బంధన శిక్షపాలుగావించితిని; కాశ్మీరదేశాధీశ్వరున కీయుదంతమంతయును వ్రాసిపంపితిని. ఏదియెట్లు జరుగునో?

ప్ర—జనకా! తొందరపడవలదు. విజయసేనుఁడు మీకుక్రొత్తవాఁడు కాఁడు. అతనిగుణగణనము మీరెన్నిసారులుచేయలేదు. తలపోయుఁడు. నిజానిజము లెఱుంగుఁడు.

రో—ఆర్యా! కుసేనుఁడు నిజముగా మృతిబొందియుండునా? వనమంతయును వెదకింపుడు.

పు. సే—వెఱ్ఱిబాగులదానా! పగలు రాత్రియనిన నమ్మువా రెవరు?

(ఇంచుక యోజించి) కుమారీ! ప్రమద్వరా! హేమపాలుఁడు నీతోడ నేమియో మాటాడునట! అతఁడిప్పుడే యిటకు వచ్చును. నీవలంకృతవై యాతని రాక నిరీక్షించుచుండుము.

(నిష్క్రమించును)

(యవనిక జారును)

పంచమ రంగము

(ప్రదేశము. అరణ్యము. ప్రవేశము. వింతముసలిది)

హా! ఎన్నెన్ని మార్పులను జూచుచున్నాను. నిజము. నాయది కష్టపుబ్రతుకు! దైవమా!

కం॥ మఱియొక జన్మం బెత్తుట
స్థిరమా? యటులేని నీకు శిరమొగ్గెద, నా
పరితాపంబును దీర్పఁగఁ
గరుణాకర! యిట్టిజన్మ గరుణింపకుమా!

(యోజించి, తలయూఁచి, ముందునడచి, మీదఁజూచి) అబ్బా! మెఱుపులు, గర్జానినాదములు, మేఘమాలికలు, తెగపి నెఱుంగకున్నయవి! వర్షము ధరగుండఁ గూల్చినట్లు గురియుచున్నది. అబ్బబ్బా!

తే. గీ. చింకిగుడ్డలు దాలిచి; శీతలపవ
మానుబాధకు వణఁకుచు; మేన వర్ష
ధారలు బ్రవహింప; నిలువనేరక, నిబి
డాంధకారమునఁ దిరుఁగు దశవియుండు

(ఊహూ హూ హూ, అనివణఁకుచు, కొంతదూరమునడచి, ముందుచూచి)

తే. గీ॥ దుష్టలోకము మధ్య నుత్కృష్టుఁ డొకఁడు
గలుగునేని సత్కీర్తిని గాంచురీతి;
అల్లదే! తమోభరితమౌ యటవిసీమఁ
గానఁబడు దీపరేఖ ప్రకాశముగను!

అటకుఁబోయెదను. ఈరాత్రి యచ్చోటున విశ్రమించెదను. (ముందడుగిడి) అబ్బా! పాదములు వణఁకుచున్నవి. (స్థైర్యమవలంబించి)

తే. గీ॥ పెళపెళ విఱిగినను మిన్ను విఱుగుగాక!
అవనిపాతాళ మంటిన నంటుగాక!
ప్రాణములు నాదు కంఠంబుఁ బాయుదాక
విడతునే శపథంబు దుర్వినయగతిని

(పుళిందుని సౌధమునుసమీపించి) ఇది వనరాజు పుళిందుని సౌధరాజము. ఆహా!

ఆ. వె॥ ధ్వజము గానఁబడదు, దాని టపటప ధ్వ
ని వినవచ్చుచున్నది విశదముగ;
నాకసంబునంటు ప్రాకారవిలసిత
హర్మ్యరాజ మిట్టి దవనిఁ గలదె?

దౌవారికుఁడు—ఎవరు! ఎవరు!

విం.ము—ఓయీ! మీరాజుతో నిట్లు చెప్పుము.

తే. గీ॥ దిక్కులేనిది; యబల యర్థి; పరగాదు;
తిండి యెఱుఁగదుస్వామి కొన్ని దినములయ్యె

నేఁటి చలిబాధ సైరించి నిలువలేక
నీదుశరణంబు గోరెను నృపకుమార!

అని చెప్పిన యనంతరం బాతని యభిమతము శీఘ్రింబ నాకెఱింగింపుము.

దౌ—పో! పో! ఇప్పుడు నేను చెప్పలేను.

విం.ము—ఏమీ! ఈపొగరుబోతుతనము! ఓరీ! నన్ను దిరస్కరింతువేని మాయేలికతో నీసోమరితనం బెఱింగించి, నీకూటిలో మన్నుపోయింతును. జాగ్రత్త!

దౌ—(భయముతో) అమ్మా! నీవువనదేవతవో! లేక మరెవ్వరో! నీసందేశమేమి?

విం.ము—(దిక్కులేనిది; అనుపద్యము మఱలచదువును)

(దౌ. లోనికరుగును)

విం.ము—(ఆత్మగతమున)

తే. గీ॥ ఏమి! శుభసూచకంబొ? కాదేమొ? దుర్భ
రంబగు నలజడియగునొ? వ్రాతయెట్లు
లున్నదో కాని, యుత్సాహ ముద్భవిల్లి
పొంగిపొరలెడు తరఁగల్ల పోల్కనెదను

(దౌ. ప్రవేశించి) అమ్మా! లోనికి. (దారిచూపును. కళింగుఁడెదురేగుదెంచి) సోదరీ! నీసందేశము మాకు జాలికలిగించినది. నీయిష్టము వచ్చినన్ని దినములు మాగృహమున నుండవచ్చును.

విం.ము—సోదరా! నీహృదయము పవిత్రవంతమైనది. నన్నింకను బోల్చుకొనలేదా?

క—(స్మృతినభినయించి) ఔనౌను! ఎఱింగితిని. నాఁడు వనమధ్యంబున, పురేంద్రసేనుని యాతని పరివారమును పంకులసమరం బొనర్చి

గీటడంచువేళ, నీవకా యరుదెంచి, ప్రమద్వరయానికి సురక్షితమని ధైర్యమొసంగితివి. సోదరీ! నీయుపకారము నేనెన్నటికిని మఱువను. చినిఁగిపోయిన యీదుస్తులు నీకుదగవు. చాలదినములనుండి భోజనము లేదట! పాపము! కరంబుడస్సి యున్నదానవు. రమ్ము. (దాతి చూపును నిష్క్రమింతురు)

షష్ఠ మరంగము

(ప్రదేశము. ఒకవసారా. ప్రవేశము. వింత. ముసలిది)

భోజనమైనది. సమయము మధ్యరాత్రము. నిద్రింతునా?— సౌఖ్యమనుభవింప నేఁబుట్టలేదు. ఏనాఁడాఘోరంతము జరిగినదో, యేనాఁడు మానవుఁడు రాక్షసుడాయెనో, యేవిషమ దినంబుననుండి నేఁటివఱక నిరంకుశముగ పాపమే విజృంభించుచున్నదో, యా దినమునుండి సుఖములన్నిఁటికి నొక్క నమస్కార మొనరించితిని. అదిగో! ఆగదిలో నెవ్వరో మాటాడుచున్నారు; వారి నాలించెదను.

(పరిక్రమించి, వినుట నభినయించును)

(నేపథ్యమున)

తమ్ముఁడా! నేఁడే యామెను మనము దీసికొనిరావలయును.

విం.ము—ఎవరిని చెపుమా?—ఔను! ప్రమద్వర నే? 'వినాశకాలే విపరీతబుద్ధిః'

(మఱల నేపథ్యమున)

పరిహారము సిద్ధముగనే యున్నది. మఱియొక యరగంటలో బయలుదేరుదము.

విం.ము—(పరిక్రమించి) సరియె. వీరియుద్దేశము బోధపడినది. ఆమెను

వీరు బలాత్కారముగా నిటకు దోకొనివచ్చినను, నేనిచ్చటనుండువంతదనుక, వీరామె నేమియుఁ జేయఁజాలరు. ఇదెనిశ్చయము. అదిగో! అది పాకశాల. ఎవరో భాషించుచున్నారు. ఆలించెదను. (పాకశాలను సమీపించును. వినుట నభినయించును)

(నేపథ్యమున)

ఒకఁడు—ఒరే! మాలీ! ఈ పందిచర్మ మెంతగట్టిదిరా? మఱచితిని. సాయంకాలము మసాలా తెప్పించితివా?

మఱియొకఁడు—ఒరే! వెంకా! అన్నియుసిద్ధముగానున్నవి. దానిగొంతుకలో నల్లగానున్నది. అదేమిరా?

వేఱొకఁడు—ఎవఁడో వెఱ్ఱివాఁడు వేఁటాడినాడురా? ఇదియొక కత్తిముక్కరా? (పైకివిసరును)

విం. ము—(ఆఖడ్గఖండమును గైకొని, పరిశీలించి చూచి) దీనియుపయోగము ముందు ముందుఁ దెలియఁగలదు. ఓఖడ్గఖండమా!

తే. గీ॥ వారినిధి మధ్యమందున వసవవాఁడు
కాలయాపమునకు సుఖతరమైన
పాఁటపాడును గాని, తాఁబడయనెంచి
రత్ననిధులకుఁ జేయునే యత్నములను?

(దానిని సంచిలో నిడికొని, యతుగులచప్పుడాలించి) ఎవరో వచ్చుచున్నట్లున్నది. పుళిందకళింగులు పురీందుని గృహమునకుఁ బ్రయాణమైనతరువాత యీసౌధమంతయును బరీక్షించి చూచెదను. ఎన్నెన్నివింతలు బయలుపడునో!

(నిష్క్రమించును)

శ్రీ

ప్రమద్వర

పంచమాంకము

ప్రథమరంగము

(ప్రదేశము. ఒకగది. ప్రవేశము, విజయసేనుఁడు విచారగ్రస్తుఁడై)

హా! సుసేనకుమారా!

చ॥ కలకలలాడు నీముఖముఁ గాంచెడుభాగ్యము నాకు లేదె? ము
ద్దులొలుకు నీసుధామధురతుల్యములైన ప్రమోదభాషణం
బులు జెవులార నే వినఁగఁబోలనె? నాపయిఁ గోపగించితో?
చెలిమిదలంపవా? తగునె? చిన్నతనంబును గూర్చఁ దమ్ముఁడా!

కటకటా! లోకము నన్ను హంతకునిగా నమ్మినది.

తే. గీ॥ కులగిరులను భుజములపై నిలువఁబెట్టి
భారమైనను మోసెద పాటుపడుచుఁ
గాని, తమ్ముని జంపిన కఠినహృదయుఁ
డీతఁడను నింద నేను సైరింపఁజాల!

సోదరా! సుసేనా! నాఘాటకేమి! విజయసేనున కన్నఁడును సౌఖ్యము లేదు. వాని విచారము లోకమున కానందకారణము, నీవు చిరంజీవివై యుందువేని శోకదినము ప్రమోదము.

తే. గీ॥ ఒకదినంబున ముల్తాను నికటభూమి
మీఁద హయములపై నెక్కి మేరమీరి
పోవునప్పుడు, ' విజయా! నభోంగణమున
కెట్టులే పోదమొకసారి యెఱుఁగుమిదియ '

అని దరహాసాంకుర విలసితాననుండవై పలికితివి. నీవిప్పుడు లోకమునమ్మినటుల పరలోకమున కఱిగినను, కటకటా!

తే. గీ॥ మొండివాఁడను; కఠినుఁడ; మూఢమతిని;
సోదరుని సంహరించిన క్షుద్రుఁడ నేఁడు
మేను మోచిన షాఁడ; నీతి రెఱింగి
తనువులోపలఁ బ్రాణాలు దాల్తునింక!

(అడుగులచప్పుడాలించి) ఆ వచ్చువారెవరు?

(నేపథ్యమున)

మిత్రమా! నేను హేమపాలుఁడను. నా యాగమనము నీకాశ్చర్య కారణమే యైనను, నీ శ్రేయమాగసి వచ్చుటవలన నీవు నన్నాలింతువను నమ్మకమున్నది.

వి. సే— సుసేనుని వృత్తాంత మాద్యంతము నానుండియెఱుంగఁ గొంతువేని, నేధన్యుఁడనయ్యెదను; దైవము నిన్నురక్షించును.

(నేపథ్యమున)

చాలసేపు మాటాడుటకు సమయము లేదు. నేను న్యాయాధికారిని గాను; నీస్నేహితుఁడను. నేనిటకు నాపనిమీఁద వచ్చుట లేదు. నీకత్యంత మిష్టమైనవారి సందేశమును గొనివచ్చితిని.

వి. సే— ఆర్యా! లోనికిరండు. (హేమపాలుఁడు ప్రవేశించును)
ఆ యాసనమధిష్టింపుఁడు. (హే. పా. కూర్చుండును)

హే. పా — సందేశహరులు కాలయాపనము సేయరాదు.

వి. సే — ప్రమద్వర పంపినవార్తయెట్టిది. ఆమెయైన నన్ను నిర్దోషిగా భావించునా?

హే. పా — (మిన్నకుండును. విజయసేనుని ముఖలక్షణమును బరీక్షించును)

వి. సే — ఏమి! హేమపాలా!

కం॥ సకలావస్థల నెవత్తెను
త్రికరణములు సాక్షిగాగ తెలియుదునో, యా
వికసితజలరుహాలోచన
యకలుష మతిగాఁదలంచునా నను? చెపుమా?

హే. పా — విజయసేనా!

ఆ. వె॥ వేయునేల? పలుకు వినుమొక్కటే చాలు
సరళమైనఁ, బరుషతరమయైన
నీదు శ్రేయమరసి నీరేజపత్రాక్షి
వ్రాసి యుత్తరంబు బంపె నిదిగో!

(జాబిచ్చును)

వి. సే — (అందుకొని ససంభ్రమముగా)

తే. గీ॥ జలకణంబుల కాశించు చాతకంబు
జలధరంబులఁ గాంచిన సంతసించు
కరణి; యామెను గనులారఁ గనకయున్న
నామె వ్రాలైనఁ గని మోద మందువాఁడ

(చదువును)

"విజయసేనా!

దైవము మనయెడ ననుకూలుఁడు గాడయ్యె. నీవిప్పుడు దారుణా

వస్థలో నున్నవాఁడవు. హేమపాలుని యుద్దేశానుక్రమముగా నీవాస రింపవలయును. అతఁడు నిన్ను సురక్షితస్థలమునకు దారిజూపును. సత్వరముగ బయలుదేఱి పొమ్ము. ఇది మదీయప్రార్థన. గ్రహింపుము;

ప్రమద్వర "

హా! ప్రమద్వరా! హా! ప్రమద్వరా! విజయసేనుఁడు దోషి యని నమ్మితివా? ముద్దుకుమారుని, సుసేనుని జంపినపాతకి యని నమ్మితివా నాగుణములు నీకుఁ గొత్తయా? అయ్యో! నేజీవించి యేమి ప్రయోజనము! —హా! హేమపాలా! ప్రమద్వరను జూచెదను. మిత్రుఁడనని నాగదిలో నడుగు బెట్టితివి. నాయభిమతమును దీర్పుము. నేనామెను దప్పక చూడవలయును.

హే. పా — విజయసేనా! అది వలనుపడదు! శాంతించుము. శాంతించుము!

వి. సే — శాంతమా!

ఆ. వె॥ గాలి ప్రోత్సహింప గంభీరనాదంబు
జేసి దిశల నెల్లఁ జెవుడుపఱచు
సాగరంబుఁ జేరి శాంతించు, శాంతించు
మనుచుఁ బల్కు నెడల నగునె ఫలము?

నేనామెను దప్పక చూడవలయును. నీ వీయుపకృతి సేయఁ జాలవా?

హే. పా — విజయసేనా! నీకు వెఱ్ఱియాయేమి? నీ శ్రేయమారసి, పురీంద్రసేనునకుఁ దెలియకుండ యిటకరుదెంచితిని. నీతో మాటలాడిన నెంతయో చేటుగలుగు. నిజానిజము లెఱుంగను; గాని యెల్లరు చెప్పుకొనునది యేమన, సుసేనుని వనీతలమున నీవ సంహరించితివట! హంతకునితో మంతనము కీడు! తెలిసినదా?

సే — హేమపాలా!

తే. గీ॥ జగమునందున సంతోష సరణులందు
సకియ ప్రణయజనిత సంతసంబు నిర్మ
లంబు, నిత్యంబు; సర్వ కాలంబులందుఁ
బెఱుఁగుఁగాని, విఱుగదు; భూవరకుమార!

కాని వాఙ్మనస్క్రియల నొక ర్తమనమ్ముకొని, యామె నే భావించు వానిం గని వేల్పులోర్వలేక, నిష్కారణముగ నామె మనోగతమున నభావముఁ గల్పించు నాఁ డాతనికీజగముతోడి దేమియు నుండఁబోదు.

తే. గీ॥ తన మనోకాంత నిశ్చలత్వమునుబూని
కాంచువేళల ప్రేమ సుఖతర మన్య
మైన మరణమే మధురము; గాన నేను
చక్షువులు మూయువాఁడను సత్వరముగ

హే. పా— (ఆత్మగతమున)

తే. గీ॥ మానసిక దుఃఖ మాననమండలమునఁ
గలుగ; నున్నతమైన వక్షస్థలంబు
పైని ముద్దుమోమును వాల్చి వసుధఁజూచు
వీనిచిత్తరువును వ్రాయు వానిపేరు
కలఁగు జెలఁగు స్థితులమధ్య నిలచుఁగాదె?

(ప్రకాశముగా) — విజయ సేనా!

తే. గీ॥ రమ్ము! దుస్తులు దాల్పుము; రయముననొక
మాటలేక నీ మెచ్చు ప్రమద్వర యుప
దేశమనుసరించి బయలుదేరుమిాఁ? యు
సురులునిల్పుఁ; లేనియెడల దురితమౌను!

వి. సే—ఏమీ! పాఱిపోవుటయా! హేమపాలా! పురీంద్రసేనునియాజ్ఞ నీవు వినలేదా? అదియెంత తీవ్రమైనది! తదీయాజ్ఞోల్లంఘనము సేయ మనస్సంగీకరింపకున్నది! అదియునుం గాక,

ఆ. వె॥ అర్ధరాత్రమందు నభిమానమును వీటి
బుచ్చి, కారణంబు పొరయకుండ
పాఱిపోయినయెడ బాలును సేనునిఁ
జంపినటుల నన్ను జగము దలఁచు

నేను పోవఁజాలను! హేమపాలా! తొందర పెట్టకుము.

హే. పా—అటులేని, ప్రమద్వర పలు కుద్ధరింపవా? ఆమె కట్లెఱింగింతునా?

వి. సే—ఆర్యా! అట్లు చెప్పవలదు.—అట్లు చెప్పవలదు.

హే. పా—విజయసేనా! నీయందు పురీంద్రసేనాదులకుఁగల యనుమానముల నిజానిజములతో నాకుఁబని యేమియును లేదు. ప్రమద్వర యుత్తరమువలన నీవీసౌధమును వీడ్కొలిపిన నామె సౌఖ్యవతిగానుండునని నాకుఁదోఁచెడిని. నిక్కువం బంతియు. నీయిప్పటి మనోగత మామె కెఱింగింతు నేని, యామెకు మతి భ్రమణము గలిగెడిని.—బహుశః మరణించునని తోఁచుచున్నది. ఇది నీకు సంతోషమా?

వి. సే—హా! హా! ఆమె మృతిఁ బొందుట నాకానందమా!

ఆ. వె॥ చూఱికత్తి నగ్నిఁ జుఱుచుఱుఁ గాల్పించి
బలము మెఱయ హృదయ భాగమందుఁ
జనఁగ లోఁతుగా ఖసక్కునఁ బొడిచిన
సంతసంబు గలుగఁ జాలునొక్కొ?

హే. పా—అటులేని, నీవీమందిరమును వీడ్కొల్పుము. ఒకవేళ నీవిచ్చట నే యుండువేని, సుసేనునిఁ జంపితివని నేరము స్థిరపడును. నిన్నురి తీయుదురు. నీదారుణ మరణము ప్రమద్వరను జంపివేయును. నీచ

ముగాఁ జచ్చుటకంటె, సన్మార్గమున మరణించుట సర్వజనజేగీయ మానము! హాతిహామ్మ! హాతిహామ్మ! అని ప్రమద్వర నాలోఁ బ్రతిధ్వనించుచున్నది. నీవాలించు చున్నావా?

వి. సే—(కరములుజోడించి, కన్నులుమూసి)

చ॥ కనులకుఁగానరాక మముఁగావఁగనున్న సురేంద్రులార! నా
మనము వచించు మీరరసి మన్నన సేయుఁడి పాపమేని, నా
యునికి కతంబునన్ చెడుగులొందును నా ప్రియకాంత, యాసుసే
నుని వధియించినాఁడనని నోటికి వచ్చినరీతి నన్ను దూ
షణలొనరింప నీజగము? చారులు నన్ జెగవేయనీ? పురీం
ద్రుని హృదయాంత రాళమును రోషభయంకరవహ్నిగా
ల్చినను; మదీయమానసముఁ జేరినతంబు వసింపనెంచు సా
ధ్విని ముదమొందఁజేయఁగడు వేగము పోయెద నాలకింపుడా

హేమపాలా! దారిచూపుము.

హే. పా—రమ్ము! బైట హాయంబాయత్తము. నా సేవకుల నిరువుర నీవెంట కొంతదూరము పంపెదను. దైవము నీకు మేలు గూర్చుగాక!

(నిష్క్రమింతురు)

ద్వితీయరంగము

(ప్రదేశము. ఒకచావడి. ప్రవేశము. సుమిత్రుడు)

పాపము! విజయసేనుని యవస్థ కడుంగడు విచారకరము. ఏకారణమునినో నిర్బంధమునుండి తప్పించుకొనియె. దురాత్ములు పులింద

కలింగులు ప్రమద్వరను బలాత్కారముగాఁ గొనిపోవుచుండ వారలనోడించి యామెను విడిపించెను. పురీంద్రుఁడు కుమారికను రక్షించినందుల కాతనికిఁ గృతజ్ఞతాపూర్వకములగు నాశీర్వచనములు చేసి, పుత్ర ఘాతకుఁడని నమ్మి దూషింపకుండినను, మరల కఠిన కారాగారమున నుంచుఁడని భటుల కాజ్ఞయిచ్చెను. హేమపాలుఁడు కపటాచరణ ధురీణునివలెఁ గన్పట్టుచున్నాఁడు. విజయసేనుఁడు దోషియగుట దండన తప్పించుకొనవెంచి పాఱిపోయినటులను, తనచారులిరువు రాతని వెంబడించినటులను, వారలనాతఁడు వధించినటులను పురీంద్రున కెఱింగించెను. ఇందు నిజమెంతకలదో? ఆతఁడు చెప్పినను, విజయుఁడు హంతకుఁడు గాఁడు. ఆస్తికరుణామతి, ధర్మప్రియుఁడు, సత్యనిరతుఁడు. మల్లోకమ్ము లేదు. అయినను, వానిపై నిందపడినది. ఇదికదా లోకధర్మము! నేను సుమిత్రుఁడ నేని, విజయునిఁ గాపాడితీరెదను! (ముందుచూచి) విజయసేనుని దర్శించి, కొన్ని సంగతులు ముచ్చటింప వలయును.

(నిష్క్రమించును)

తృతీయరంగము

ప్రదేశము. కారాగృహము.

(ప్రవేశము. విజయసేనుఁడు; పురీంద్రసేనుఁడు)

సే — కుమారా! నిక్కము వచింపుము. రోహిణీ ప్రమద్వరల వాక్యములు మృషలా! అరణ్యప్రదేశమున సుసేనుఁడు కరవాలము ఝళిపించుచు, నిన్నుఁ బరుషోక్తులనొప్పించి, కయ్యమునకుఁ గాలుద్రవ్వ

నట. నీవు కోపారుణితలోచనుండవై యెరపైఁ గరమిడితివట! క్రూర భుజంగమును దలఁపించు నీకరవాలమున వానిశిరము నఱకితివా?

వి. సే.—తండ్రీ! విజయుఁడు మీకు క్రొత్తవాఁడుకాడు. సుసేనుఁడు కానరామి మీ రెంతవిలపించుచున్నారో, యంతకెన్నియో రెట్లధికము నేను దుఃఖించుచున్నాను. హా! పాపకాలము! ఏ సుగుణవిలాసుని నోరారఁ 'తమ్ముఁడా!' యనిపిలతునో, యేమనోహరగాత్రుని శీతల పరిష్వంగ సుఖమున మితిలేని యానందము జేకూరెడినో, యే వీరావతారుఁడు పజ్జ నిలువ, ఘాతుక మృగతండములపై నేగుదెంచి నను సరవ సేయునో, యాసుసేనకుమారుని, యీ హస్తములు వధించుట! హా! విధీ! నీ వెంత కటికమతివి!

పు. సే.—(కన్నీరునించి) కుమారా! కాశ్మీరనాథుని పంపున న్యాయాధికారులు ఇచటకువచ్చెదరు. వారియభిమతానుగుణముగ వర్తింపవలయును. నిన్ను నేనెంతయో ప్రేమింతును!—కటకటా!—కుమారా! నేఁబోయెదను. బహుశః, ఇదియే కడసారిచూపు!—హా! సుసేనా! హా! సుసేనా! నీవు నాకుఁ గానరావా? మదీయ వంశాబ్ధిచంద్రా! సద్గుణసాంద్రా! భోగదేవేంద్రా! హా! హా!

(నిష్క్రమించును)

వి. సే.—అదిగో! సుమిత్రుఁడు వచ్చుచున్నాడు. ఆతఁడు మిత్రాఖ్యనాసార్థకగఱచువాఁడు. ఆతఁ డేమిచెప్పునో?

(తెర పడును)

శ్రీ

ప్రమద్వర

షష్ఠాంకము

ప్రథమరంగము

(ప్రదేశము. ఒకచావడి—ప్రవేశము సుమిత్రుఁడు)

ఎన్నిసారులడిగినను, సుసేనుఁడు సజీవుఁడనియే చెప్పెను; గాని యాతనిమరణమును సూచింపుడు. విజయునిఁ గాపాడునుపాయమేమి? ధర్మముజయించును; సత్యముస్థిరము; అనుమాటయందు నర్థములేదా? కాలము నిష్పక్షపాత బుద్ధిగల మిత్రము. ముందుముందన్నియు బయలుపడును.—వజ్రపాణి నాలుగుదినములనుండి జ్వరపీడితుఁడు. ఆతఁడిప్పుడు శల్యమాత్రుఁడు. దయ్యములను జూచునటుల భయపడును. ఆతఁనియవస్థ పగవానికైన వలదు. నేఁడు నన్నాతఁడు చేరంబిలచి, "సుమిత్రా! నేనుచాలదినములు జీవింపను; నాకు మృత్యువు సమీపవర్తిని! నీవు సత్వరముగఁ బోయి నామేలికయగు హేమపాలునిఁ బిలచికొనిరమ్ము." అనివాక్రుచ్చెను. హేమపాలునకు కాతని సందేశమెఱింగించితిని. ఆతఁడిప్పుడే రాఁగలఁడు. వీరిరువురి సంభాషణము నేనాలింపవలయును. (ముందుచూచి) అదిగో! గదితలపుచేర వేయఁబడియున్నది. మెల్లన పోయి వజ్రిపాణి మంచముక్రింద దాగుకొనియెదను. పిమ్మట కర్తవ్యమూహింపనగును. —దైవమా! భారము నీయది!

(లోనికరుగును)

ద్వితీయరంగము

(పల్లెదేశము. పడకగది. ప్రవేశము. రోగపీడితుఁడు వజ్రపాణిమంచము మీఁద పొరలుచు; హేమపాలుఁడు ప్రక్కనుగల కుర్చీమీఁద కూర్చుండియుండును)

హే. పా. — వజ్రా! నిన్నుఁ జూచిన విచారము గలిగెడిని.

అ. వె॥ కనులు లోఁతుకేగెఁ గాంతిదొలఁగె మేను
గాత్రమెల్లశల్యమాత్రమయ్యె
బొందిలోని ప్రాణి పోయెనో యున్నదో
చెప్పఁజాల; ధాత చెయిదమకట

(వణకుచు) వజ్రా! నీ దేహస్థితి యెట్లున్నది? నీవు నన్ను రప్పింపఁ గారణమేమి?

వ. పా— హేమపాలా! తలుపుదగ్గర వేసితివా? నీవొక్కఁడవే యున్నావు కదా?

హే. పా— అవును. తలుపు వేసితిని; భయము లేదు చెప్పుము.

వ. పా— (ఉస్సురనుచు) మన మొనరించిన దారుణకృత్యముల నెఱుంగ నేరికి నింతదనుక వలనుపడినది కాదు. ఇప్పుడు దుర్జ్ఞేయములగు నుపద్రవములు మనలఁ జుట్టుముట్టినవి! (నిశ్వాసపూర్వకముగా) అబ్బా!—

హే. పా— (భయముతో వణఁకుచు) ఉపద్రవములా! ఉపద్రవములా! దుర్జ్ఞేయములా! వజ్రా! తీవ్రములగు బాణములు నా హృదయము గుండ పోవుచున్నవి. నే నోర్వఁజాలను— దుర్జ్ఞేయములా! వజ్రా! కన్నులు మూసెదవేమి? బాష్పములు గార్చెదవేల? చెప్పుము! చెప్పుము!

వ. పా— చెప్పెదను.— తాళుము!— విజయసేననుగూర్చి చెప్పెదను.

హే.పా—ఏమీ! దురాత్ముఁడు విజయునిఁగూర్చియా? వాఁడు మనల నేమి సేయఁగలఁడు?

వ.పా—నిన్నరాత్రి నేను చల్లగాలి నాఘ్రాణింప మేడక్రిందకుఁ బోయి రాజమార్గమున నిటునటు ప్రచారము సేయుచుంటిని. అప్పుడొక పురుషుఁడు ముఖము నుత్తరీయమునఁ గప్పుకొని, నన్ను సమీపించి, 'వజ్రా!' యనిపిలచెను. నేను వానిని చాలసేపు నిదానించి చూచి, "దుర్జయా! ఇంతరాత్రివేళ నిటకేలవచ్చితివి?" యనియడిగితిని. ఆతఁడు పులిందుని సేవకుఁడు; మఱియు నాకు బంధువుఁడు. వాఁడు నన్నుఁ దన యేలిక సౌధమునకుఁ దోకొనిపోయెను. పారావతమను పేరుగల భూగృహమొండా మేడయందుఁ గలదు. దానం బ్రవేశించిన యనంతరంబ, యొక కారాగృహమునకు దారిచూపెను.—హేమపాలా! ఎవ్వరును లేరుకదా? ఎవరైనవిన్న మనకొంప మునుఁగునుసుమా?— అందుఁ బ్రవేశించి, విచారభరంబున కన్నీటఁదోఁగి యున్నబాలుని నాకుఁ జూపి, "వజ్రా! చూచితివా? సుసేనుఁడు మరణించినటుల లోకము నమ్మినది. నిక్కువంబిట్టులున్నది. పులిందుఁడీతనిని చెరయందుంచినాఁడు. నీవు హేమపాలునితో, మా యేలిక మాటగా నిట్లనుము. ప్రమద్వరను పులిందుఁడు బరిణయంబాడ నిశ్చయించెను. కావున నీవు పురంద్రినితోఁ జెప్పి యీసంబంధము బలపఱుపవలయును. అట్లొనరింతు వేని, ప్రమద్వర నాగృహమునఁ గాలుపెట్టిన నాఁడే సుసేనుని వధింతును; లేనినాఁడు సుసేనుఁడు జీవించియున్నవార్త ప్రకటించి, నిన్నుదుఃఖపెట్టెదను. నీజవాబు రేపటిరాత్రి నాకుఁ జేరవలయును. ఇవి పులిందుని పలుకులు. వజ్రా! మీఁద నీయిష్టము." అని చెప్పినాఁడు.

హే.పా—(భయముతో) వజ్రా! నీవుజ్వరబాధితుఁడవై యిట్లుపలుకుచున్నావా? ఇదినిక్కువంబు కానేరదు. ప్రమద్వరను క్రూరులకా

యప్పగించుట? ఇది నేను చేయఁజాలను.

వ.పా — హేమపాలా? పలుమాటలేల? నేఁటిరాత్రి దుర్గముఁ డిటకు వచ్చును. నీవొకలేఖ వ్రాసి యాతనికొసంగవలయును.

హే.పా — ఏమని వ్రాయ వలయును?

వ.పా — వ్రాయుము. చెప్పెదను. (లేఖవ్రాయును. వ.పా చెప్పును)

“ శ్రీ వనరాజు పులిందమహాశయునకు:—

నీసందేశము నాకానందమిచ్చినది. ప్రమద్వరను నీకొసంగి పరిణయము గావింతును. సుసేనుని కారాగృహముననే వధింపుము. అతఁడు జీవించునంతదనుక ప్రమద్వర నీగృహ మలంకరించుట కష్టసాధ్యము. తమ్ముఁడు కళింగునకు నాయభివాదములు.

హేమపాలుఁడు.”

హే.పా — ఈలేఖాంశము లాచరణీయములా?

వ.పా — వెఱ్ఱివాఁడా! భుజంగజాల్ముఁడు మస్తకమునఁగల మణినుపయోగించుకొనునా? ఈగండము గడచినతరువాత ప్రమద్వరను మరల తీసికొనివచ్చెదము. భయములేదు. నాకుబాధయధికమగుచున్నది. నేనుమరిబ్రతుక నేమో? నాయొనర్చిన పాతకములు దలంపున వారు నపుడు నాకత్యంతము భయమగుచున్నది. అదిగో! సత్యపాలుఁడు! అదిగో! అతనిప్రియసుమిత్ర! అబ్బా! నేను వారలను జూడఁజాలను! హేమపాలా! పొమ్ము! పొమ్ము!

(హే.పా పరుగెత్తి యావలికరుగును. వ.పా ఒడలంతయుఁ బట్టల గప్పుకొనును) (తెరజారును)

ప్రమద్వర

తృతీయరంగము

ప్రదేశము. పుళిందుని సౌధమున నొకభూగృహము.

(ప్రవేశము వింతముగ:లిది)

ప్రమద్వర హరణార్థమై పోయిన పుళిందకళింగులింకను రాలేదు బహుశః వారింతలోరారు.

తే: గీ॥ మాంసము; ఘృతము; ఫలము లమలమధురస
ము; పలువిధములగు మిఠాయిలు; పెఱుగును, పి
తికినపాలు; శాల్యన్నము దినెడువీరి
కొడలిబలముగాని, కలదె యొండుబలము?

ఆహా! ఏమి! యీగృహనిర్మాణ కౌశలము! ఆసారంగముల లోఁతు, ప్రచారమున కనుకూలములగు ఆగుహాలు, వసారాలు, ముద్దులుమూటఁ గట్టు ఆగోపురములు—ఎంతచూచినను తనివి తీరకున్నయది!—

తే. గీ॥ వికసితజలజాతమున స్రవించుమధువుఁ
గ్రోలఁబోయి మధుపము తత్కుసుమలీలఁ
గాంచి యానందమొందినఁ గలదెఫలము
తెలిసి సమయమ్ము, తగురీతి మెలఁగవలయు!

(చూడ్కిసారించి) అదిగో! సుజయుఁడు కునికిపాట్లు పడు చున్నాడు. వానినిసమీపించెదను. (వానిదగ్గరకఱుగును.)

సుజ—(భయాకలితుఁడై) నీవెవరు?—ఓహో! నీవా! అవ్వా! ఇక్కడ కేలవచ్చితివి!

విం.ము—సుజయా! ఇంతరాత్రివేళ నీవిచ్చటను రాఁ గారణము?

సుజ— నేనీభూగృహమునఁగల కారాగారములకధికారిని. పుళింద మహారాజుగారి యాజ్ఞ శిరోగతమునఁ దాల్చి యిచ్చట పహరా యున్నవాఁడ— అయ్యా! సుఖశయ్యాతలమున నుండవలసినదానవు, ఇప్పుడీ నిశ్శబ్దగృహమున భయంబులేక యొంటరివై తిరుఁగ నేల?

(నేపథ్యమున)

హా! దైవమా!

విం.ము— (ఆలించి) ఏమీ! నిరుత్తరయా!

తే. గీ॥ ఇదిగో! కారాగృహంబున హృదయపుటము
భేదమొందఁగ; కన్నులవృష్టిఁగురియ
దీర్ఘనిశ్శ్వాస పవనముల్ తెరపిలేక
వెడల; గటికసెయ్యను శిరమిడినవాఁడు
వానిఁ గనుఁగొన్న నిద్దుర వచ్చునొక్కొ

(నేపథ్యమున)

సీ॥ జయభక్తమందార! జయసజ్జనోద్ధార!
జయదయాసాగరా! జయతు! జయతు!
జయనిర్మలాకార! జయమంగళాచార!
జయజగత్కారణా! జయతు! జయతు!
జయలోకరక్షకా! జయవిశ్వభంజనా
జయసంతసాత్మకా! జయతు! జయతు!
జయసర్వలోక సంచార! జయపరమ!
జయగుణాకర! ప్రభూ! జయతు జయతు!

తే. గీ॥ కఠినకర్ముఁడ, యీకష్టకాలమందు

నీదయావాహిని పాపనిబిడమైన
హృదయవనమునఁ జొరలేక యెట్టులోప
థముఁగలుగఁ జేసికొనెను; సత్పథవిహార

సుజ—అవ్వా! నీవిటుపడయరాదు. తారిమోపెదను పైకిరమ్ము.

విం.ము—ఛీ! మూర్ఖా! నాకొసఁగవు బుద్ధిగలవాఁడవు. జవాబుచెప్పక కారాగృహ తాళము చెవులను నాకొసంగుము.

సుజ—సాహసము! సాహసము! నేనట్లు సేయఁజాలను!

విం.ము—సుజయా! నీవు శుంఠవుతివి. కేసరితోడనా యాటలాడుట? నన్నెదిరించి యెవ్వరు సుఖించిరి! భూతభవిష్యద్వర్తమానకాలముల నెఱుంగఁ జాలు నన్నా నెదురించుట? ప్రాణములు చేఁదయ్యెనే? మరణదేవత నాశగణుఁగోరితివి! రోదింపుము! రోదింపుము!

సుజ—నా భావిస్థితి యెట్లుండుఁ జెప్పఁగలవా? విన వేడుకయ్యెడు.

విం.ము—నామాట జవదాటవేని, చిరంజీవివై, తులలేని సంపదలువడసి, సౌఖ్యాంబుధిఁ దేలియాడుదువు. మఱియొండైన, వారముదినములలో మరణింతువు. ఇదినిశ్చయము.

సుజ—నిజమా! నిజమా!—నీకాతాళము చెవులనిచ్చిన, పుళిందుఁడు నన్ను బ్రతుకనిచ్చునా?

ం.ము—నేను నిన్నుఁ గాపాడెదను. భయములేదు.

జ—(వణఁకుచు తాళము చెవులనిచ్చును)

ం.ము—సుజయా! నీకేమియును భయములేదు. రమ్ము. ఆచెరసాలను సమీపింతము.

(నిష్క్రమింతురు)

తృతీయరంగము

(ప్రదేశము. ఒకచావడి. ప్రవేశము. సుమంతుఁడు. సుమిత్రుఁడు)

సుమం—ఆహా! దైవమాయ! నిర్దోషి నిందపాలయ్యెను. ఆతఁడు రక్షింపఁబడుఁగాక!

సుమి—ఇప్పుడేమిసేయవలయును? నీవేమందువు. ఏండ్లుగడచినవాఁడవు, నీయనుభవము సుప్రసిద్ధము.

సుమం—పురీంద్రసేనుఁ డెప్పుడువచ్చును?

సుమి—బహుశః రాత్రివచ్చునేమో? న్యాయాధికారులు రాత్రివచ్చెద రట. ప్రమద్వరను, తప్పుఁగల స్త్రీజన్మంబును రాజమార్గమునను దోడుకొనిపోయిన పురీంద్రుఁడేపుడు వచ్చునను నమ్మకము బలమైనదికాదు.—

సుమం—అట్లయిన, పురీంద్రునితోఁ గలియుటకు వీలులేదు. ఒకవేళ యాతనికీవృత్తాంతము జెప్పినను, నమ్మఁడు. సుమిత్రా! నీవువచించినది సూనృతమైనను పాడులోకము పరిహసించును!

సుమి—అవును. నీకుఁదోఁచిన యాలోచన మెట్టిది? ఎట్లయినను విజయునిఁ గాపాడవలయును. ఆలేఖను పదిలముగాఁ బట్టురుమాలునఁ గట్టి దుర్గమున కొసంగను. అబ్బా! హేముఁడెంతకుఁ దగఁడు!

సుమం—సుమిత్రా! వినుము. నేనుజీవయాత్ర ముగింపనున్నాను; నీవు ప్రారంభించితివి. ఇత్తరుణమున మన మప్రమత్తులమై సుగుణాలవాలుఁడగు విజయసేనునిఁ గాపాడితిమేని మనజీవితములు పావనము లగును. మనకీర్తిని లోకమెల్ల పాడుచుండ నీవాలింతువు. ఇదియ మనకు బహుమానము!

సుమి—విజయరక్షణార్థమై సింహబిలమునైనఁ జొచ్చెదను! నీకేదియో

తరుణోపాయము దోఁచినటుల నేననుకొను చున్నాను.

కుమం—(తలయూఁచి) సుమిత్రా! సింహద్వారము దరి నాకొఱకు వేచి యుండుము.

(చెఱియొకవైపు నిష్క్రమింతురు)

పంచమరంగము

ప్రదేశము. పుళిందుని సౌధమునం దొక విశాలాగారము.

(ప్రవేశము. పుళిందకళింగులు)

పు—తమ్ముఁడా! దుర్జయుఁ డింకను రాఁడేమి?

తే. గీ॥ హేమపాలుఁడు గర్వించి హేళనంబు
చేసెనో! ప్రమద్వర యడ్డుచెప్పెనో? పు
రీంద్రుఁడొప్పఁడో! పటురోషసాంద్రుఁడగుచు
వచ్చును పుళిందుఁడని మదభీతి లేదొ?

క—అన్నయ్యా!

తే. గీ॥ భయదనిర్ఘాతపాతంబు వడపున మన
మేగమే ప్రమద్వరను బంధించితేర
దుష్టుఁడు విజయసేనుఁడు దోర్బలంబు
మెరయ విడిపించె నామెను తెరఁగుమాలి

ఛీ! విజయుఁడా మనల నెదురించువాఁడు!

తే. గీ॥ చండకేసరి యడవిలో సంచరించి
జాగిలమరువఁ బరుగెత్తు చరదమయ్యె,

విజయుఁబరిమార్చి, సకియను బెండ్లిసేతు
నీకు శాంతించు; సోదరా! నిశ్చయంబు

అన్నా! భయమేమిటికి? హేమపాలుఁ డంగీకరింపక ప్రాణములపై నాశఁగొని యుండఁ గలఁడా! దుర్జయుఁడు శుభవార్తఁ దెచ్చును.—

(దుర్జయుఁడు ప్రవేశించి)

తే. గీ॥ జయము వనరాజ! సద్గుణ సాంద్ర జయము!
జయము సార్వభౌమ! పరగజహరి జయము!
జయము కకుబంతరాళ ప్రశస్తకీర్తి!
జయము! జయము పుళింద! విశాలహృదయ!

(పట్టురుమాలులోని యుత్తరమిచ్చును)

(పుళిందుఁడందికొని చదివి కళింగున కొసఁగును)

క——(చదివికొని, బల్లపైనుంచి) శెబాస్! అన్నయ్యా! హేమపాలుని నల్లగుండియ పగిలియుండును గాబోలును!

దు——దేవా! విజయసేనుఁడు మఱి యీలోకము వాఁడు కాఁడు. నేఁడే న్యాయాధికారులు వచ్చెదరు. రేపు మధ్యాహ్నము మూఁడుగంటలకు విచారణ మారంభింతురట.

పు——సరియె. దుర్జయా! నీ మేలు మఱువము.

(దుర్జయుఁడు నిష్క్రమించును)

సేవకుఁడు——(ప్రవేశించి) జయము! పుళిందరాజా! జయము! ద్వారము దరి గాయకు లిరువురు వేచియున్నారు. ముదలయయ్యెనేని, తోడ్తెచ్చెదను.

పు——(కళింగునితో)

తమ్ముఁడా!

ఆ. వె॥ నేఁడుశుభదినంబు; నింపు
ర్వధరణీధరంబు పైనివా
గాయకులనుబిల్చి గానం
సమయ సముచితంబు వి:

క — అన్నా! నీయిష్టమున కడ్డుగలదె?

తే. గీ॥ బాణవేగమున సతము బారునేఱు
న కొకతఱిబలమైన బంధంబుఁగలు
వచ్చుఁగాని, నీయభిలాష పారివా
డాక నడచు నిరంకుశత్వంబుఁ బు
గాయకులను రప్పింపుము. వినోదము గాఁ

పు — (సేవకునితో) ఓరీ! వారల నిటకుఁ బిలువు

(సేవకుఁడు నిష్క్రమించును. సుమంత సు
ములతోఁ బ్రవేశింతురు)

(పులిందు నుద్దేశించి)

సు॥ సుమి — కం॥ ధీరుఁడవు; సకలగుణ వి
స్తారుఁడవు; విమలయశో వి
కారుఁడవు; శుభచరిత్రా
ధారుఁడవు; నిన్నుఁబొగడఁ

సుమం — రాజాధిరాజా! వనరాజా! పులిందా! దేశవ
నిర్వక్ర పరాక్రమ క్రమణ ధురీణుఁడవగు నీదర
నిండారు భక్తితోడ వచ్చితిని. ఇదిగో! వీఁ
నాతోడ సతంబుఁ దిరుఁగుచుండును. కరుణించి
చి నీకర్ణేంద్రియములకుఁ బండువు సేయుంచున

పు.— ఓయీ! నీ పేరేమి?

సుమం.— రాజేంద్రా! నా పేరు విశాఖుఁడందురు. నా మనుమని పేరు శ్రావణుఁడు.

క.— నేఁ డేఁగినవారు కరం బానందంబున నున్నారు. వీరు శ్రావ్యతరముగఁ బాడుదురేని, బహుమానమం దెదరు.

సుమం.— చిత్తము! (గవిసెన వెడలించి, వీణ కరంబునఁ గొని గానము సేయును. సుమిత్రుఁడు కూడ పాడును.)

పు.— హాయి! హాయి! వీరు మానవమాత్రులా! గంధర్వులు!

క.— నిజము! నిజము! ఆహా! ఏమి శ్రావ్యము గానున్నది!

సుమంత్రసుమి— (పాడుచు నే యుందురు)

(పుళిందుఁడు, కళింగుఁడు కొంతవడికి కుర్చీలమీఁదనే నిదురింతురు. సుమంతుఁడు బల్లపైని పట్టురుమాలులోని లేఖను దీసికొమ్మని సుమిత్రునకు సాజ్ఞచేయును. సుమిత్రుఁడు తీసికొని జేబులోఁ బెట్టుకొనును. పాఁటపాడుచు నిరువురు నిష్క్రమింతురు.)

(తెరపడును)

శ్రీ

ప్రమద్వర

సప్తమాంకము

ప్రథమరంగము

(ప్రదేశము. విశాలమగు చావడి. ప్రవేశము. న్యాయాధికారి యాసనాసీనుఁడై లేఖకోద్యోగి న్యాయాధికారిసమీపమునఁ గూర్చుండును. పురీంద్రసేన హేమపాలురొకవైపుఁ గూర్చుండుదురు. విజయసేనుఁడు మరియొకవైపు నిలువంబడి యుండును. ప్రతీహారి వనపాలురిరువురు నిలువఁబడియుందురు.)

న్యా:— సభ్యులారా! నేఁడు మనమందఱ మిచ్చోట సమావేశమగుటకుఁ గారణ మెఱుంగుదురుగదా? వీఁడుగో, మనసమక్షమున నిలువంబడిన పురుషసింహము విజయసేనుఁడు. వీని ప్రస్తుతావస్థఁ దిలకింప, నిర్దోషివలెఁ జూపట్టుచున్నాఁడు. (హేమపాలుఁ డిటునటుఁ జూచును.) ఈతఁడు చిఱుతప్రాయమున పురీంద్రుని గృహమున విడువఁబడియెను. వీని తలిదండ్రులెవ్వరో యింతదనుక తెలియదయ్యె. పురీంద్రసేనుఁడు సహజకరుణామతియగుట నీతనిని తనబిడ్డలతో సమముగాఁ జూచుచుండెను. దైవోపహతుఁ డగు పురీంద్రసేనుఁడు ముల్తానుదేశాధీశుని కోపమునకుఁ గారణభూతమగుట మీరెల్ల రెఱింగిన విషయము. హేమపాలుఁడు స్నేహధర్మము దెలిసినవాఁడగుట

పురీంద్రసేనునకుఁ దనగృహమొసంగి, కష్టకాలమున సత్కరించెను. పురీంద్రసేనుఁడు శ్రీనగరమున కరుదెంచిన పదునైదుదినముల తరువాత విజయసేనుఁడు ప్రమద్వరను ప్రేమించినటు లెఱింగెను. సుసేనున కానాఁటఁగోలె విజయునియం దసూయజనించెను. తెలిసినవాఁడగుట పురీంద్రసేనుఁడు విజయునితోఁ దఱచుమాటలాడక, సహపంక్తి భుజియింపక, ప్రమద్వర సమక్షమునకుఁ బోనీయక, యొకవిధంబగు నిర్బంధమునను౦చెను. సుసేనుఁడును విజయునితో నంతగా మాటాడలేదు. హేమపాలుఁడు ముల్తానునగరమునుండి వచ్చినతరువాత విజయుని ప్రార్థనము గ్రహించి కరంబు నొచ్చుకొనియె. పురీంద్రసేనుఁడు హేమపాలునకుఁ గూతునీయ సమకట్టి యామెయంగీకారము వడయనిది యట్లుగావింప నేరఁడయ్యె; గాని ప్రమద్వర తనమనోరథమిట్టిదని చెప్పక దినములు బుచ్చుచుండెను. సుసేనుఁడు సమ్మతింపఁ పురీంద్రసేనుఁడు హేమపాలునకుఁ దనయ నొసంగ సన్నద్ధుఁడయ్యె.

చుట్టుప్రక్కలఁగల దుర్గాధిపతులను వివాహమునకాహ్వానమొనరించెను; గాని దుర్మార్గులగుటవలన పుళిందకళింగులను వనరాజులను మాత్రము కళ్యాణమహోత్సవమునకుఁ బిలువఁడయ్యె. ఆ సోదరద్వయము పురీంద్రసేనుఁడు చూపిన యగౌరవమున కత్యంతాగ్రహమొంది బలాత్కారమునఁ బ్రమద్వరను దొంగలించుకొని పాఱిపోయిరి. రోహిణియను చెలికత్తె యేడ్చుచుఁ బరతెంచి యివ్వార్తలోన నెఱింగించెను. పురీంద్రసేనుఁడు, హేమపాలుఁడు ముందు హయంబుఁ బరగెత్తింప, సుసేనాయుతుఁడై, పుళిందకళింగుల వెంబడించెను; గాని విజయసేనుఁడు భయంకరఖడ్గమును ఝళిపించుచుఁ బోయి ప్రమద్వరను దుష్టులబారినుండి తప్పించి, గృహంబుఁ జేర్చెను. పురీంద్ర హేమపాలురకు గాయములవెండ గాయములు తగిలెను. తత్కారణమున వివాహము తప్పిపోయెను. సభ్యులారా! తరువాత జరిగిన విష

యామును జాగ్రత్తతో గమనింపుడు. నెలదినములవఱకును విజయసేనుఁడు ప్రమద్వరను జూడలేదు; తరువాత నొకనాఁడు వారేకారణమున్నో వనప్రదేశమునఁ గలిసికొనిరి. రోహిణికూడ వెంటనుండెను. అప్పుడు సుసేనకుమారుఁడు వారలను దూరమునఁ గాంచి, హాహారావములు సేయుచు, సమీపించెను. ప్రమద్వరను కఠినోక్తుల నొప్పించెను రోహిణిని తిట్లు పెట్టెను. ములికిపలుకుల విజయసేనుని బాధించెను ప్రమద్వర రోహిణీ ద్వితీయయై సోదరానుమతిని గృహంబునకుఁ బోవుచుండెను; మేఘగంభీర భాషణముల సుసేనుఁడు విజయసేనుని దూలనాడుచుండెను. రోహిణీప్రమద్వరలు వెనుదిరిగి చూచిరి. సుసేనుఁడు మిలమిల మెఱయు ఖడ్గమును బలము వెలయ గరగరఁ ద్రిప్పుచుండెను. విజయుఁడు క్రోధకషాయిత లోచనుఁడై యొరమీద కరమిడెను; కరవాలమును మాత్ర మూడబెఱుకలేదు. ఆబాలిక లెఱిఁగిన దింతియ. తదితర విషయములు సాక్షివిచారణము వలన సభ్యులు గ్రహింతురు. (ప్రతీహారినిఁ జూచి) ఓసీ! నీ వెఱింగినదేమి? దాచక చెప్పుము.

పతీ — న్యాయాధిపా! నిక్కము వచింతు. దైవము సాక్షి! విజయసేనుఁడరణ్యమునుండి వికలమనస్కుఁడై వచ్చెను. అతని వస్త్రములు రక్తమయములై యుండెను. చేతఁ గృపాణము లేదు. ఒరమాత్రము ప్రక్కను వ్రేలాడుచుండెను. "బాబూ! ఈ రక్తమేమి?" యని నేనడిగితిని. ఆతఁ డుత్తరమీయలేదు. లోనికరిగెను. నాయెఱిఁగిన దింతియ. (లేఖకోద్యోగి వ్రాయును)

న్యా — నీవు పొమ్ము. వనపాలకులారా! మీకుఁ దెలిసిన దేమి?

వ.పా — న్యాయాధిపా! అనృతమాడను. దైవము సాక్షి! నేను వనమునఁ గుర్రుమ్మరుచు రక్తభరితంబైన మడుగు నొండు గాంచి, భయంబుతో నటకు పోయితిని. మనుష్యసంచార మచ్చటతోఁచలేదు; కాని తడిప్రదేశ మగుటవలన మనుష్యుల యడుగుల చిహ్నములు స్పష్టముగాఁ గాన-

వచ్చుచుండెను. ఆమడుగులో ఖడ్గఖండ మొండు గోచరమయ్యెను; దానిం గొనితెచ్చి పురీంద్రసేనున కర్పించితిని. (లేఖకోద్యోగి వ్రాయును)

2. వ.పా — దేవా! సత్యముపలికెదను, దైవముసాక్షి! చేపలుపట్టుటకై నా కుమారునితో వనోత్తర భాగమునఁగల నదికేగితిని. అందువల వేయుటయు నొకశిరోవేష్టము దొఱికెను. దానిని పురీంద్రసేనున కొసంగితిని. (లేఖకోద్యోగి వ్రాయును)

న్యా — సరియె. మీరుపోవచ్చును. (హేమపాలునివంక దిరిగి) హేమపాలా! నీవెఱింగిన యంత మూలాగ్రముగ నాకుఁ దెలియఁ జెప్పుము.

హే.పా — (నిలంబడి) న్యాయాధిపా! దైవముసాక్షిగా సూనృతము పల్కెదను. అవధరింపుడు. పురీంద్రసేనుఁడు విజయుని నిర్బంధనమున నుంచెను. వాఁడెట్టులో తప్పించుకొనిపాఱిపోయెను; నా సేవకుఁడు వజ్రపాణి యాదురంతమును గనిపెట్టి యిరువురు సేవకులను వానింబట్టి తేరఁబుత్తెంచెను. విజయుఁడు వారలను సంహరించి, విమలాంగియగు ప్రమద్వరను పుళిందకళింగులు హరించి, పాఱిపోవుచుండఁ గాంచి, వారల నెదుర్కొనియెను. కొంతవడికి వారలనోర్చి, ప్రమద్వరను గృహంబుజేర్చెను. పిమ్మట వజ్రపాణినిఁ బిలచి, "ఓయీ! నీయేలిక హేమపాలుఁడు సమీపవర్తియే నా? అతనిని బిలువుము" అనివార్తఁబంపెను. నేను కడుంగడు భయంబున వానిని దరిసితిని. కన్నీరు మున్నీరుఁ గార్చుచు, నాతో నాతఁ డిట్లనియె. "ఆర్యా! నేను పాపకర్ముఁడను. కోపమువశులోనై పాపమనిజంకక సునేనుని వనీతలమున సంహరించితిని. నీసేవకుల నిరువురను బరిమార్చితిని. హంతకుఁడనగు నాకు శాంతియెక్కడిది?" అనిపల్కెను. వానియవస్థకుఁ జేయునదిలేక యూరకుంటిని. (వి.సే ఆశ్చర్యమభినయించును

(లేఖకోద్యోగి వ్రాయును)

న్యా—వజ్రపాణిని రప్పింపుఁడు. (సేవకులు వ.పా తీసికొనివత్తురు ఆతఁడు వణఁకుచు నిలువఁబడును)

న్యా—వజ్రపాణీ! నీకీయభియోగమునఁ దెలియు విషయములేమేనిఁ గలవా? భయములేదు. మెల్లనఁ జెప్పుము.

వ.పా—నాకుఁ దెలిసిన విషయములెన్నియో లేవు. విజయుఁడు కారాగారమునుండి తప్పించుకొనియె; అదియెఱింగి హేమపాలుని సేవకుల నిరువుర నాతనింబట్టి తేరఁబంపితిని. వారల నాతఁడు సంహరించెను. ప్రమద్వరతో గృహమున కరుదెంచెను. నన్నుఁ జేరంజీరి, "ఓయీ! నీయేలిక హేమపాలుఁడు సమీపవర్తియే నాకీ ఆతనిని బిలువుము" అనిపల్కెను. నేనట్లు గావించితిని. (వణఁకుచుఁ గ్రిందపతికిల పడును) [లేఖకోద్యోగి వ్రాయును]

న్యా—సభ్యులారా! సాక్షివిచారణ మైనది. పైవిషయములు చర్చించి చూడ, విజయసేనుఁడు కేవలము నిర్దోషియనుటకు వలనుపడదు. అయినను, ఆతఁడేమనునో, విచారింపవలయును. (విజయసేనునివైపు మోమై) విజయసేనా! వీరందఱుఁ జెప్పినది నీవాలించితివికదా? ఇందసత్యమేమైనఁగలదే?

వి.సే—న్యాయాధిపా! సత్యమొక్కటి; అనృతము వేయి విధములు. లోకమసత్యము నే గౌరవించుఁగాక! అసత్యవాదులే విజృంభింతురుగాక; సత్యమేకడకు జయించును. సూనృత మపజయమొందునేని, చుక్కలురాలవే? కొండలుకూలవే? అంబుధులింకవే? ఎన్నెన్నియుత్పాతములు జూపట్టవు?—(కొంచెమాగి) పురీంద్రసేనుఁడు నాకుఁ దండ్రిసమానుఁడు. ఆతనికుమారుఁడు సుసేనుఁడు నాప్రియసోదరుఁడు. ప్రమద్వరమాత్రము నాప్రియకాంత! ఇదిహాస్యార్థమా? విశాలభువన ప్రదేశమునఁగలవస్తుజాలములన్నియుఁ గాలక్రమమున

నశింప, నెద్దియక్షయంబై, యుజ్జ్వలంబై, నిరుపమానమై ప్రకాశిం
చునో, యాప్రేమయను మధురపదంబునం గల గంభీరార్థమును
స్వానుభవమువలన గ్రహించి, యానందించు పురుష సత్తమునకుం
గాక, తదితరులకు నాపలుకు హాస్యార్థమును స్ఫురింపంజేయును
గాదు! ప్రమద్వరను నేను మనోవాక్కాయ కర్మల ప్రేమించితిని;
వీణవాయించిన మధురగీతము వెలువడదే?—నిజమైన ప్రేమయెన్నం
డేని సంతోష ప్రదముగా జయించెనా? ఒకనాం డరణ్య భాగ
మున మృగయానంతరము సంభాషణ వశమున నామనోరథమును
ప్రమద్వర కెఱింగించితిని. నేనొనరించిన ప్రమాదమిదియ. సుసేనుం
డది తెలిసి ప్రమద్వర కెఱింగించెను. అతండు కరంబునొచ్చుకొని
కోపిష్ఠవానిని జూచునట్లుల నన్నుం జూచుచుండెను. తరువాత నే
మేమి జరిగెనో మీ రెఱుంగుదురు.—ముఖ్యాంశ మాలింపుండు. మఱి
యొకతిటి తద్వనీతలమున నే ప్రమద్వరను గలిసికొంటిని. సుసేనుండు
మరలయటకరుదెంచెను. ఆతని కోపము కడుతీవ్రమైనది. దుర్భాషల
నన్ను నొంచెను; బాధించెను. నాకాతనియందుం గల మిక్కుటమగు
ప్రేమ నన్నాతని నేమియుం జేయనియ్యదయ్యె. ప్రమద్వర రోషి
ణితో నిష్క్రమించెను. సుసేనుండు కన్నుంగవనుండి యగ్నికణములు
రాల, దిక్కులు ప్రతిధ్వనింప, నీచోక్తుల నన్ను దుఃఖపెట్టెను; నా
యందుం గోపాగ్ని రవులుకొల్పెను. అప్పుడు నేనోరపైం గరమిడితిని;
నా యవివేకమునకు నే నేసిగ్గుపడి క్షమింపుమని సుసేనుని బ్రార్థించి
తిని. ఆతండాలింపండయ్యె. హయం బెక్కి వనాంతర భాగమునకుం
బోవసాగితిని. ఆతండును నా వెంటవచ్చెను. నన్నుదూషించుచు నే
యుండెను. కటకటా! అదియెంతకష్టదినము. నేనాతని వాక్సాయ
కములను లెక్కసేయక గుఱ్ఱమునదలించుచుంటిని. వనోత్తరదిశకుం
బోవుచుంటిమి, భయంకరమగు నదియొకటి మాకెదు

రయ్యెను. ఛురీలునఁ గత్తిమాసి దానినెదిరించితిని. ఏకారణమునన యది సుసేనునివైపుపోయెను. (పు.సే భయముతో నాలించును హే.పా వెలవెలపోవును. వ.పా 'హా!' యనియఱచును)—సభ్యులారా! నన్నాలింపుఁడు. ఇందాశ్చర్యమునకుఁ గారణములేదు. సుసేనుఁడు కొంతదనుక దానితోఁ బోరాడి, హయంబును బరుగెత్తించి యెందేనింజనియె. నేనుహయంబుఁడిగ్గి. యామృగమున కెదురై నిల్చితిని. భయంకరములైన కోరలతో నన్నుఁ జిమ్మవలయునని నాపైకది గర్జించుచు వచ్చెను. ఖడ్గమునుదాని కంఠతలమున నాటితిని. ఆదారుణ ప్రహారమున నామృగము ప్రాణములువిడచెను; కత్తిరెండు తునియలయ్యెను. నాదుస్తులు రక్తమయములయ్యెను. ఆప్రదేశము తడిసినదగుట; నడుగులజాడ స్పష్టముగాఁ గానఁబడియెడు; నెత్తురు మడుఁగుగలుగఁ గాంచ మిదియు. సుసేను నరయ నేనుహయంబును సత్వరము బరుగెత్తించితిని. ఎంత వెతకినను, ఆతఁడు గానఁబడఁడయ్యె. వధించిన యడవిపందినిఁ గొనిపోవనెంచి మగుడి యటకరుదెంచితిని; గాని యెవ్వరో దాని నపహరించిరి. విచారగ్రస్తుఁడనై గృహమునకరుదెంచితిని. దౌవారికుని ప్రశ్న నాకు వినఁబడనేలేదు. నామనోగతమప్పుడు సముద్రము ననుకరించుచుండెను!—మఱియొక మాట. ఇప్పుడు హేమపాల వజ్రపాణులు మీసమక్షమునఁ జెప్పినది కేవలమనృతము. హేమపాలుని సేవకులాతని యనుమతివడసి నావెంటవచ్చిరి. వారిరువురు నాచే సంహరింపఁబడలేదు. పులింద కళింగులు ప్రమద్వరను దోకొనిపోవుచుండ వారలనెదిరించితిని. హేమపాలుని సేవకులు నాకుఁదోడైరి. కళింగుఁడు వారల జమునికేతనమున కనిపెను. ప్రమద్వరనుద్ధరించి గృహమునకుఁ దెచ్చితిని. వజ్రపాణిని నేను చూడలేదు. హేమపాలునితో మాటాడలేదు. దోషి 'నిచెప్పి మన్నింప వేడుకొనలేను. ఇదియు జరిగిన వృత్తాంతము.

(లేఖకోద్యోగి వ్రాయును.—పు. సే కన్నీరువిడచును. హే.పా భయముసూచించును. వ.పా హా! యని యఱచి పొరలును)

న్యా—(ఆశ్చర్యముతో) సభ్యులారా! విజయసేనుని మీరాలించినారలు గదా? ఈతఁడు చెప్పినదంతయు నిజమో కల్పనాచమత్కృతమో యగును. (వి. సేనునిఁజూచి) విజయసేనా! ఇందుకుసాక్షులెవరైనఁ గలరా?

వి. సే—న్యాయాధిపా! వేయికన్నులతోఁ జూచు భగవంతుఁడే యిందులకు సాక్షి! అనపరాధుల నాతఁడు సంరక్షించును.

న్యా—సభ్యులారా! తీర్పుచెప్పుటకు నాకేమియును దోఁచకున్నయది. విజయసేనుని ముఖవిలాసమును బరీక్షసేయ నాతఁడు నిర్దోషియని తోఁచెడిని. హేమపాలుఁడు గౌరవనిలయుఁడగు కులసంభూతుఁడు. ఆతఁడనృతము వచించునా? —

(నేపథ్యమునఁ గలకలము)

[సభవారందఱాశ్చర్యముతో నాలింతురు.]

(విం.ము. సు.సే. సుమం. సుమిత్రులు ప్రవేశింతురు.—సుసేనుఁడు. వి. సేనుని కౌఁగిలించుకొని యేడ్చును)

ఉ. ఎందుననుండి వచ్చితివి? నీవు సుసేనుఁడవా? మదీయయా
నందమ! స్రుక్కినాఁడవు; వనంబున నిన్విడనాడి, మొండిమై
బొందిని నిల్చినాను; తొలిపుణ్యము హేతువుచేత నీవునా
ముందర నిల్చినాఁడవు; ప్రమోదము పట్టఁగఁజాల, తమ్ముఁడా

పు. సే—హా! కుమారా!

ఆ. వె. రారనాయనా! వరాలమూట! సుసేన!
రార, మన్మథ సుకుమార! రార
రార కులపయోధి రాకాసుధాకరా!

రారయనుగుసుణ్ణి! రారతంత్రి!

(కొంగలించుకొనును;

శరీరము నిమురుచు) కటకటా!

సీ॥ పాలుగారెడుమోము బాష్పధారలుగార

చీకాకుపడి కళ చెదరిపోయె

సంస్కారణములేమి చక్కని కుంతల

ములు జడకట్టి కోమలతఁ బాసె

ఉన్నతోరతలము నొప్పిదము కనుఁ

గనుపడరాక లోఁతుగ నణంగె

అరిజనావళి గుండియలవియఁజేసెడు

బాహుపాశంబుల బలము నశలె

తే. గీ॥ కటకటా! యిన్నినాళులు కష్టపడుచు

నెందునుంటివో, యాహారమేదియో, యె

వండు నిన్నుబాధించెనో పలికినాదు

చింతఁ దీర్పుము తనయా! సుసేన! వేగ

సుమం— (సుమిత్రునితో) కుమారా! హేమపాలుఁడావలికిఁబోవకుండ చూచుచుండుము.

సుసేనుఁడు.— (విజయసేనునితో) అన్నయ్యా!

తే॥ గీ॥ నీవు సుగుణమూర్తివి; దయానిధివి; వీఁడె

ఉంగక నిను దుర్భాషల భంగపెట్టి

నిశిత కరవాలమునఁ జంప నిలచినాఁడు

మరువు నాదురితంబు; నమస్కరింతు!

(ప్రణమిల్లును)

వి. సే—తమ్ముఁడా! ఇందు నీతప్పిద మేమియును లేదు. నాయందు నీవగు పఱచిన తులలేనిప్రేమకు నేనర్హుఁడఁగాను.

సుసేనుఁడు.—(కన్నీరుగార్చి)

తే॥ గీ॥ నాదుచెలిగారముఁ గొనిన నాఁటఁగోలె
కడిఁది దుఃఖంబు నపకీర్తి పడుటెగాని
కంటనిద్రయు నన్నంబు కడుపునకును
లేక శోషిల్లినావు; సుశ్లోకచరిత!

నీయభిమానము నేనెట్లు దీర్చుకొందును? నన్నింకను బ్రేమింతువు. అన్నయ్యా!

ఆ॥ వె॥ హితునిదోషములు సహించు స్నేహితుఁడు సు
వ్రతుఁడతండు పరమహితుఁడు సుమ్ము
అట్టివాని వడసినందుకు నీయందు
నాదు భాగ్యమేమనంగవచ్చు?

న్యా—మిత్రవరులారా! తేనియతేఁటలొలుకు మీమాటలు వినఁ దనివి తీరకున్నయది. సుసేనకుమారా! నీవిన్నాళ్లెందుంటివి?

సు. సే—న్యాయాధిపా! వనప్రదేశమున వరాహమునొండుగాంచి, విజయద్వితీయుఁడనై దానినెదిరించితిని; ఒకవిధమగు ఆందోళనము హృదయమున గలఁతవెట్ట హయంబును బరుగెత్తించి వనాంతరభాగమున కఱిగితిని. కొంతవడి కాయాసమధిక మగుడు, శీతలతరుచ్ఛాయఁ గొండొకసేపు విశ్రమించితిని; గాని మనంబూరటఁ జెందలేదు. మెల్లమెల్లన హయంబును నడపించుకొనుచు విజయుసేనుని విడచిన

చోటున కతుకెంచితిని. ఆతఁడచ్చట లేఁడు; గాని జీవములు గోల్పడి యాడవిపంది యచ్చోటఁ బడియుండెను. సమీపమునఁగల సెలయేటి తీరమునఁ గూర్చుండి విజయునిరాక నిరీక్షించుచుంటిని. అత్తఱి గుఱ్ఱపుడెక్కల చప్పుడు వినవచ్చెను. ఉత్తరక్షణమున పుళిందుఁడు పరివారముతో నన్ను సమీపించెను. వానితో భయంకరయుద్ధమొనరించితిని; గాని యొక్కఁడనగుట గార్యము లేకపోయెను. కొందఱా యడవిపందిని మోసికొని నడువసాగిరి. నేను సమీపమునఁగల ప్రవాహమున దుమికితిని; నాశిరోవేష్టమందు పడిపోయెను. కొంతదనుక వారికి నేను దొరకలేదు; అలసిపోయితిని. అప్పుడు నన్నాతఁడు బంధించి, తనగృహమునకుఁ దోకొనిపోయెను. దారిపొడుగున నన్నాతఁడు తీవ్రభాషణముల నొప్పించెను. మఱియు నిట్లనియెను.

తే. గీ. అంపమునఁ జీల్చి భయము దీపింప ముక్క
ముక్కలుగఁగోసి, మఱుఁగు చమురున వేఁచి
గ్రద్దలకును కాకులకును రామబంధు
గులకును విసరువాఁడ, నిక్కువముసుమ్ము

నేను వానికి జవాబుచెప్పలేను. పారావతమను పేరఁ బరఁగు భూగృహమందొక కారాగృహమున బంధించి యుంచెను. తద్గృహాధికారి సుజయాభిధేయుఁడు. వాఁడు దినమునకొకసారి యెండి పోయిన రొట్టెనొకటి నాకాహార మిచ్చుచుండెను. దానిని నేను సాధారణముగా భుజియించి యుండలేను. తరువాతి వృత్తాంత మామె యెఱింగింపఁగలదు.

(విం. ముసలిని చూపును)

వ్యా—ఆహ్హా! నిన్నుఁజూచినతోడనె కరంబాశ్చర్యము గల్గెడిని! నీవృత్తాంత మెఱింగించి మమ్ము కృతార్థుల నొనరింపుము.

విం.ము — న్యాయాధిపా! సభ్యులారా! నిండు సభాంతరాళమున మానవతి యెలుఁగెత్తి మాటాడరాదు. విజయసేనుని రక్షణార్థము ప్రాణములను తృణప్రాయముగాఁ జూచు నేనిప్పుడు నిర్భయముగా మీ కెల్లరకుఁ గొన్ని విషయము లెఱింగింపవలయును. నా కథాప్రారంభమునకు మునుముందు మిమ్ముల నొండు నర్థించెదను. కరుణాయత్తులై తీర్పు వేడెద; హేమపాలవజ్రపాలురను నాసమక్షమున నిలుపఁ బెట్టుఁడు.

న్యా — (హే.పా — వ.పా తో) మీరిటురండు. (హే.పా వి.ము సతిని సమీపించి వణఁకుచు నిలుచుందురు)

వ.పా — హా! మరణదేవతా! కరుణింపుము. (క్రిందపడి పొరలును)

విం.ము — ఆర్యులారా! నేను సునంద యను పేరిఁటదానను. నా తలిదండ్రు లొక బీదకుటుంబమునకుఁ జెందినవారు. నాకన్నదమ్ములుగాని; యక్కచెల్లెండ్రుగాని లేరు. ఈ సౌధరాజమున కనతి దూరమున వృద్ధులగు నా జననీజనకులతో వసించుదానను. ఒకనాఁడు హేమపాలుని యన్న మాగృహమున కరుదెంచెను. నన్నాతఁడు ప్రేమభావమునఁ బలుకరించెను. ఆతని పలుకులు నా చెవులకుఁ బ్రమోదముఁ గలిగించెను. ఆతని మందస్మిత జ్యోత్స్నలు మదీయ హృదయతమంబును హరించెను. ఆతఁడు తఱచు మాయింటికరుదెంచి, నాహృదయమునఁ బ్రేమబీజమును నాటెను. నానాఁటికది పెరిగి, వృక్షమయ్యెను. సత్యపాలుని తండ్రి మృతిబొందు నపుడాతనిఁ జేరంజీరి, "కుమారా! నీవు వివాహమింకను జేసికొనియుండలేదు. సాంప్రదాయముగల కుటుంబమున నుండి యొక కన్యారత్నమును బరిగ్రహించి, వంశోద్ధరణ మొనర్పుము." అని చెప్పెను. పితృవాక్య మనుసరించి సత్యపాలుఁడు సుమిత్రయను కాంతామణినిఁ బరిణయంబాడెను; గాని నాతోడి స్నేహము మానలేదు. నన్నాతఁడు మనస్సాక్షిగా వరించెననియు, నొండు కాంతను గ్రహింపఁడనియు నమ్మికొనియుంటిని; గాని దైవనిర్ణయ

మన్యమగు డాతని కెదురాడ నోడితిని. వివాహానంతరము నన్నాతఁడు తలచుచూడలేదు. నాజననీజనకులు మరణించినతరువాత, శూన్యగృహముననుండ నిష్టములేక, సత్యపాలునిఁ గన్నారఁజూచి యైన సంతోషింప నగునని యెంచి సైరంధ్రివేషమును దాల్చి సుమిత్రాదేవి యంతఃపురమును జేరితిని. సత్యపాలుఁడు నన్ను గుర్తింపఁడయ్యె. కొంతకాలము గడచినతరువాత పరమేశ్వరుని కృపవలన సుమిత్రాదేవి గర్భముఁదాల్చెను; శుభలగ్నమున సుపుత్రోదయమయ్యెను. —పుత్రునిఁ జూచుకొని నావిచారములన్నియు మఱచితిని. వజ్రపాణీ! వినుచున్నావా? సునంద జీవములతో నున్నది. హేమపాలా! నీకిప్పుడు చెముడురాదని తలంచెదను. నీవలన నేపడిన భంగపాట్లు నీ శ్రేయాభివృద్ధికిఁ గారణములయ్యెనని యింకను నువ్విళులూరుచున్నాడవా?—సభ్యులారా! నాకన్నీళ్లుమన్నింపుడు!—దుర్వినయుఁడై హేమపాలుఁడెన్నియోసారులు నన్నుఁ బరిభవింప యత్నించెను. వజ్రా! ఇది యబద్ధమా?

వ.పా—సునందా! అపరాధములెన్నేని చేసితిని. నన్ను మన్నింపుము. నీవు ప్రజ్వలితాగ్ని కీలవు! నిన్ను స్పృశింప నెవ్వరు సాహసింతురు?—

సునంద—తరువాత, విఫలమనోరథుఁడై నన్నాతఁ డంతఃపురమునుండి తోలివేయ నెంచి, యన్నగారితో నామీద కొండెములు గల్పించి చెప్పుచుండెను. సత్యపాలుఁడు సత్యపాలుఁడు! తమ్ముని వృథాడంబరములు నమ్మలేదు. తత్కారణమున నాతనిపైనలిగి హేముఁడాతని నెట్లయినఁ గళత్రసహితముగా వధింప నెంచెను, మఱియును కళ్యాణిపురాధిపత్యమున కాశించెను. కటా! ఆవృత్తాంతము నేగ్రహింపఁ జాలనైతిని. ఒకనాఁడు సుమిత్రయు సత్యపాలుఁడును సుఖశయ్యా నిద్రించుసమయమున వజ్రపాణి వారలను సంహరించెను!

వ.పా—హా! దురాత్ముఁడు హేముని ప్రోత్సాహమున నే నావారుఁ

మున కియ్యకొంటిని! (వేదన నభినయించి) హా! హా! నాపాపరాశి మిన్నుముట్టినది!—ప్రపంచమంతయుఁ గంటకావృతమై చూపట్టె డిని. సునందా! (వణఁకుచు) మన్నింపుము! నేమరణించెదను.—

హే.పా—(భయముతో నిటుజూచును; వణఁకును)

స్యా—సునందా! తరువాత; తరువాత?

సునంద.—పిమ్మట సత్యపాలుని కుమారునిఁగూడ, హేముఁడు బ్రతుక నీయఁడని తలంచి, నిశాకాలమున నేరికినెఱుంగరాక, బాలుని నెత్తుకొని, దూరప్రయాణజనిత ప్రయాసమున కోర్చి రెండుదినములలో ముల్తానునగరమునఁ బ్రవేశించితిని. పురీంద్రసేనుఁడు సుగుణాభిరాముఁడని ప్రజలవలన నాలించి, యర్థరాత్రమున నాతనిచావడిలోఁ జిఱుతప్రాయంపు బాలుని విడచి, కన్నీరుఁ దుడిచికొనుచు, నా యూర రోగిని వేషమునఁ దిరుగుచుంటిని. విజయసేనుఁడే సత్యపాలుని కుమారుఁడు!—

హే.పా—హా! దైవమా! నిజముదాగదు! నామీద మహోన్నత మహీధరము పడినది. గత్యంతరమేమి?

సునంద.—విజయసేనుని పలుమారు చూచికొని మితిలేని యానందమొందుచుంటిని. కొన్నిదినముల తరువాత సురపాలుని కోపము నకులోనై పురీంద్రసేనుఁడు ముల్తానువీడ్కొలుపుటయు, నాదిగాఁగల చరితంబు ప్రభువులెఱింగినదే! శ్రీనగరమున కరుదెంచిన తరువాత నేను రోగిని వేషమునువిడచి, తత్పుర సమీపారణ్య భూముల గ్రుమ్మరుచు జీవయాత్రనడపుచుంటిని. ఒకనాఁడు విజయసేన సుసేనులు ప్రమద్వరతో నయ్యరణ్యమున కరుదెంచిరి. విజయుఁడు ప్రమద్వరను బ్రేమభావమునుఁ జూచువాఁడనుసంగతి నేనాదినమున గ్రహించి, కరంబానందించితిని. పరమాత్ముఁడు వారియెడ ననుకూలుఁడు గావుతమని ప్రార్థించుచుందును. పురీంద్రసేనుఁడు తనకూతును హేమునకొసంగి

పెండ్లిసేయనున్నాడని వినినప్పుడు నేనెంతవిచారించితినో, నాహృద
యమున కెఱుక. హేమపాలుఁడును కుటిలవర్తనుఁడగుట, విజయు
నిపై నేరములుఁగల్పించి, నిందలుమోపి, కఠిననిర్బంధవాసమున నిలిపి,
కరంబు బాధించెను.

"ఒకనాఁడు గగనతలమెల్ల మేఘావృతమై జగమంతయును సంధ
కారబంధురము గావించెను. శంపాపరంపరలు క్షణక్షణమునకు బయలు
పడి యాకసము నగ్నిమయము గావించుచుండెను. నిర్ఘాతసందోహం
బులు ఘుమఘుమారావముల వెలువడుచుండెను; కుంభవృష్టిగా
వర్షముగుఱియుచుండెను. అత్తఱిగమనము సాగించి, పులిందుని సౌధ
మునకుఁ బోయితిని. కళింగుఁడు నన్నుచితాసనముల ననునయించి,
భోజనమిడి సత్కరించెను. ఆనాఁడు పులిందకళింగులు ప్రమద్వర హర
ణార్థముఁ బోవ సన్నద్ధులగుచుండిరి. ఈవిషయము వారిసంభాషణముల
వలన నెఱింగితిని. తరువాత వంటయింటి సమీపమునకు కఱిగితిని.
సరసపాక నిధానులడవి పందినొండు గోయుచుండిరి; ఆపందికంఠ
ప్రదేశమున ఖడ్గఖండ మొకటి వారికిఁ గానఁబడియెను. దానినావల
బారవైచిరి. (సంచిలోనుండి ఖడ్గఖండమునుదీసి న్యాయాధికారి
యెదుటఁ బెట్టును) [లేఖకోద్యోగి వ్రాయును]

న్యా—సభ్యులారా! వనపాలుఁడు పురీంద్రసేనున కొసంగిన ఖడ్గఖండము
దీనికిసరిపోయినది! (అని రెండును కలిపిచూపును)—
(సునందతో) తరువాత? తరువాత?

సునంద—తరువాత పులిందకళింగులు ప్రమద్వరను దేగఁ బయనమైరి.
నేనువారి సౌధమంతయును వెదకి, యొకబాటగుండఁ బోవంబోవ
భూగృహ మొకటి దృగ్గోచరమయ్యెను. దాని నిర్మాణకౌశలమున
కచ్చెరువడుచు, గమనము సాగించితిని. సుజయుఁడనువాఁడు తాళము
చెవులగుత్తిని చేఁబట్టి తునికిపాట్లు పడుచుండెను. వేఱొండు గది

నుండి యార్తనాద మొకటి నా చెవులఁ బడియెను. జ్యోతిష్యము జెప్పుట యందు నాకు మిక్కిలి పరిచయము గలదని చెప్పి సుజయుని నమ్మించితిని. తాళము జెవులను వానినుండి గ్రహించితిని. సన్నని మార్గము ననుసరించి వానితోఁ గారాగృహము దరి కఱిగితిని. కృశించి, పూరిసెయ్య నొక యువకుఁడు దుఃఖించుచుండెను; దైవమును బ్రార్థించుచుండెను. ఆతఁడే సుసేనుఁడు. సుజయుఁ డాతని కొక రొట్టె నొసంగెను. సమీపమునఁగల బావికి జలహరణార్థమరిగెను. వాఁడు నీరు తోడుచుండ మెల్లనఁబోయి వానిని నూతిలోఁ ద్రోసితిని. వాఁడు భయంకర నినాద మొనరించి యందుఁబడియెను; తాళముఁ దెఱచి సుసేనుని యీవలకుఁ బిలిచితిని. (పు. సే హర్షము సూచించును) కాని, సుజయుఁడు తన పరివారముతో మఱియొక బాటనుండి ప్రవేశించి, సుసేనుని కారయందిడి, నన్నొక గృహమున బంధించెను! ఆమఱు నాఁడు పుళిందకళింగు లటకరుదెంచి, "ఓసీ! దుర్మతీ! నీకంత్యకాలము సమీపించినది! నిన్ను కాళికి బలివేసెదను. సిద్ధముగా నుండుమని" చెప్పెను. తరువాత సుసేనును నుద్దేశించి, "ఓరీ! అధమా! నీవీ లోకము వాఁడవు కావు! మృత్యుముఖమును బొంద సిద్ధపడుము!" అని కఠినముగాఁ బల్కెను. చేయునదిలేక విచారముతో నెదురుచూచుచుంటిమి. తదనంతర విషయములు గానవిశారదుఁ డీసుమంతుఁ డెఱుంగును. (లేఖకో వ్యాసి వ్రాయును)

న్యా—సుమంతా! నీవు సత్యనిరతుఁడవు. నీకుఁ దెలియు విషయము తెలింగించి మా కానందమును గూర్పుము.

సుమం—న్యాయాధిపా! సుమిత్రుఁడు జాలిగుండెవాఁడు. విజయసేనుని యందాతని కడలేని మైత్రి. ఆతనికిఁ గలిగిన దుర్గతికి కరంబు ఖిన్నుఁడై యాతని నుద్ధరింప మార్గమరయుచుండెను. ఒక నాఁడు వజ్రపాణి యాతనిం బిలిచి, "సుమిత్రా! హేమపాలునిఁ బిలువు" మని చెప్పెను.

హేమపాలుఁడు వచ్చునంతలో, వజ్రపాణికిఁ దెలియకుండ, సుమిత్రుఁడాతని మంచముక్రింద దాగుకొనియె. హేమపాలుఁడు వచ్చిన తరువాత వజ్రపాణి యాతనితోఁ గొంతవడి సంభాషించెను. ఆసంభాషణాంశమిది: పుళిందుని సేవకుఁడు దుర్జయుఁడు వజ్రపాణిని రాజమార్గమునఁ గలిసికొనియెను; తనయేలిక సౌధమునకు రమ్మనియెను. భూగృహమున సుసేనునిఁజూపి వజ్రపాణితో నిట్లనియెను. “వజ్రీ! సుసేనుఁడు లోకమునమ్మినటుల మరణించలేదు. నీవాతనిని ప్రత్యక్షముగాఁ జూచుచున్నావుకదా? హేమపాలుఁడు విజయసేనుని మరణముఁ గోరునేని సుసేనుఁడు జీవములతో నుండరాదు. ప్రమద్వరను పుళిందునకొసంగిన సుసేను నాఁతఁడు సంహరించును. ఇది మాయేలిక యభిమతము. హేమపాలున కీవార్త నెఱింగించి వలయు విధమున వర్తింపుమనుము.” అనవుడు వజ్రపాణి యటులనే యొనరింతునని వాగ్దానముజేసి హేమపాలున కీవార్త నంతయు నివేదించెను. ప్రమద్వర నన్యులకొసంగుట హేమపాలుని యభిమతముగాదు; అప్పటి కంగీకరించి, తరువాత కర్తవ్యమూహింప వచ్చునని లేఖ నొండు వ్రాసి దుర్జయునిచేఁ బుళిందునకు దానినందఁజేసెను. (హే.పా. పుళిందునకు వ్రాసిన యుత్తరమును న్యాయాధికారి కందఁజేయును) (లేఖ కొద్యోగి వ్రాయును)

న్యా—(లేఖచదివి, యాశ్చర్యభరితుఁడై) మీరందఱాలింపుడు. (ప్రకాశముగాఁ జదువును) హేమా! ఇది నీకృతమేనా?

హే.పా.—(భయవిషాదములతో) అవును! అది నేవ్రాసినదే!

న్యా—సభ్యులారా! ఈలేఖవలన హేముని కపటవర్తనము బయలుపడినది! సుమంతా! ఈలేఖ నీకెట్లులభించెను?

సుమం—సుమిత్రుఁడు మంచముక్రిందఁ డాగి వారిరువురిసంభాషణ మాద్యంతమాలించి నాకుఁదెలియఁజెప్పెను. ఆనాఁడే మేమిద్దరమును

గాయకుల వేషములుదాల్చి పుళిందుని సౌధమునకరిగితిమి. దుర్జయుఁడు తెచ్చినజాబుఁ దిలకించి పుళిందకళింగులు పరమానందభరితులై మారాక కనుమతించిరి. సంగీతశాస్త్రమున నాకుఁగల పరిచయలేశమును నాశక్తికొలఁది ప్రదర్శించితిని. సుమిత్రుఁడును కూడ నాకుఁదోడయ్యెను. ఆగానమాధుర్యమును గ్రోలి గ్రోలి, పుష్పాసవసేచనమున బుద్ధి మందీభవించిన దగుట మైమఱచి, పట్టుదిండ్లమర్చంబడిన యాసనములమీద నే వారునిదురపోయిరి. సుమిత్రుఁడు బల్లపైఁగల యుత్తరమును సంగ్రహించెను. పాటుపాటుమ మేము నిష్క్రమించితిమి. భాగ్యగృహమునకుఁ బోయి సుసేనసునందలఁ జూచితిమి. ఆఁడువారియితోఁ గారాగారముతలుపులకుఁ గల యినుపకడ్డీలను గోసితిమి. సుసేనసునంద లీవలఁబడిరి. మాకెవ్వరు నడ్డుపడలేదు. తరువాత సత్వర గమనమునఁ బ్రయాణమై యరణ్యమున కరుదెంచి రహస్యస్థలమున రాత్రియంతయుఁ డాగియుంటిమి. తెల్లవారుజామున కోలాహల మొండుదూరమున మాకువినవచ్చెను. వాయువేగమున నిటకువచ్చితిమి. పరమేశ్వరుఁడు మాకుసాయమయ్యెను. అంధకారము భాసిపోయెను. సుప్రభాత మానందదాయకముగాఁ బొడసూపినది! (లేఖ కోద్యోగి వ్రాయును)

న్యా—సుమిత్రా! నీవు సుగుణధనుఁడవు, మిత్రధర్మమెఱిఁగినవాఁడవు, నిన్ను దేవుఁడు కాపాడుగాక!

సుమి—(వ.పా సమీపించి, చూచి, న్యాయాధికారితో) దేవా! వజ్రపాణి మరి జీవింపడు.—అయ్యో! వీఁడు మరణించినాఁడు. వీనికి సంస్కారము గావించి వచ్చెదను. (శవముతో నిష్క్రమించును)

న్యా—సభ్యులారా! వజ్రపాణి పాపాత్ముఁడగుట భారము సైపలేక పరలోకమునకుఁ బోయెను. హేమపాలుఁడు పవిత్రవంశమున జన్మించినను, పరమపాతకము నాచరించి, తనజీవితము నే గాక, తన

వంశమునుగూడ కళంకభూయిష్ఠ మొనరించెను. వీఁడు భ్రాతృహంతకుఁడు! కష్టజీవి! వీని నురిదీసినఁ గార్యమేమియు నుండఁబోదు. కఠినకారాగృహ శిక్ష వీనికి విధించితిని; వీఁడు బ్రతికినన్నాళ్లు కారాగృహమున నుండవలసినదే! పుళిందకళింగుల దురంతములు మితిమీరినవి. వారలకు నిర్బంధశిక్ష విధించితిని!—విజయసేనునకుఁ బట్టాభిషేక మొనరింపవలయును. పురీంద్రసేనా! అందుకువలయు ప్రయత్నములను నీవు సేయుము.

[భటులు హే. పా. ని, శృంఖలములఁ బంధించి నడపింతురు—వి. సే.—సుసేన.—పు. సే.—సునందలు తప్ప తక్కినవారందఱు నిష్క్రమింతురు]

పు. సే.—(వి. సేనుని తో) కుమారా!

చ. తెలియక బాధపెట్టితిని; తీవ్రతరంబగు భాషణంబులన్
బలికి మనోగతంబు వలవంతలఁ బాలొనరించినాను; నీ
కులమును శీలముం దెలియఁగోరి ప్రయత్నము సేయనైతి; ని
ర్మలహృదయా! క్షమించి, యపరాధముల౯ వెలిచేసి సైపుమా!

వి. సే.—జనకా! నన్ను మీరింతగా వేఁడెదరేమి చిత్రము! నాకారణముననే కదా? మీరెల్లరు కన్నీరు గార్చితిరి? ప్రమద్వరను సుసేనుని కుశలవార్త నెఱింగించితిరా?

సునంద—పురీంద్రా! నాపలుకాలింపుము.

తే. గీ. ఏ సతీలలామ కొఱకు నెల్ల కష్ట
ములకు నోర్చి నీలాపనిందలకు శిరము
వంచె విజయసేనుఁడు శాంతభరితుఁడగుచు
నామె నాతని కొసఁగుమయ్యా! పురీంద్ర!

సప్తమాంకము

(ప్రమద్వర — రోహిణి ప్రవేశింతురు)

ప్ర—(కన్నీరుఁగార్చుచు)

౧. సీ. ఓకృపాపరతంత్ర! యోగంభీర జలధీ!
యమలగుణాకరా! యాలకింపు
హేమపాలుఁడు వడినేగుదెంచి సుసేనుఁ
డడవిలో నీహితి నణఁగెనంచు
నచియించి, న్యాయాధిపతులరుదెంతురు;
విజయసేనుఁడు భూమివిడచు నతివ!
యభిమానముండిన నరుగు మెందేనియు
నిలువఁగ రాదోక నిమిష మేని
ఆ. వె. యని లిఖింపు జాబు జని నేను విజయాంకు
న కొసఁగి యెటకేని నడచునటులఁ
జేయుదనఁగ వ్రాలు జేసి యంపితి లేఖ
పాపమెఱుఁగనీదు పాదమాన

(అని పాదములపై వ్రాలును)

సునంద—విజయసేనా! ప్రమద్వర నిర్దోషి. నీవు దోషివని యీమెకల నైన దలంపలేదు. హేమపాలుని వాక్యములవలన నీవు దారుణావస్థ నున్నటులఁ దలంచి, భయపడి, నిన్ను రక్షింప తెఱం గెఱుంగక, హేముని యభిమతానుగతముగ లేఖవ్రాసి నీకంపినది. ఇది భావ్యము. నీవా లేఖనుగూర్చి విచారింప నవసరములేదు.—

వి. సే—అమ్మా! చెప్పవలయునటే! ప్రమద్వర నిజముగా ప్రమద్వర!

సునంద—పురీంద్రసేనా! నాకుమారుని విజయుని నిండారు ప్రేమ భావమునఁ బెంచితివి. నీయుపకారము నేమఱువఁజాలను!

దౌ. వా — (ప్రవేశించి) దేవా! పురీంద్రమహాశయా! ముల్తానునగరము నుండి యమాత్య శేఖరుం డొకఁ డరుదెంచి ద్వారము దరి వేచియు న్నాఁడు.

(పు. సేనుఁ డేమరేఁగి, యమాత్యునితోఁ బ్రవేశించును)

పు. సే — కేసరీ! సురపాలక్ష్మాపాలునకు క్షేమమే? నీకుఁ గుశలంబా?

కే — దేవా! అందఱును క్షేమమున్నవారు, మీరీలేఖం దిలకింపుఁడు. (ఉత్తరమిచ్చును)

పు. సే — (అందుకొని, యాత్మగతమునఁ జదివికొని, వి. సేనున కిచ్చును. వి. సే. గట్టిగాఁ జదువును)

శ్రీ పురీంద్రసేన మహాశయునకు. ముల్తానునగరాధ్యక్షుఁడగు సురపాలుఁడు వ్రాయు విషయములు:

మోసకారులగు కొందఱు మంత్రుల పలుకులాలించి, నిన్నుఁ బరభూములకుఁ దోలినాఁడను, నాయపరాధము మన్నించి, ముల్తాననగరమున కరుదెమ్ము. నీవియోగవహ్నిపలనఁ గరంబు కృశించితిని.

సురపాలుఁడు."

సునంద — ఆహా! ఆనందమానందము! పురీంద్రా! అన్నియుం శుభప్రదముగా ముగిసినవి! నీకోర్కులు ఫలించినవి. ఇంకేమికావలయును?

పు. సే — తల్లీ! సుగుణహారి విజయసేనుఁ డల్లుఁడయ్యె; పున్నెముల గంప కుమారుఁడు లభించె; పుణ్యవతివగు నీ చెలికారము గలిగెను; సురపాలునకు మరల నాయందు తొల్లిఁటి యభిమానము పొడమూపె. నాకిం డొక యభిలాష యేదికలదు? అయిన నిట్లగుఁ గాక!

తే. గీ. విమలమగు ప్రేమ చెదరక వెలయురీతి;
మనచరిత్రంబు పుట్టని జనులచేత
జనన మొందఁగనున్న బాషలనభినయ
ముఁగనుగాత! సూపదులు ప్రమోదమొంద

అందఱు: — తథాస్తు!

సమాప్తము

— ౧ రాజవైద్యశాల

రాజమహేంద్రవరము.

దేశమునందెన్నియో వైద్యశాలలు బయలుదేరినవి. ఎంతమందో దంభప్రకటనలు చేసి ప్రజలవద్ద డబ్బు లాగు చున్నారు. మా వైద్యశాల అట్టిదికాదు. ఇందన్నిరోగములకు తగుఔషధములు సిద్ధముగ నుండును. ప్రతిఔషధము కాడు చౌకగా నుండగలదు. మేము చెప్పినప్రకారము పథ్యపాన ములు చేసినను మామందులు గుణమీయనియెడల పోస్టు ఖర్చులతో కూడ మామందులఖరీదు యిచ్చివేయబడును. అనేక వేల యోగ్యతాపత్రములు గలవు. ఒక్కమారు పరీక్షించండి.

స్టూడెంట్సు కల్యాప

విద్యార్థులకిది కల్పవృక్షమువంటిది. అతివేడివలన శుక్ల నష్టము (స్పెర్మటోరియా) తలనొప్పి, పార్శ్వపునొప్పిమున్నగు వ్యాధులతో బాధపడు విద్యార్థులు దీనిని సేవించిన వారము రోజులలో మంచి ఆరోగ్యవంతు లగుచున్నారు. ఒక ఆయుర్వేదవిద్యాప్రవీణుడగు సిద్ధుని సలహాప్రకారము తయారుచేయ బడిన క్రొత్తమందు.

15 రోజులకు సరిపోవు లేహ్యము రూ 2—0—0

డిటో పొట్లములు 1—0—0

ఒకపూట లేహ్యము ఒకపూట పొట్లము చొ॥ వేసికొనుచో 15 దినములలో వజ్రదేహమగును. పరీక్షించి మేలుపొంద గోరుచున్నారము.

సంతోషామృతము

ఈలేహ్యము సేవించుటవలన ఎంతో ఆకలి కలుగును. సులభముగ ఎంతకఠినపదార్థమయినను జీర్ణమగును. వీర్య వృద్ధికి చెప్పినమందు. ఒక్కమోతాదు వేసుకొనిన నపుంసకుడు సహితము సంతానవంతు డగుచున్నాడు. నవీనదంపతులకు సంతోషమును కలుగజేయు అమృతమువంటిది. వెల 15 రోజులకుసరిపోవు డబ్బీ రూ 2—?—0.

అజీర్తిహారి

సర్వరోగములకును అజీర్తి ప్రధానమగుచున్నది. అట్టి అజీర్తిని రూపుమాపుటకు యీమందొక్కటే కలదు. గడ్డదుబియ్యపు అన్నము తినినను జీర్ణించుకొనలేనివాడు 15 రోజులలో మా నెదుబియ్యపు అన్నము తినగలడు.


15 రోజులకు సరిపోవుమందు రూ 1—8—0

కలరాకు, వాతరోగములకు, పక్షవాతములకు, ఉబ్బు జబ్బులకు, సుఖవ్యాధులకు శ్వాసరోగములకు, దగ్గు, వగర్పు మున్నగు వ్యాధులకు అనేక మందులు సిద్ధముగనున్నవి. మీ జబ్బు వివరములనువ్రాసిన ఉత్తరములు రహస్యముగనుంచి, తగినమందు నిర్ణయించి పంపుచున్నారము.

వలయువారు;—

డాక్టరు— రాజవైద్యశాల, రాజమండ్రి.

ప్రకటన



ఇండియా అంతకు ఏజంట్లు కావలయును.

ఆంధ్రోద్యమమునకు తోడ్పడరా?

మేజోళ్లు మేలైనవి, పసందైనవి, గట్టివి, ఏరంగులోనైన, ఏకాలతకలవైనను, సరే, మావద్ద సరసమైన ధరలకు దొరకును.

9 అం గలవి డ 1 కి	4—8—0
10 అం గలవి డ 1 కి	డిట్టో
11 అం గలవి డ 1 కి	డిటో

వర్తకులకు, విశేషసరకు కొనువారికిన్ని ధారాళమైన కమీషను ఈయబడును. నేడే కార్డు వ్రాయుడు.

ఆంధ్ర నిట్టింగు ఫ్యాక్టరీ,

220 చైనాబజారు రోడ్, మద్రాసు.

బ్రహ్మశ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారిచే వ్రాయబడిన ఈ క్రింది గ్రంథములు పైమరి స్కూళ్లలో చెప్పుటకును, వినోదముగా చదువుకొనుటకును వీలుగానున్నవి.

విజయనగరరాజులకథలు.	౦—౩—౦
చిత్తూరురాజులకథలు.	౦—౪—౦
ఢిల్లీచక్రవర్తులకథలు.	౦—౮—౦
గోల్కొండనవాబులుకథలు.	౦—౨—౦

వలయువారు;— **హరి అండ్ కో**

రాయవరము, రామచంద్రపురము పోష్టు, గోదావరిజిల్లా.

ఆంధ్రసారస్వతనికేతనము.

రాజమహేంద్రవరము

మనోహరములు, నీతిబోధకములు, జాతీయపరిబోధక
, నగుగ్రంథములు ప్రకటింపబడుచున్నవి. చందాదారు
తిని యీకాగితము కరవురోజులలో కూడ చౌకగాదొ
.లవు. చాలమంది గ్రంథముద్రణము మానినను, సంవ
రమునకొక గ్రంథము వేయుచు కాలక్షేపము చేయుచున్న
ఇతరగ్రంథమాలల వారివలె గాక సకాలములో రెండునెల
,కొకరూపాయి విలువగల గ్రంథములు మేలైనఇంగ్లీషుకాగి
తముమీద ముద్రించుచున్నాము.

[1] నూరుపుటలకు నాలుగణాలువంతున చందాదారులకు
గ్రంథములు చౌకగా నీయబడుచున్నవి.

[2] నాలుగణాలు ప్రవేశరుసుము క్రిందనిచ్చి లేదా మొ
దటి వి.పితో రాబట్టుకొనుమని వ్రాసి ప్రతిగ్రంథము వి.పి త్రిప్పివే
యకుండ పుచ్చుకొనువారు చందాదారులుగా యెన్నబడుదురు.

[3] రెండుమారులు వి.పి త్రిప్పివేయు చందాదారులు అర్థ
రూపాయిచెల్లించి తిరుగా చందాదారులు కావలసియుందురు.

[4] మాపుస్తకములలో "దేశోద్ధారకులు" యీసంవ
త్సరము స్కూలుఫయినలు పెట్టిన కావున ఇంతటినుండి చందా
దారులై మాపుస్తకములు తెప్పించుకొనువారికి స్కూలుపుస్త
కములుగా పెట్టబడుచుండు మాపుస్తకములన్నియు చౌకగా
దొరకగలవు. ఇవే ఇతరులకు అప్పటి కాగితముధరనుబట్టి
[illegible] నగద కాగలవు